
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 341

శనివారం 2-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

పర్యావరణం



సరోజ్ బెన్, జరీనా, ముంతాజ్‌లాంటి సామాన్య మహిళలు తమలాంటి సామాన్యుల కోసం వాయు కాలుష్యంపై ఢిల్లీ గల్లీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోర్టబుల్ ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) మానిటర్‌లతో 'వాయు కాలుష్య నివారణకు మన వంతుగా చేయాల్సింది' అనే అంశంపై ప్రచారం చేస్తున్నారు...

ఏక్యూఐ ఉమెన్ అంబాసిడర్

ఢిల్లీలోని నందనగిరి ప్రాంతం.

చేతిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) మానిటర్‌తో 39 సంవత్సరాల సరోజ్ బెన్ ఇద్దరు ముగ్గురు మహిళలతో మాట్లాడుతున్నప్పుడు 'విషయం ఏమిటీ?' అని అడుగుతూ మరో ఇద్దరు మహిళలు, ఆ తరువాత మరో ముగ్గురు మహిళలు వచ్చారు.

అడిగిన వారికల్లా ఓపిగ్గా చెబుతోంది సరోజ్.

'మీ ఏరియాలో వాయుకాలుష్యం ప్రమాదకరమైన స్థాయిలో ఉంది...' అంటూ ప్రారంభించి ఆ సమస్య తలెత్తడానికి కారణాలు, దీని ప్రభావం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, నివారణ చర్యలు... మొదలైన వాటి గురించి చెబుతూ పోయింది.

'మీరు గవర్నమెంట్ ఆఫీసరా?' అని ఎవరో అడిగారు.

'కాదమ్మా, నేనూ నీలాగే గృహిణిని. పెరుగుతున్న వాయుకాలుష్యం గురించి బాధపడి, కాలుష్య నివారణకు నా వంతుగా ఏదైనా చేయాలని ఇలా వీధులు తిరుగుతున్నాను' అని చెప్పింది సరోజ్.

సరోజ్ బెన్ మాత్రమే కాదు గ్రాస్‌రూట్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' కమ్యూనిటీ మూమెంట్ 'హెల్ప్ ఢిల్లీ బ్రీత్' ప్రభావంతో ఎంతోమంది సామాన్య మహిళలు వాయు కాలుష్యంపై అవగాహన చేసుకున్నారు. తమలాంటి వారికి అవగాహన కలిగించడానికి వాడవాడా తిరుగుతున్నారు.

కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, సాధారణ పౌరుల్లో వాయు కాలుష్యంపై అవగాహన కలిగించడానికి మహిళా హౌజింగ్ ట్రస్ట్, హెల్ప్ ఢిల్లీ బ్రీత్ సంస్థలు సామాన్య మహిళలకు శిక్షణ ఇస్తున్నాయి. పోర్టబుల్ ఏక్యూఐ మానిటర్‌లతో ఢిల్లీలోని గల్లీలు తిరుగుతూ వాయుకాలుష్య నివారణపై ప్రచారం నిర్వహిస్తున్న ఈ మహిళలు 'ఏక్యూఐ ఉమెన్ అంబాసిడర్'లుగా గుర్తింపు పొందారు.

ఏక్యూఐ అంబాసిడర్‌లు హెల్ప్ ఢిల్లీ బ్రీత్, మహిళా హౌజింగ్ ట్రస్ట్ నిర్వహించే సమావేశాలకు హాజరు కావడమే కాదు ప్రచార వ్యూహాల గురించి కూడా ఒకరితో ఒకరు చర్చించుకుంటారు. 'కమ్యూనిటీ యాక్షన్ గ్రూప్'గా ఏర్పడి సమాచారాన్ని ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటారు.

'వాయు కాలుష్యం గురించి కొద్దిసేపు మీతో మాట్లాడాలనుకుంటున్నాను అని ఒక గృహిణితో అన్నప్పుడు నా ముఖం మీద తలుపు వేసినంత పనిచేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్నాను. ఈసారి అలా కాదు ఇలా చేయాలనుకున్నాను. ఢిల్లీలోని నెహ్రూ నగర్‌కు వెళ్లినప్పుడు నా బ్యాగులో ఉన్న కొన్ని పోస్టర్‌లను ఆమెకు చూపాను. అవి చూసి అయ్యో ఏమిటి ఇది అన్నట్లుగా అడిగింది. అలా మెల్లగా టాపిక్‌ను మొదలుపెట్టాను. ఆమె చాలా శ్రద్ధగా విన్నది. పరిస్థితులను బట్టి ఏ రూట్‌లో వెళ్లాలో అప్పటికప్పుడు నిర్ణయించుకుంటే సమస్య ఉండదు' అంటుంది సీమ అనే ఏక్యూఐ అంబాసిడర్.

'ఉపన్యాసం ఇచ్చినట్లు కాకుండా మన ఇంటి పరిసరాల్లో ప్రమాదం పొంచి ఉంటే ఎలా చెబుతామో అలా వాయు కాలుష్యం గురించి చెబుతాను. ఉదాహరణలతో అర్థమయ్యేలా చెబుతాను. పెద్దవాళ్లకే సాధ్యం కాని పెద్ద సమస్య ఇది. మన వల్ల ఏమవుతుంది... అని కొందరు అంటారు. మీలా అందరూ అనుకోవడం వల్లే అది పెద్ద సమస్యగా మారింది అని నేను అంటాను. మొదటగా మీరు చేయాల్సింది మీ పెరట్లో ఒక మొక్క నాటడం అని సలహా ఇస్తాను. నేను చెప్పింది వారికి నచ్చినట్లు వారి హావభావాలను బట్టి గ్రహిస్తాను' అంటుంది ఏక్యూఐ అంబాసిడర్ ముంతాజ్.

ఏక్యూఐ అంబాసిడర్‌ల కృషి వృథా పోవడం లేదు. ఇప్పుడు ఎంతో మంది కాలుష్యాన్ని నియంత్రించే చర్యల గురించి నిర్మాణాత్మకంగా మాట్లాడుతున్నారు. వారు పెద్ద చదువులు చదుకున్నవారేమీ కాదు. సామాన్య మహిళలు. ఏక్యూఐ అంబాసిడర్‌ల విజయానికి ఇది ఒక ఉదాహరణ.

మార్పు మొదలైంది...



జరీనా ప్రతిరోజూ ఏక్యూఐ మానిటర్‌తో ఉదయం, సాయంత్రం వివిధ ప్రాంతాలలో పొల్యూషన్ లెవెల్స్‌ను చెక్ చేస్తుంది. 'కొన్నిసార్లు కాలుష్యం తక్కువగా, మరికొన్నిసార్లు ఎక్కువగా ఉంటుంది. కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు ఏక్యూఐ మానిటర్‌పై ఎరుపు రంగు కనిపిస్తుంది. కొత్త సంఖ్యలు కనిపిస్తాయి. ఒకప్పుడు వాయుకాలుష్యం గురించి పెద్దగా ఆలోచించేవారు కాదు. అయితే ఇప్పుడు చాలామందిలో మార్పు రావడాన్ని గమనించాను' అంటుంది జరీనా.

ఏక్యూఐ అంబాసిడర్ అయిన జరీనా వాయునాణ్యత, వెంటిలేషన్, బొగ్గు పొయ్యిలకు దూరంగా ఉండడం... మొదలైన అంశాలపై ఢిల్లీ గల్లీలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది.

ఇలా కూడా...

వాడ వాడలా తిరుగుతూ వాయుకాలుష్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాదు లేబర్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్, సుమన్ యోజనలాంటి ప్రభుత్వ సామాజిక, సంక్షేమ పథకాల గురించి భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు తెలియజేస్తున్నారు ఏక్యూఐ అంబాసిడర్‌లు. స్కీమ్‌కు సంబంధించిన పత్రాలు నింపడం నుంచి ఐడీ కార్డులు వారికి అందేలా చేయడం వరకు ఎన్నో రకాలుగా సహాయం అందిస్తున్నారు.

సీజన్



మార్చి వచ్చింది.. బోండాం కొట్టు..

'కొబ్బరి నీళ్ల జలకాలాడి
కోనసీమ కోకాగట్టి'...
అని రాశాడు వేటూరి.

కొబ్బరి నీళ్లతో జలకాలాడే భాగ్యం సామాన్యుడికి లేదు. పూర్వం కొన్ని బావుల్లో నీళ్లు కొబ్బరి నీళ్లలా అనిపించేవి. జనానికి ఆ బావి ఫేవరెట్‌గా ఉండేది. 'ఎన్ని ఫ్యాన్లున్నా ఒక్క ఏసీకి సమానం కావు గందా' అని ముళ్లపూడి వెంకటరమణ అన్నట్టు ఎన్ని బిస్లరీ బాటిళ్ల నీళ్లైనా ఒక్క కొబ్బరిబోండాంకు సమానం కావు. సృష్టి మొత్తం మీద గర్భాన తియ్యటి, శుభ్రమైన నీళ్లను దాచుకున్న కాయ కొబ్బరికాయ మాత్రమే. పండ్ల రసాలు తయారు చేసేటప్పుడు ఏదో ఒక మేరకు ఇన్ఫెక్ట్ కావచ్చు. కాని కొబ్బరినీళ్లను కలుషితం చేయలేము. అందుకే వేసవి వచ్చిందంటే ఎండలో కాయకష్టం చేసేవారికి, రోజంతా రోడ్ల పై తిరిగే సన్న జీవులకి, కార్లలో తిరిగే కలిగిన వారికీ కూడా కొబ్బరినీళ్లు ప్రాణధార.

అదేమిటోకాని కొన్ని విషయాలు విశ్వామిత్రుడి అకౌంట్‌లో పడ్డాయి. పౌరాణిక విశ్వాసాల ప్రకారం కొబ్బరికాయ బ్రహ్మదేవుని సృష్టి కాదట. విశ్వామిత్రుడిది అట. ఎవరు సృష్టించినా భారతీయులకు కొబ్బరికాయ లేకుండా పూట గడవదు. భక్తి కలిగిన వారికి పూజల్లో, జఠరాగ్ని కలిగిన వారికి వంటల్లో కొబ్బరి తప్పనిసరిగా ఉండాల్సిందే. మరి మార్చి వచ్చిందంటే గెలలు గెలలుగా దిగే కాయ కత్తికి సర్రున తెగుతూ తన నీటితో జిహ్వకు జీవం పోస్తుంది. కాని కొబ్బరి నీళ్ల గురించి కొన్ని వివరాలు తెలుసుకొని ఉండి వాటిని సేవించడం మంచిది.

ప్రయోజనాలు: కొబ్బరి నీళ్లు పోషకాలు, ఎలక్ట్రోలైట్లను ఇస్తాయి. ఒక రకంగా కొబ్బరి నీళ్లు నోటి ద్వారా ఒంట్లో చేరే సెలైన్‌బాటిల్‌తో సమానం. మన శరీరానికి రోజుకు కనీసం 280 మిల్లీగ్రాముల సోడియం కావాలి. ఒక కొబ్బరి బోండాంలో దాదాపు 300 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. అంటే శరీరానికి కావాల్సిన సోడియం రోజుకు సరిపడా అందినట్టే. ఇక పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్ కూడా సమృద్ధిగా ఉంటాయి. అందుకే కొబ్బరినీళ్లు ఉత్తమ లవణ జలం. వీటిని మధ్యాహ్న భోజనానికి ఒక గంట ముందు, లేదా సాయంత్రం వేళల్లో తీసుకుంటే మంచిది. వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి కొబ్బరినీళ్లు ఉత్తమ సహాయకారి. ఎండల్లో వాంతులు, విరేచనాలు అవుతుంటే కొబ్బరినీళ్లను మెల్లమెల్లగా ఎక్కువసేపు తాగితే శరీరం పుంజుకుంటుంది. ఎండ వల్ల చర్మం టాన్ అయితే కొబ్బరినీళ్లతో బాగా రుద్దితే ఆ టాన్ పోతుంది. ముఖంపై మొటిమలు ఉంటే కొబ్బరినీళ్లలో ముంచిన దూదితో శుభ్రం చేస్తే అవి పోతాయి. వేసవిలో చెమట వల్ల వచ్చే దుర్వాసన పోవాలంటే కొబ్బరినీళ్లు తాగాలి. జీర్ణక్రియకు మంచిది. కొబ్బరినీళ్లలో ఉన్న పొటాషియం బీపీని నియంత్రించడానికి, కిడ్నీల పని తీరుకు తోడ్పడుతుంది. కొబ్బరి నీళ్లలో యాలకుల పొడి చిటికెడు వేసుకుని తాగితే అరికాళ్లలో మంటలు తగ్గుతాయి. 'దేహమే దేవాలయం' అన్నారు. దేవాలయంలో కొబ్బరికాయ కొడితే ఏ ఆధ్యాత్మిక ఫలితాలు కలుగుతాయో, కొబ్బరినీళ్లు తాగితే దేహమనే దేవాలయానికి అవే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

బ్యూటిప్స్



పిగ్మెంటేషన్... కీరాతో కట్



అరకప్పు కీరదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి 20 నిమిషాల పాటు ఆరనిచ్చిన తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. కీరదోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. దీనివల్ల ముఖంపైన ముడతలు, సన్నని చారలు వంటి సమస్యలు దూరం అవుతాయి.

బార్లీతో మేని మిలమిల



ఒక పాత్రలో బార్లీ గింజల పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్లు పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. పావుగంట తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచు చేస్తే.. మచ్చలు, మృత కణాలు తొలగిపోయి చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది.

మిరియాలతో చుండ్రుకు చెక్!



మిరియాలు ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయని అందరికీ తెలుసు. అయితే ఆరోగ్యానికే కాదు జుట్టు సంరక్షణకు సైతం మిరియాలు ఉపయోగపడతాయి. ముఖ్యంగా చుండ్రు సమస్యను చాలా సులువుగా పోగొట్టే సత్తా మిరియాలకు ఉంది. ఇందుకోసం ఒక ఉల్లిపాయను తీసుకుని పొట్టు తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని మిక్సీజార్‌లో వేసి వీటితోపాటు టేబుల్ స్పూన్ నల్ల మిరియాలు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న మిశ్రమం నుంచి జ్యూస్‌ను సపరేట్ చేసుకోవాలి. ఇప్పుడు ఈ జ్యూస్‌లో టేబుల్ స్పూన్ ఆవనూనె, టేబుల్ స్పూన్ అలోవెరా జెల్ వేసుకుని అన్నీ కలిసేలా బాగా కలుపుకోవాలి. దీంతో ఒక హెయిర్ టానిక్ రెడీ అవుతుంది. ఈ టానిక్‌ను మాడుకు పట్టించి 10 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి. గంట తర్వాత మైల్డ్‌షాంపూతో శుభ్రంగా తలస్నానం చేయాలి. ఇలా చేస్తే ఎంత తీవ్రంగా ఉన్న చుండ్రు అయినా మాయం అవడంతోపాటు తెల్ల జుట్టు త్వరగా రాకుండా ఉంటుంది. జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

• రోటరీ సర్వీస్

మాది సమష్టి సేవ



ప్రభుత్వం అన్నీ చేస్తుంది... కానీ!
చేయాల్సినవి ఇంకా ఎన్నో ఉంటాయి.
సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు అన్నం పెడుతుంది ప్రభుత్వం.
చెప్పుల్లేకపోతే వచ్చే వ్యాధులను అరికట్టేదెవరు?
స్కూలు భవనం కడుతుంది ప్రభుత్వం.
ప్రహరీలు... టాయిలెట్‌లను మరచిపోతుంటుంది.
హాస్పిటళ్లను కట్టిస్తుంది ప్రభుత్వం.
వైద్యపరికరాల్లో వెనుకబడుతుంటుంది.
'ప్రభుత్వం చేయలేని పనులు చేయడమే మా సేవ'
అంటున్నారు రోటరీ క్లబ్ గవర్నర్ డా.శంకర్‌రెడ్డి.

'మనది పేద ప్రజలున్న దేశం. ప్రభుత్వాలు ఎంత చేసినా ఇంకా కొన్ని మిగిలే ఉంటాయి. ఆ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చే వాళ్లందరం సంఘటితమై చేస్తున్న సేవలే మా రోటరీ క్లబ్ సేవలు' అన్నారు బుసిరెడ్డి శంకర్‌రెడ్డి. ఒక రైతు తన పొలానికి నీటిని పెట్టుకున్న తర్వాత కాలువను పక్కపొలానికి మళ్లిస్తాడు. అంతే తప్ప నీటిని వృథాగా పోనివ్వడు. అలాగే జీవితంలో స్థిరపడిన తర్వాత సమాజానికి తిరిగి ఇవ్వాలి. అప్పుడే జీవితానికి సార్థకత అన్నారు. సమాజానికి తమ సంస్థ అందిస్తున్న సేవల గురించి సాక్షితో పంచుకున్నారాయన.

'కష్టపడడమే విజయానికి దారి'... ఇందులో సందేహం లేదు. కష్టపడి పైకి వచ్చిన వారిలో సేవాగుణం కూడా ఉంటుంది. నేను 1994లో మెంబర్‌షిప్ తీసుకున్నాను. అప్పటి నుంచి మా సీనియర్‌ల సర్వీస్‌ను చూస్తూ మేము ఇంకా వినూత్నంగా ఏమి చేయవచ్చనే ప్రణాళికలు వేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. సర్వీస్‌లో ఉండే సంతోషాన్ని ఆస్వాదిస్తున్నాను. చదువుకునే పిల్లవాడికి పెన్ను ఇవ్వడం కూడా చాలా సంతృప్తినిస్తుంది. ఆ పెన్ను అందుకునేటప్పుడు పిల్లల కళ్లలో చిన్న మెరుపు, ముఖంలో సంతోషం... ఇవి చాలు ఈ జీవితానికి అనిపిస్తుంది. నేను స్కూళ్ల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టడానికి కారణం కూడా అదే. మంచినీటి సౌకర్యం లేని స్కూళ్లలో ఆర్‌వో ప్లాంట్, కొన్ని స్కూళ్లకు టాయిలెట్‌లు, హ్యాండ్ వాష్ స్టేషన్‌లు, తరగతి గదుల నిర్మాణం, క్లాస్‌రూమ్‌లో బెంచీలతో మొదలైన మా సర్వీస్‌లో ఇప్పుడు పిల్లల ఆరోగ్యం ప్రధానంగా మారింది. ఎందుకంటే ప్రభుత్వ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో ఉండే పిల్లలకు ప్రభుత్వం కొంతవరకు సౌకర్యాలు కల్పిస్తుంది. కానీ అప్పటికప్పుడు తీర్చాల్సిన అవసరాలకు నిధులుండవు. వాటిల్లో ప్రధానమైనది ఆరోగ్యం. వాతావరణం మారిన ప్రతిసారీ పిల్లల మీద దాడి చేయడానికి సీజనల్ అనారోగ్యాలు పొంచి ఉంటాయి. మీరు ఊహించగలరా పాదాలకు సరైన పాదరక్షలు లేకపోవడం వల్ల చలికాలంలో పిల్లలు అనారోగ్యం బారిన పడతారు. నులిపురుగుల కారణంగా అనారోగ్యాల పాలవుతారు. హాస్టల్ ఆవరణలో కూడా చెప్పులతో తిరగాలని చెప్పడంతోపాటు మంచి బూట్లు ఇవ్వడం వరకు రోటరీ క్లబ్ ద్వారా చేస్తున్నాం. బూట్లు కూడా మంచి బ్రాండ్‌వే. లోటో కంపెనీ షూస్ మార్కెట్‌లో కొనాలంటే రెండు వేలవుతాయి. ఆ కంపెనీతో మాట్లాడి వారి సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) ప్రోగ్రామ్ కింద మూడు వందల లోపు ధరకే తీసుకున్నాం. మేము సర్వీస్ కోసం చేసే ప్రతి రూపాయి కూడా నేరుగా ఆపన్నులకే అందాలి. కమర్షియల్‌గా వ్యాపారాన్ని పెంపొందించే విధంగా ఉండదు. పిల్లలకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించడం వల్ల చాలామంది పిల్లల్లో కంటిచూపు సమస్యలున్నట్లు తెలిసింది. ప్రభుత్వం కంటి సమస్యల కోసం పెద్ద ఎత్తున వైద్యశిబిరాలు నిర్వహించినప్పటికీ పిల్లల మీద దృష్టి పెట్టలేదు. రవి గాంచని చోటును కవి గాంచును అన్నట్లు... ప్రభుత్వం చూపు పడని సమస్యల మీద మేము దృష్టి పెడుతున్నాం. శంకర్ నేత్రాలయ, మ్యాక్సివిజన్, ఆస్టర్ గ్రూప్ వైద్యసంస్థలతో కలిసి పని చేస్తున్నాం.

తక్షణ సాయం!

ఆరోగ్యం, చదువుతోపాటు ప్రకృతి విలయాలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు తక్షణ సాయం కోసం స్థానిక కలెక్టర్‌ల నుంచి పిలుపు వస్తుంది. అలా ఇల్లు కాలిపోయిన వాళ్లకు పాత్రలు, నిత్యావసర దినుసులు, దుస్తులు, దుప్పట్లు... వంటివి ఇస్తుంటాం. మా సేవలకు స్థిరమైన నిధి అంటూ ఏదీ ఉండదు. సాధారణంగా ఇందులో సభ్యులుగా జీవితంలో ఆర్థిక స్థిరత్వాన్ని సాధించి సమాజానికి తమ వంతుగా తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతో వచ్చే వాళ్లే ఉంటారు. తక్షణ సాయానికి ఆ స్థానిక క్లబ్ సభ్యులు సొంత డబ్బునే ఖర్చుచేస్తారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం చేపట్టే కార్యక్రమాలకు మాత్రం కచ్చితంగా ప్రాజెక్టు రిపోర్ట్, కొటేషన్ సిద్ధం చేసుకుని నిధుల సమీకరణ మొదలు పెడతాం. ఇందులో మూడింట ఒక వంతు క్లబ్, ఒక వంతు దాత, ఒక వంతు ఇంటర్నేషనల్ రోటరీ ఫౌండేషన్ సహకరిస్తుంది.



• బంజారా హిల్స్ గవర్నమెంట్ స్కూల్ పిల్లలకు షూస్ పంపిణీ

ఇది సమష్టి సేవ!


రోటరీ క్లబ్ ద్వారా అందించే సేవలన్నీ సమష్టి సేవలే. ఏ ఒక్కరమూ తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకోకూడదు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ కలిపి మా పరిధిలో 113 క్లబ్‌లున్నాయి. ఎక్కడి అవసరాన్ని బట్టి అక్కడి సభ్యులు స్పందిస్తారు. సమష్టిగా నిర్ణయం తీసుకుంటాం. ఇక నా వ్యక్తిగత వివరాల విషయానికి వస్తే... మాది భద్రాచలం దగ్గర రెడ్డిపాలెం. పూర్వికులు ఆంధ్రప్రదేశ్, పల్నాడు జిల్లా నర్సరావు పేట నుంచి భద్రాచలానికి వచ్చారు. సివిల్ కాంట్రాక్టర్‌గా ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డ్‌కు సర్వీస్ ఇస్తున్నాను. మా ఊరికి నేను తిరిగి ఇస్తున్నది నీటి వసతి. పేపర్ మిల్లు నుంచి వెలువడే వాడిన నీటిని మా ఊరి పంట పొలాలకు అందించే ఏర్పాటు కొంత వరకు పూర్తయింది. పైప్‌లైన్ పని ఇంకా ఉంది. మేము గోదావరి తీరాన ఉన్నప్పటికీ నది నుంచి మాకు నీళ్లు రావు. గ్రామాల్లో విస్తృతంగా బోర్‌వెల్స్ వేయించాం. బూర్గుంపాడులో నేను చదువుకున్న స్కూల్‌కి ఆర్‌వో ప్లాంట్ నా డబ్బుతో పెట్టించాను. 'ఇవ్వడం'లో ఉండే సంతృప్తి మాత్రమే మా చేత ఇన్ని పనులు చేయిస్తోంది. నాకు అరవై దాటాయి. కుటుంబ బాధ్యతలు పూర్తయ్యాయి. మా అమ్మాయి యూఎస్‌లో ఉంది, అబ్బాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఇక నేను సర్వీస్ కోసం చేస్తున్న ఖర్చు గురించి నా భార్య అన్నపూర్ణ ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. కొన్ని కార్యక్రమాలకు నాతోపాటు తను కూడా వస్తుంది. కాబట్టి సమాజంలో ఉన్న అవసరతను అర్థం చేసుకుంది, నన్ను కూడా అర్థం చేసుకుంది. కాబట్టే చేయగలుగుతున్నాను'' అని వివరించారు రొటేరియన్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి.

– వాకా మంజులా రెడ్డి
ఫొటో: గడిగె బాలస్వామి

శ్రీమంతులకు స్వాగతం!

జీవితంలో సుసంపన్నత సాధించిన వారిలో చాలా మందికి సొంత ఊరికి ఏదైనా చేయాలని ఉంటుంది. తాము చదువుకున్న స్కూల్‌ను అభివృద్ధి చేయాలని ఉంటుంది. అలాంటి శ్రీమంతులకు నేనిచ్చే సలహా ఒక్కటే. మా సర్వీస్ విధానంలో 'హ్యాపీ స్కూల్' కాన్సెప్ట్ ఉంది. ఒక పాఠశాలను హ్యాపీ స్కూల్‌గా గుర్తించాలంటే... కాంపౌండ్ వాల్, పాఠశాల భవనం, డిజిటల్ క్లాస్ రూములు, నీటి వసతి, టాయిలెట్‌లు ఉండాలి. అలా తీర్చిదిద్దడానికి 90 లక్షలు ఖర్చవుతుందనుకుంటే ముప్పై లక్షలతో ఒక దాత వస్తే, మా రోటరీ క్లబ్, అంతర్జాతీయ రోటరీ ఫౌండేషన్ నిధులతో పూర్తి చేయవచ్చు. గతంలో ఏపీలో కూడా మేము చాలా పాఠశాలలను దత్తత తీసుకున్నాం. ఇప్పుడు అక్కడ ప్రభుత్వమే అన్నీ సమకూరుస్తోంది. అక్కడ మా అవసరం లేదు. మాకు సర్వీస్ చేసే అవకాశమూ లేదు. తెలంగాణలో గడచిన ప్రభుత్వం పాఠశాలల మీద దృష్టి పెట్టకపోవడంతో మేము చేయగలిగినంత చేస్తూ వస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల హైదరాబాద్ నగరం, మెట్రో రైల్వే స్టేషన్‌లలో 65 వాటర్ కూలర్‌లనిచ్చాం. నీలోఫర్, ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌కి వైద్యపరికరాలు, స్పర్శ్ పేరుతో క్యాన్సర్ బాధితులకు పాలియేటివ్ కేర్, కొన్ని హాస్పిటళ్లకు అంబులెన్స్‌లు ఇచ్చింది రోటరీ క్లబ్. ఇక ఆలయాల్లో పూజలకు అన్ని ఏర్పాట్లూ ఉంటాయి, కానీ భక్తులకు సౌకర్యాలు పెద్దగా ఉండవు. మా భద్రాచలం, పర్ణశాలలో టాయిలెట్లు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి గదుల నిర్మాణం... ఇలా మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ఉన్నాం.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 341
శనివారం 2-3-2024



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



సరికొత్త శిఖరాలపై సూచీలు
సూచీలకు గణాంకాల జోష్. అమెరికాలో దిగివచ్చిన ద్రవ్యోల్బణం. - 13లో



పుణేరీ పల్టన్ విజయభేరి
హరియాణా స్టీలర్స్‌ను ఓడించి తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ సొంతం. - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బెంగళూరు కేఫ్‌లో పేలుడు
బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం ఐఈడీ బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది గాయపడ్డారు.
- వివరాలు 6లో



ఢాకాలో ఘోర అగ్ని ప్రమాదం
బంగ్లాదేశ్ రాజధానిలోని ఓ షాపింగ్‌మాల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 46 మంది సజీవ దహనమవగా మరో 22 మంది గాయపడ్డారు.
- వివరాలు 6లో



రైతు కమిషన్.. విద్యా కమిషన్
త్వరలోనే రాష్ట్రంలో రైతు కమిషన్, విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.
- వివరాలు 10లో



'మోదీ గ్యారంటీల'తో గెలుస్తాం
తాను ఎక్కడికెళ్లినా 'మోదీ గ్యారంటీ' అనే నినాదం వినిపిస్తోందని.. ఆ గ్యారంటీలే తమను గెలిపిస్తాయని ప్రధాని స్పష్టం చేశారు.
- వివరాలు 6లో

ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్

ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.45 గంటలకల్లా చేరుకోవాలని తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఒక ప్రకటనలో సూచించింది. ఉదయం 9 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ టైమ్ ఇవ్వనున్నట్టు తెలిపింది. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా చేరుకుంటే ఐదు నిమిషాల గ్రేస్ టైమ్ ఇవ్వాలని ఇంటర్మీడియెట్ విద్యా మండలి అధికారులు ఆయా జిల్లాల అధికారులకు, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

కొత్త రెవెన్యూ చట్టం!

- తెలంగాణ పట్టాదారు పాస్‌పుస్తకాల చట్టాన్ని పూర్తిగా మార్చే యోచనలో ప్రభుత్వం
- ధరణి కమిటీ సూచించిన అనేక సవరణలు చేసేకన్నా కొత్త చట్టమే మంచిదనే భావన
- ఆర్డినెన్స్ తీసుకురావాలనుకున్నా అసెంబ్లీ ప్రొరోగ్ కాకపోవడంతో ఉపసంహరణ - 3లో

కాళేశ్వరంపై కుట్ర

ప్రాజెక్టును విధ్వంసం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు కపట నాటకం: హరీశ్

- రేవంత్.. ఉద్యమ ప్రయోజనాలను కాలరాసి ద్రోహిగా నిలవొద్దు
- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా రేవంత్ చేస్తానన్నారు.. బాంబులు పెట్టి ప్రగతిభవన్‌ను పడగొడతామన్నారు
- ఆ మాటలు మా అనుమానాన్ని బలపరుస్తున్నాయి
- మమ్మల్ని ఎంతైనా హింసించండి.. ప్రాజెక్టును, రైతులను కాపాడండి
- మేడిగడ్డకు మరింత నష్టం వాటిల్లితే బాధ్యత రేవంత్, కాంగ్రెస్ సర్కారుదే..
- కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టడానికే 'చలో మేడిగడ్డ' చేపట్టాం: కేటీఆర్
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు
- అన్నారం వద్ద 'కాళేశ్వరం'పై కడియం శ్రీహరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్





మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న కేటీఆర్ తదితరులు. అన్నారంలో మాట్లాడుతున్న హరీశ్

అన్నారం నుంచి 'సాక్షి'ప్రత్యేక ప్రతినిధి/ సాక్షిప్రతినిధి, వరంగల్/ సాక్షి, హైదరాబాద్/ దామెర/ జనగామ: రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డలో తలెత్తిన లోపాన్ని సాకుగా చూపించి మొత్తం కాళేశ్వరాన్ని విధ్వంసం చేసే కుట్రకు పాల్పడుతోందనే అనుమానాలు కలుగుతున్నాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని అసెంబ్లీ సాక్షిగా రేవంత్ చేసిన ప్రకటన, గతంలో రేవంత్ బాంబులు పెట్టి ప్రగతిభవన్ పడగొడతానన్న మాటలు తమ అనుమానాన్ని బలపరుస్తున్నాయని చెప్పారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ట పన్నాగాన్ని బయటపెట్టేందుకే బీఆర్ఎస్ పార్టీ మేడిగడ్డ వద్దకు రావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నేతలతో కూడిన రెండు వందల మంది బృందం మిగతా 2వ పేజీలో ▶

చంద్రబాబు, మహాసేన రాజేశ్‌లకు ధన్యవాదాలతో...

ఇట్లు.. నర్రెడ్డి సునీత

10లో

- సునీత ఢిల్లీ ప్రెస్‌మీట్‌తో తొలగిన ముసుగు.. వివేకా హత్య వెనుక ఉన్నది ఎల్లో గ్యాంగే
- మెజార్టీ ఉన్నా వివేకాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన పచ్చ ముఠా
- వివేకా ఉంటే జిల్లాలో రాజకీయ మనుగడ ఉండదని టీడీపీ భయం
- వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దంటూ అసలు స్వరూపం బయటపెట్టుకున్న సునీత



బాబు ఓకే చేస్తేనే యాక్షన్..

- పవన్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా చంద్రబాబు ఓకే చెప్పాల్సిందే
- ఆ పార్టీకి 24 సీట్లు కేటాయించినా, ఇప్పటివరకు ఐదు మాత్రమే ఖరారు
- బాబు అభ్యంతరాలతో పవన్ పోటీచేసే నియోజకవర్గం పెండింగే.. రాజోలు, తణుకు, రాజమండ్రి రూరల్ కూడా..
- ఎన్నికల వేళ హైదరాబాద్‌లో మకాం ఏమిటని పార్టీ శ్రేణుల ప్రశ్న

- వివరాలు 10లో



కంటోన్మెంట్‌లో స్కైవేలకు కేంద్రం ఓకే

వర్కింగ్ పర్మిషన్ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు
త్వరలోనే కార్యరూపంలోకి.. ప్యాట్నీ నుంచి హకీంపేట, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి రూట్లలో తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు 5లో



సరైన స్టడీస్ లేకుండానే మేడిగడ్డ

కీలకమైన జియోలాజికల్ ప్రొఫైల్ స్టడీస్ చేపట్టలేదు
థర్డ్ పార్టీ పర్యవేక్షణ, క్వాలిటీ కంట్రోల్ నిర్వహణ లేదు
మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్ 2లో

హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్

హెచ్ఎండీఏ పరిధిలోని 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీల విలీనం
ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు లేదా 4 కొత్త కార్పొరేషన్లుగా విభజన
అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ ఆదేశాలు 14లో

క్లుప్తంగా...

తెలంగాణలో పోటీకి రాహుల్ ఓకే..?



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి పోటీ చేయడానికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. రెండు రోజుల పర్యటన నిమిత్తం లండన్ వెళ్లిన రాహుల్‌గాంధీని అక్కడున్న ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఇండియన్ ఓవర్సీస్ యూకే శాఖ ఉపాధ్యక్షుడు, తెలంగాణకు చెందిన రంగుల సుధాకర్‌గౌడ్ కలిసి రానున్న ఎన్నికల్లో తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తే..ఆ ప్రభావం కర్ణాటక, తెలంగాణతోపాటు మొత్తం దక్షిణాదిపై ఉంటుందని, పోటీకి అంగీకరించాలని కోరడంతో రాహుల్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఎక్కడైనా పోటీకి సిద్ధమా?

కేటీఆర్‌కు సవాల్ విసిరిన మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి రాజీనామా కాదు....ముందు నువ్వు సిరిసిల్ల ఎమ్మెల్యేగా రాజీనామా చేసి పోటీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ...కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మా పార్టీలో గెలిచిన స్థానాల్లో మీరు ఎక్కడైనా పోటీకి సిద్ధమా..? మేము రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. 40–50 పిల్లర్లు ఉన్న దగ్గర రెండు పిల్లర్లు కుంగిపోతే నష్టమేమిటి అంటున్న మీరు..మన ఇంటికి సంబంధించి రెండు పిల్లర్లు కుంగిపోతే నష్టం లేదా అని ప్రశ్నించారు. జపాన్‌లో ఆపరేటివ్ ఇంటర్నేషనల్ నుంచి లోన్ తీసుకుని కూడా ప్రాజెక్టును ఎందుకు పటిష్టంగా నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. కాళేశ్వరంపై డ్యాం సేఫ్టీ అధికారుల సలహా మేరకు ముందుకు వెళ్తామని, అదే సమయంలో బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల సందర్శన కోసం గతంలో మాకు హౌజ్ అరెస్టులు చేసినట్టు ఇప్పుడు చేసేది లేదని, ఎక్కడికైనా వెళ్లవచ్చునని తెలిపారు.

'ఉత్తర కుమారుడు కేటీఆర్'



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని, ముందు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటైనా గెలవడానికి ప్రయత్నాలు చేసుకుంటే మంచిదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి పవర్ ఏమిటో చూశాక కూడా కేటీఆర్ ఇలాంటి సవాళ్లు విసరడం మానుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. బీఆర్ఎస్‌కు చెందిన ఒక ఎంపీ, ఒక జెడ్పీ చైర్మన్ నిన్ననే పార్టీ మారారని గుర్తు చేశారు. పార్టీని కాపాడుకోలేని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని సవాల్ చేయడం చూస్తుంటే నవ్వొస్తోందని మల్లు రవి ఎద్దేవా చేశారు.

కేటీఆర్.. రాజీనామా చేసి మాట్లాడు

కాంగ్రెస్ ఎమ్మెల్యేల సవాల్

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని టచ్ చేస్తే తేనెటీగల్లా చుట్టుముడతామని, కేటీఆర్‌కు దమ్ముంటే సిరిసిల్ల ఎమ్మెల్యేగా రాజీనామా చేసి మాట్లాడాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సవాల్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు, బాతుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం కుర్చీ పోయిందన్న అక్కసుతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని, కేటీఆర్ ఒక క్యారెక్టర్ ఆర్టిస్టని ధ్వజమెత్తారు. సీఎం నేమ్ బోర్డులు తయారు చేయించుకొని ఇంట్లో పెట్టుకొని సంతృప్తిపడాలని ఎద్దేవా చేశారు. మేడిగడ్డకు కేసీఆర్‌ను ఎందుకు తీసుకుపోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ డ్రామా కంపెనీ మూతపడుతుందని చెప్పారు.

ఇదం జగత్



పొత్తు మీద పెట్టిన శ్రద్ధ సభలకు జనం తీసుకురావడం మీద కూడా పెడితే బాగుండేది సార్!

కాళేశ్వరంపై కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించింది. 'చలో మేడిగడ్డ'పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో.. మాజీ మంత్రి కడియం శ్రీహరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా.. కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా హరీశ్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణ రైతుల విషాదగాథలు తెలిసిన కేసీఆర్.. వృథాగా సముద్రంలో కలిసే గోదావరి జలాలను బీళ్లకు మళ్లించేందుకు కాళేశ్వరానికి శ్రీకారం చుట్టారు. కాళేశ్వరం ద్వారా 98వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు అందుతున్నాయని సీఎం రేవంత్ అసెంబ్లీ వేదికగా చెప్పారు. కానీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ రోజుకో సంఖ్య చెప్తున్నారు. రేవంత్ సాంగత్యంతో ఉత్తమ్ కూడా స్థాయి దిగజారి మాట్లాడుతున్నారు.

ఉద్యమ ప్రయోజనాలను కాలరాసే కుట్ర

తెలంగాణ ఉద్యమ ఫలితం కాళేశ్వరం ప్రాజెక్టు. ఉద్యమ ప్రయోజనాలను కాలరాసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలి. రేవంత్.. మీరు తెలంగాణ ఉద్యమ ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేశారు. ఇప్పుడు సీఎంగానైనా తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలి. చరిత్రలో ద్రోహిగా మిగిలిపోకండి. మేడిగడ్డ బ్యారేజీని ధ్వంసం చేయకండి. కావాలంటే ఎన్ని కేసులైనా పెట్టుకోండి. మమ్మల్ని ఎంతైనా హింసించండి. కానీ ప్రాజెక్టును, రైతులను కాపాడండి. ఇది బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య సమస్యనో.. ఎన్నికలు, ఓట్ల సమస్యనో కాదు. ఇది లక్షలాది తెలంగాణ రైతుల కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న సమస్య. మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్ల స్థాయిలో ఉన్న సమస్యను రాజకీయ ప్రయోజనాల కోసం ఆలస్యం చేసి మిగతా పిల్లర్లకు విస్తరించేలా చేయకండి. అలాంటిదేమన్నా జరిగి మేడిగడ్డకు మరింత నష్టం వాటిల్లితే.. దానికి పూర్తి బాధ్యత రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ సర్కారుదే.

వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం..

కాంగ్రెస్ నాయకులు ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టు వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్షాలు సమస్యలను లేవనెత్తితే పరిష్కారం చూపకుండా.. పోటీసభలు, పర్యటనలతో దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించవద్దంటూ బీఆర్ఎస్ నల్లగొండ సభ పెడితే.. కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డకు వెళ్లి హడావుడి చేశారు. కుంగిన రెండు, మూడు పిల్లర్లను భూతద్దంలో చూపి కాళేశ్వరం పట్ల అపోహలు కల్పించే ప్రయత్నం చేశారు. నేడు కాళేశ్వరాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ'కు పిలుపునిస్తే.. ప్రజలు, మీడియా దృష్టి మళ్లించేందుకు పాలమూరు–రంగారెడ్డి పర్యటనకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరించడంలో నిమగ్నమైంది.

ఇప్పటికైనా పనులు చేపట్టాలి..

2022లో వచ్చిన భారీ వరదలతో కన్నెపల్లి, అన్నారం పంపుహౌజులు మునిగితే.. యుద్ధప్రాతిపదికన ఏజెన్సీ ఖర్చులతో మరమ్మతులు చేయించి పునరుద్ధరించాం. ఆ విషయాన్ని ఈ ప్రభుత్వానికి గుర్తు చేయడానికే ఇక్కడిదాకా వచ్చాం. అన్నారం బ్యారేజీకి ఎలాంటి ఢోకా లేదు. చిన్న సమస్యలుంటే వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయొచ్చు. దానిలోకి 34 స్ట్రీమ్‌లతోపాటు మానేరు నీళ్లు కూడా వస్తాయి. మేడిగడ్డ పునరుద్ధరణ పనులు చేస్తూనే.. అన్నారం నుంచి కాళేశ్వరం ఆయకట్టుకు నీళ్లు అందించవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఈ పనులు చేయాలని డిమాండ్ చేస్తున్నాం''అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఉద్రిక్తంగా.. ఉద్విగ్నంగా..

బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ'పర్యటన ఆద్యంతం ఉద్విగ్నంగా, ఉద్రిక్తంగా సాగింది. ప్రత్యేక బస్సుల్లో బయల్దేరిన నేతలకు పర్యటన పొడవునా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. మధ్యలో కాన్వాయ్‌లో చేరుతూ ముందుకు సాగారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట సమీపంలో బీఆర్ఎస్ కాన్వాయ్‌ను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశాయి. పోలీసులు వారిని నిలువరించారు. తర్వాత ఇదే జిల్లా దామెర మండలంలో ఆగిన కేటీఆర్.. స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించారు. ''జై తెలంగాణ అంటే పోలీసులతో దాడులు చేయిస్తారా? ఇది దారుణం బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి..'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు భూపాలపల్లిలోని కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేసి.. మేడారం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. మేడిగడ్డ బ్యారేజీ సందర్శన కోసం కొందరినే అనుమతించడంతో.. బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాగా.. మేడిగడ్డ పర్యటనకు వెళ్తున్న బీఆర్ఎస్ బృందం కాన్వాయ్‌లోని ఓ బస్సు టైరు జనగామ పరిధి నెల్లుట్ల–యశ్వంతాపూర్ మధ్య ప్రయాణిస్తున్న సమయంలో పేలింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపేయడం ఎలాంటి ప్రమాదం జరగలేదు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్ తదితరులు

కాంగ్రెస్ కుట్రలు ఎండగట్టడానికే 'చలో మేడిగడ్డ': కేటీఆర్

పదేళ్లలో పచ్చబడ్డ తెలంగాణను మళ్లీ ఎడారిగా మార్చేలా కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎండగట్టేందుకే 'చలో మేడిగడ్డ'కార్యక్రమం చేపట్టామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. శుక్రవారం పర్యటనకు బయలుదేరే ముందు తెలంగాణభవన్‌లో, తర్వాత అన్నారం బ్యారేజీ వద్ద ఆయన మాట్లాడారు. ''కాళేశ్వరంపై అసలు నిజాలను ప్రజలకు చెప్పే క్రమంలో ఈరోజు పర్యటన మొదటి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో ప్రాజెక్టులోని ఇతర ప్రాజెక్టులు, రిజర్వాయర్లు సొరంగాలు, కాలువల వద్ద పర్యటిస్తాం. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరంలో భాగమైన ఒక మేడిగడ్డ బ్యారేజీలోని మూడు పిల్లర్లలో వచ్చిన సమస్యను పట్టుకొని లక్ష కోట్ల రూపాయలు వృథా అన్న తీరుగా కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గ ప్రచారం చేస్తోంది. బ్యారేజీకి మరమ్మతు చేసి సాగునీరు ఇవ్వాలనే బాధ్యతను మరచి రాజకీయాలు చేస్తోంది. రాబోయే రోజుల్లో రైతన్నల పంటలు ఎండకుండా ఉండాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లే దిక్కు..''అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ప్రాజెక్టులు కూలిపోవాలనే కుతంత్రం

ప్రజాధనంతో కట్టిన ప్రాజెక్టులను పరిరక్షించడానికి బదులు అవి కూలిపోవాలని కాంగ్రెస్ కుతంత్రాలు పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. ''పంజాబ్‌నే తలదన్నే స్థాయికి ఎదిగిన తెలంగాణ రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న కాంగ్రెస్ నీచ సంస్కృతికి సమాధి కట్టాల్సిన సమయం ఆసన్నమైంది. మరమ్మతులు కూడా చేతకాని గుంపుమేస్త్రిని నమ్ముకుంటే తెలంగాణ రైతు నిండా మునుగుడే. దుష్ట రాజకీయాల కోసం తెలంగాణ రైతాంగాన్ని బలిచేస్తే భరించబోం. మేడిగడ్డకు మరణశాసనం రాయాలని చూస్తే తెలంగాణ గడ్డపై కాంగ్రెస్‌కు నూకలు చెల్లడం ఖాయం''అని కేటీఆర్ హెచ్చరించారు. కాగా.. ప్రాజెక్టుల్లో సాంకేతిక లోపాలు తలెత్తితే సరిదిద్దుకోవాలే తప్ప రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టొద్దని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మేడిగడ్డ ఒక కాంపోనెంట్ మాత్రమే..: కడియం శ్రీహరి



అన్నారం ప్రాజెక్ట్ వద్ద ప్రజెంటేషన్ ఇస్తున్న కడియం శ్రీహరి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బ్యారేజీలు, పంపుసెట్లు, రిజర్వాయర్లలో (కాంపోనెట్ల)లో మేడిగడ్డ ఒకటి మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లో వివరించారు. ''మొత్తం 15 రిజర్వాయర్లు, 21 పంపుహౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల కాలువలు.. 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం.. 240 టీఎంసీల వినియోగం.. వీటన్నింటి సమగ్ర స్వరూపమే కాళేశ్వరం ప్రాజెక్టు. రాష్ట్రంలో ఎప్పుడూ ఏ ప్రాజెక్టు కూడా ప్రతిపాదిత అంచనాలతో పూర్తి కాలేదు. నాగార్జునసాగర్ 30 ఏళ్లు, ఎస్సారెస్పీ స్టేజ్ –1, స్టేజ్–2లు 40 ఏళ్లు దాటితే గానీ పూర్తి కాలేదు. వాటి అంచనా వ్యయం 10–20రెట్లు పెరిగింది. ఇప్పటివరకు కాళేశ్వరం నీటితో నేరుగా 98,570 ఎకరాలు, ప్రాజెక్టు కాల్వల ద్వారా నింపిన మైనర్ ఇరిగేషన్ వ్యవస్థల ద్వారా 39,146 ఎకరాలు కొత్త ఆయకట్టు సమకూరింది. ఎస్సారెస్పీ స్టేజ్ 1, 2, నిజాంసాగర్ల నీటితో నింపిన 2,143 ట్యాంకుల ద్వారా 1,67,050 ఎకరాలు కొత్త ఆయకట్టు వచ్చింది. 3,04,766 ఎకరాల కొత్త ఆయకట్టు, 17,08,230 ఎకరాల స్థిరీకరణ కలిపి మొత్తం 20,33,572 ఎకరాలకు కాళేశ్వరం నీళ్లు అందుతాయి. తుమ్మిడిహట్టి బ్యారేజీ కడితే చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాజెక్టు పరిధి ముంపునకు గురికావడం, మహారాష్ట్రలో 3,786 ఎకరాల భూమి ముంపు ఉండటంపై ఆరాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో మేడిగడ్డకు మార్చాల్సి వచ్చింది..''అని వివరించారు.

సరైన స్టడీస్ లేకుండానే మేడిగడ్డ నిర్మాణం

మీడియాతో చిట్‌చాట్‌తో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- కీలకమైన జియోలాజికల్ ప్రొఫైల్ స్టడీస్ చేపట్టలేదు
- థర్డ్ పార్టీ పర్యవేక్షణ, క్వాలిటీ కంట్రోల్ నిర్వహణ జరగలేదు
- తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీల లభ్యత లేదని సీడబ్ల్యూసీ అనలేదు
- కాళేశ్వరం అక్రమాలకు బాధ్యులైన అధికారులపై త్వరలో కేసులు పెడతామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ''భూగర్భంలో రాతిపొరల నిర్మాణ క్రమాన్ని తెలిపే కీలకమైన 'జియోలాజికల్' ప్రొఫైల్ స్టడీ లేకుండానే మేడిగడ్డ బ్యారేజీని నిర్మించారు. అందువల్లే జియోలాజికల్ ప్రొఫైల్‌తో కూడిన సెక్షనల్ డ్రాయింగ్స్‌ను 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)కి ఇవ్వలేకపోయాం. అంతేకాదు.. బ్యారేజీ నిర్మాణ సమయంలో థర్డ్ పార్టీ పర్యవేక్షణ, క్వాలిటీ కంట్రోల్ నిర్వహణ జరగలేదు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఏటా వర్షాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీకి తనిఖీలు నిర్వహించలేదు. అందువల్ల ఈ వివరాలను కూడా ఎన్డీఎస్ఏకు ఇవ్వలేకపోయాం..'' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఎన్డీఎస్ఏకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాచారం ఇవ్వలేదని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సలహాదారు వెదిరె శ్రీరామ్ చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. బ్యారేజీ నిర్మాణం పూర్తయిందంటూ కాంట్రాక్టర్‌కు తప్పుడు మార్గంలో సర్టిఫికెట్లు జారీ చేశారని, వాటి వెనక ఏదో మతలబు ఉందని విజిలెన్స్ నివేదిక ఇచ్చిందని చెప్పారు. బ్యారేజీలోని ప్రతిబ్లాక్ నిర్మాణం పూర్తయినట్టు ధ్రువీకరించే సర్టిఫికెట్లను గత ప్రభుత్వం సిద్ధం చేయలేదని.. అందుకే వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లను ఎన్డీఎస్ఏకు అందజేయలేదని వివరించారు. ఈ అంశాలన్నింటినీ ఎన్డీఎస్ఏకు రాతపూర్వకంగా కూడా తెలిపామన్నారు. ప్రాజెక్టులో అవకతవకలపై న్యాయ సలహా తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నామని చెప్పారు.



మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్

అధికారులపైనా క్రిమినల్ కేసులు..

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించినట్టు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని, దీనిపై లోతైన దర్యాప్తు జరుగుతోందని ఉత్తమ్ తెలిపారు. బాధ్యులైన అధికారులను గుర్తించి, వారి పేర్లతో సహా నివేదిక ఇస్తామని విజిలెన్స్ చెప్పిందని.. ఆ తర్వాత వారిపై క్రిమినల్ కేసులు ఉంటాయని వెల్లడించారు. గత ఏడాది వరదల్లో నీట మునిగి దెబ్బతిన్న కన్నెపల్లి పంపుహౌజ్ పునరుద్ధరణ తమ ప్రభుత్వం వచ్చాక పూర్తయిందని చెప్పారు. ''తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ తేల్చినట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పింది. కమీషన్ల కోసమే బ్యారేజీ నిర్మాణాన్ని మేడిగడ్డకు మార్చింది. ఇదే విషయాన్ని వెదిరె శ్రీరామ్ కూడా చెప్పారు. ప్రాజెక్టు వ్యయాన్ని ఎంత పెంచితే అంత కమీషన్లు వస్తాయని కుట్రపూరిత ఆలోచనతో గత సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు..'' అని ఉత్తమ్ పేర్కొన్నారు. మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నెల రోజుల్లోగా ప్రాథమిక నివేదిక సమర్పించనుందని.. ఆ తర్వాత మరమ్మతులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్డీఎస్ఏ ప్రక్రియను వేగిరం చేయాలని కోరేందుకు తాను ఆదివారం ఢిల్లీకి వెళ్తున్నానని తెలిపారు.

బీఆర్ఎస్ కారు స్క్రాప్‌కే..

శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీ సందర్శన కోసం బీఆర్ఎస్ నేతలతో వెళ్తున్న బస్సు టైర్ పేలిన ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ''బీఆర్ఎస్ కారు టైర్లు బరస్ట్ అయ్యాయి. ఇక తుక్కు కింద పోవాల్సిందే..'' అని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. మేడిగడ్డ నష్టాన్ని చూశాకైనా బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

కాళేశ్వరంలో కేంద్రం పాపం తక్కువేం కాదు..

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం చేసిన పాపం తక్కువేమీ కాదని ఉత్తమ్ విమర్శించారు. ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ పెట్టుబడి అనుమతులు ఇవ్వలేదని వెదిరె శ్రీరామ్ అంటున్నారని.. మరి ప్రాజెక్టు కోసం రూ.లక్ష కోట్ల రుణాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, బ్యాంకులు ఎలా ఇచ్చాయని నిలదీశారు. దేవాదుల ప్రాజెక్టు డిజైన్లు సరిగ్గా లేవని వెదిరె శ్రీరామ్ అంటున్నారని.. మరి ఆ ప్రాజెక్టుకు కేంద్రం ఏఐబీపీ పథకం కింద రూ.2,500 కోట్లు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. నాగార్జునసాగర్‌కు మరమ్మతులు చేపడతామని, ఇందుకు సీఆర్పీఎఫ్ బలగాలను తొలగించాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు.

నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చెయ్..

కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్

- తాను సిరిసిల్ల నుంచి పోటీచేస్తానని ప్రకటన
- ఓడిపోతే బీఆర్ఎస్‌ను మూసివేస్తారా అని ప్రశ్న

తాను ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి కేటీఆర్ రాజీనామా చేసి నల్లగొండ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. తాను సైతం నల్లగొండ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ప్రకటించారు. నల్లగొండలో కేటీఆర్ ఓటమి ఖాయమని, ఇక కారు షెడ్డు మూసుకోక తప్పదన్నారు. కేటీఆర్ ఓడిపోతే బీఆర్ఎస్ పార్టీని మూసివేస్తాం అని కేసీఆర్ ప్రకటన చేస్తారా? అని సవాల్ విసిరారు. తాను సిరిసిల్లలో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శుక్రవారం సచివాలయంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. కేటీఆర్‌కు క్యారెక్టర్ లేదని కానీ రూ. లక్షల కోట్లు ఉన్నాయని, తనకు క్యారెక్టర్ ఉందని కానీ డబ్బులు లేవన్నారు. కేటీఆర్ సిరిసిల్లలో రూ.200 కోట్లు ఖర్చు చేసి 30 వేల ఓట్లతో గెలిచాడని, తానైతే అలా గెలిస్తే రాజీనామా చేసేవాడినన్నారు.

మాకు ప్రత్యర్థి బీజేపీనే...

లోక్‌సభ ఎన్నికల్లో మాకు ప్రత్యర్థి బీఆర్ఎస్ కాదని, బీజేపీనే అని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పోటీలో లేదని, బీజేపీకి రెండు, మూడు సీట్లు వస్తాయో లేదో తెలియదన్నారు. బీజేపీ ఎంపీ డి.అర్వింద్‌ను ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని కోమటిరెడ్డి చెప్పారు. రాజకీయాల వల్ల ఆస్తులు పోగొట్టుకున్నామని, తనతోపాటు ఉత్తమ్ ఆస్తులు తగ్గాయన్నారు. తన పేరు మీద ఆస్తులుంటే అర్వింద్‌కు ఇచ్చేస్తానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరిలలో ఎక్కడి నుంచైనా పోటీ చేయాలని రాహుల్ గాంధీకి ప్రతిపాదించామని తెలిపారు.

రాజకీయ భిక్ష పెట్టిన జిల్లాకే అన్యాయం

- కేసీఆర్ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా ఒక్క ఎకరాకు నీరివ్వలేదు
- ఏఐసీసీ నేత వంశీచంద్‌రెడ్డి విమర్శ
- ఉద్దండాపూర్, కర్వెన రిజర్వాయర్ల సందర్శన



కర్వెన రిజర్వాయర్ వద్ద వంశీచంద్‌రెడ్డి తదితరులు

దేవరకద్ర/జడ్చర్ల/కొందుర్గు: పాలమూరు– రంగారెడ్డి పథకాన్ని ఎండబెట్టారని, మేడిగడ్డను బొందపెట్టారని ఏఐసీసీ నేత వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చలో పాలమూరు– రంగారెడ్డి రిజర్వాయర్ల సందర్శన చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి భూత్పూర్ మండలం కర్వెన, జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ రిజర్వాయర్లను సందర్శించారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని కూడా ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు వాస్తవ రూపం ప్రజలకు తెలియాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. 2015 లో శిలాఫలకం వేసిన పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని కూర్చొని మూడేళ్లలో పూర్తి చేస్తానని గొప్పలు చెప్పిన కేసీఆర్.. రెండుసార్లు అధికారంలోకి వచ్చినా ఒక్క ఎకరాకు నీరివ్వలేదని వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. పాల మూరు జిల్లా ఎడారిగా మారుతున్నా పట్టించుకోలేదని, 2009లో ఎంపీగా గెలిపించి రాజకీయంగా భిక్ష పెట్టిన జిల్లాకే తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ప్రజలను మోసం చేయడానికి ఒక పంపును నామమాత్రంగా ప్రారంభించి పూర్తి చేశామని గొప్పలు చెప్పారని విమర్శించారు. కర్వెన రిజర్వాయర్ ఇప్పటికీ అసంపూర్తి పనులతో అస్తవ్యస్తంగా ఉందన్నారు. ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా అభివర్ణించిన కాళేశ్వరంను బొంద పెట్టారన్నారు. కమీషన్ల కక్కుర్తితో మేడిగడ్డ పగుళ్లతో కుంగిపోవడానికి కారణం అయ్యారని ఆరోపించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులకు పిచ్చిపట్టిందని.. ఎర్రగడ్డకు వెళ్లాల్సిన నాయకులు, మేడిగడ్డకు వెళ్లారని ఎద్దేవా చేశారు. బృందంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికా రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేపీలో చేరిన బీబీ పాటిల్

కండువా కప్పి ఆహ్వానించిన ఛుగ్, లక్ష్మణ్



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరారు. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌లు పాటిల్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కాగా, జహీరాబాద్ లోక్‌సభ టికెట్‌పై పాటిల్‌కు నడ్డా హామీ ఇచ్చినట్లు తెలిసింది. బీజేపీలో చేరడానికి ముందే బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. జహీరాబాద్ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ.. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు తన రాజీనామా లేఖను పంపారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తన నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, అయితే మరింత అభివృద్ధిని కాంక్షిస్తూ తాను బీజేపీలో చేరానని తెలిపారు. బీఆర్ఎస్ మునుగుతున్న నావ అని, త్వరలో ఆ పార్టీకి చెందిన మరికొందరు నేతలు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని కె.లక్ష్మణ్ తెలిపారు. కాగా, బీఆర్ఎస్ బీబీబీ.. అంటే బాప్, బేటా, బిటియా (తండ్రి, కుమారుడు, కూతురు) పార్టీగా మారిందని తరుణ్ ఛుగ్ ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కులేదు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. కాళేశ్వరం అవినీతి విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేందుకే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును కాకుండా కేవలం మేడిగడ్డ బ్యారేజీని మాత్రమే పట్టుకుందన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది కాంగ్రెస్ మాత్రమేనని, లేకపోతే బీఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోయేదన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఇతర నాయకులతో కలిసి కొండా విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయకపోవడం వల్ల బీఆర్ఎస్‌తో బీజేపీ కుమ్మక్కయిందని విమర్శలు చేస్తున్నారని, అయితే అందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. కేసీఆర్ రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసి వెళ్తే, ప్రజలు ఇబ్బందులు పడకూడదని కేంద్రం నిధులు ఇస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీని 14, 15 ఎంపీ సీట్లలో గెలిపిస్తే 9 లక్షల కోట్లు కాదు, రూ.25 లక్షల కోట్లు తీసుకొస్తామని చెప్పారు. తనకు ఇంకా చేవెళ్ల టికెట్ కేటాయింపుపై పార్టీ హామీ ఇవ్వలేదని, టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తాననే ధీమా వ్యక్తం చేశారు.

నాగర్‌కర్నూల్ బరిలో ఉంటా

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కల్వకుర్తి టౌన్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం బరిలో తాను పోటీలో ఉంటానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కల్వకుర్తిలో జరిగిన నాగర్‌కర్నూల్ నియోజకవర్గం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పార్టీ కార్యకర్తలు, చాలా మంది ప్రజలు పోటీలో ఉండాలని కోరుతున్నారని, తాను ఆ ప్రాంత వాసినే కాబట్టి పోటీచేస్తానని చెప్పారు. కాగా, కొడంగల్‌లో అభివృద్ధి కోసం సేకరించే భూములు పూర్తిగా ఎస్సీలకు సంబంధించినవే అని, కేవలం ఎస్సీల భూములే అభివృద్ధికి పనికి వస్తాయా అని ప్రశ్నించారు. ధరణిలో చాలా సమస్యలు ఉన్నాయని, ప్రజావాణి ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తానన్న ముఖ్యమంత్రి, చివరకు దాని బాధ్యతలను అధికారులకు వదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలో డ్రగ్స్ ముప్పు ఎక్కువైందని కిరాణా దుకాణాలలో చాక్లెట్ల మాదిరిగా అమ్ముతున్నారని ఆరోపించారు.

కేరళలో రేవంత్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కేరళ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేరళ సీఎం విజయన్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా నాటి సీఎం కేసీఆర్‌ను కలవడాన్ని, కేంద్ర బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన సభలో పాల్గొనడాన్ని రేవంత్‌రెడ్డి తప్పుబట్టారని పేర్కొన్నారు. ఆనాటి సీఎం కేసీఆర్ అవినీతిపరుడని, ఆయనను కలిసి విజయన్ కూడా అవినీతిపరుడని రేవంత్‌రెడ్డి నోరు పారేసుకున్నారని తమ్మినేని మండిపడ్డారు. ఒక రాష్ట్ర సీఎం.. మరో రాష్ట్రానికి వెళ్లినప్పుడు ఆ రాష్ట్ర సీఎంను కలవడం సంప్రదాయమన్న విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం కక్షతో కేరళ సీఎం విజయన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు

- జేఎన్‌జే ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- సొసైటీకి కేటాయించిన స్థలం అప్పగింతపై రోడ్‌మ్యాప్‌తో రావాలని సూచన
- ఒక్క నిమిషంలో ఫైలుపై సంతకం పెడతానని వెల్లడి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలు సమకూరుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జే)కి సంబంధించి ఇళ్ల స్థలాల అప్పగింతపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డితో జేఎన్‌జే ప్రతినిధులు చర్చించి ఒక రోడ్డుమ్యాప్‌తో తన దగ్గరకు వస్తే ఒక్క నిమిషంలో సంబంధిత ఫైలుపై సంతకం చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ఏ సంస్థకు చైర్మన్‌ను నియమించకుండా కేవలం మీడియా అకాడమీకే నియమించామంటేనే తమ ప్రభుత్వం జర్నలిస్టులకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో వెల్లడవుతుందన్నారు. శుక్రవారం సాయంత్రం జేఎన్‌జేలో సభ్యులైన అన్ని పత్రికల, టీవీ మీడియాకు చెందిన ప్రధాన ప్రతినిధులు సచివాలయంలో సీఎంను కలిసి తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల అప్పగింత ప్రక్రియను వంద రోజుల్లోగా మొదలుపెడతానన్న హామీని అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 16 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వమే నిజాంపేట, పేట్‌బషీరాబాద్‌లో 70 ఎకరాల స్థలాన్ని జేఎన్‌జేకు కేటాయించిందని గుర్తు చేశారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో సొసైటీకి స్థలాన్ని అప్పగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వంలో అమలు కాలేదని తెలిపారు. ఈ సొసైటీలోని 60 మంది సభ్యులు ఇప్పటికే మరణించారని, మరో 20 మంది సభ్యుల ఆరోగ్య పరిస్థితి బాలేదని వివరించారు. కాగా సొసైటీ సభ్యులు మరణించడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల సొసైటీలో తానూ సభ్యుడినని, అభివృద్ధి కోసం రూ.10 లక్షలు చెల్లించానని సీఎం చెప్పారు.

మిగతా జర్నలిస్టులకు కూడా స్థలాలు

రాష్ట్రంలో అర్హులైన మిగతా జర్నలిస్టులకు కూడా స్థలాలు ఇచ్చే విషయంలో మీడియా అకాడమీతో చర్చించి కార్యాచరణను రూపొందిస్తే వారికి కూడా స్థలాలను ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతా కార్డులతోపాటు ఇతర సమస్యలపై కూడా దృష్టి సారించామని తెలిపారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా వెంటనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేంద్రరెడ్డి కూడా పాల్గొన్నారు.

కొత్త రెవెన్యూ చట్టం!

తెలంగాణ పట్టాదారు పాస్‌పుస్తకాల చట్టాన్ని పూర్తిగా మార్చే యోచనలో ప్రభుత్వం

- ధరణి కమిటీ సూచించిన అనేక సవరణలు చేసేకన్నా కొత్త చట్టమే మంచిదనే భావన
- ఆర్డినెన్స్ తీసుకురావాలనుకున్నా అసెంబ్లీ ప్రోరోగ్ కాకపోవడంతో ఉపసంహరణ
- అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లోనే కొత్త చట్టం?
- అధికార వికేంద్రీకరణకు పక్కాగా చట్టబద్ధత
- అప్పటివరకు వెసులుబాటు కోసమే ధరణి స్పెషల్ డ్రైవ్
- తాత్కాలిక ఏర్పాటు కోసమే వికేంద్రీకరణ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పట్టాదారు పాస్‌పుస్తకాల చట్టం (రికార్డ్ ఆఫ్ రైట్స్)–2020 స్థానంలో కొత్త రెవెన్యూ చట్టం రానున్నట్టు సమాచారం. ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ చట్టం అడ్డంకిగా మారిందనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో కొత్త చట్టం ప్రవేశపెట్టాలని సర్కారు భావిస్తోందని సమాచారం. ప్రస్తుత చట్టంలోని అనేక అంశాలకు సవరణలు సూచిస్తూ, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ 20 పేజీల ముసాయిదాను రూపొందించిందని, అయితే అన్ని సవరణలతో అతుకుల బొంత లాంటి చట్టాన్ని మనుగడలో ఉంచడానికి బదులు కొత్త చట్టాన్ని తీసుకురావడమే మంచిదని ప్రభుత్వం భావించిందనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. దీనిపై ఆర్డినెన్స్ తేవాలనే చర్చ కూడా ప్రభుత్వ వర్గాల్లో జరిగినా, అసెంబ్లీ ప్రోరోగ్ కానందున ఆర్డినెన్స్ చేసే అవకాశం లేదన్న న్యాయ నిపుణుల అభిప్రాయంతో ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది. అయితే అప్పటివరకు ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా స్పెషల్ డ్రైవ్ ద్వారా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని, అధికారాల వికేంద్రీకరణ ఉత్తర్వులిచ్చిందని సమాచారం.

తహసీల్దార్లలో నైరాశ్యం

అధికారాల వికేంద్రీకరణ పేరుతో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు తహసీల్దార్లలో నైరాశ్యానికి కారణమయ్యాయి. వికేంద్రీకరణ పేరుతో కలెక్టర్లకే ఎక్కువ అధికారాలు కట్టబెట్టారని వారంటున్నారు. గతంలో తమకు ఉన్న అధికారాలనే మళ్లీ ఇచ్చారని, వారసత్వ హక్కుల సంక్రమణ, జీపీఏ, ఎస్పీఏల ఆధారంగా పట్టాలు చేసే అధికారం ఇప్పుడు కూడా తమకే ఉందని, మళ్లీ ఆ అధికారాలనే ఇచ్చి వికేంద్రీకరణ అంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తమ వద్ద సిబ్బంది లేరని, ఇలాంటి పరిస్థితుల్లో వారం రోజుల సమయం ఇచ్చి అన్ని దరఖాస్తులూ పరిష్కరించాలంటే ఎలా సాధ్యమనే చర్చ కూడా రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. హడావుడిలో తప్పులు జరిగితే సమస్య మళ్లీ మొదటికొచ్చినట్టే కదా అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

వికేంద్రీకరణ తాత్కాలికమే!

అయితే ప్రస్తుతం చేపట్టిన అధికార వికేంద్రీకరణ, స్పెషల్ డ్రైవ్‌లు తాత్కాలికమేనని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. ధరణి కమిటీ సూచన మేరకు తాత్కాలికంగానే ఈ ఏర్పాట్లు చేశామని, కొత్త ఆర్‌వోఆర్ చట్టంలో అధికార వికేంద్రీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని రెవెన్యూ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు కలెక్టర్లు తీసుకునే నిర్ణయాలను కూడా తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్–1908లోని 166బీ నిబంధన ప్రకారం సవాల్ చేయవచ్చని అంటున్నారు. ప్రస్తుతం చేసిన అధికారాల పంపిణీ కూడా తాత్కాలికమేనని, ఆర్‌వోఆర్ కొత్త చట్టంలో పకడ్బందీగా వికేంద్రీకరణ ఉంటుందని పేర్కొంటున్నారు. తహశీల్దార్లకు అధికారాల విస్తృత పంపిణీ అవకాశం ప్రస్తుతానికి లేదని ప్రభుత్వ వర్గాలు వివరిస్తున్నాయి. అయితే ధరణి దరఖాస్తుల పరిష్కారంలో తహశీల్దార్ నివేదికలే ప్రాతిపదికలని, ఆ నివేదికల ఆధారంగానే ఉన్నతాధికారులు దరఖాస్తులను పరిష్కరిస్తారని ధరణి కమిటీ సభ్యుడొకరు చెప్పారు. ఈ మేరకు తహశీల్దార్లు క్రియాశీల పాత్ర పోషించాల్సి ఉంటుందని, గతంలో మాదిరి కాకుండా దరఖాస్తుల ఆమోదం, తిరస్కారం కోసం కచ్చితంగా కారణాలతో కూడిన రాతపూర్వక ఉత్తర్వులివ్వాల్సి ఉంటుందని వెల్లడించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ఎవరైనా రైతులు తమకు నష్టం కలిగిందని భావిస్తే రెవెన్యూ అధికారులిచ్చే రాతపూర్వక ఉత్తర్వులపై కోర్టులను ఆశ్రయించే వెసులుబాటు ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈనెల 1వ తేదీనుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌తో ధరణి దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోదని, ఈ డ్రైవ్‌లో తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ కూడా మరోమారు ధరణి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని రెవెన్యూ వర్గాలు చెపుతున్నాయి.

బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలి

సాక్షి, హైదరాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలని బీజేపీ అధినాయకత్వాన్ని ఓబీసీ మోర్చా జాతీయ కమిటీ సభ్యుడు పెరిక సురేష్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 17 సీట్లలో 5 రిజర్వు స్థానాలు మినహా.. మిగిలిన 12 సీట్లలో 6 బీసీలకు కేటాయించాలని కోరారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో తమ పెరిక సామాజిక వర్గం బలంగా ఉందని, ఈ స్థానంలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు.

జాజులకు అవకాశం ఇవ్వాలి

భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై బీసీ–జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు అవకాశం ఇవ్వాలని బీసీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ–జేఏసీ) కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ జేఏసీ చైర్మన్ గణేశ్‌చారి, కన్వీనర్ బాలరాజు గౌడ్, శ్రీశైలంయాదవ్, శేఖర్ తదితరులు శుక్రవారం లేఖ రాశారు. రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం బీసీలకు ఎనిమిది పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని తెలిపారు. అధికారంలోకి వస్తే సమగ్ర కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించడంపై బీసీల విశ్వాసం పెరిగిందన్నారు. ఇందులో బీసీల వాణిని వినిపించడానికి జాజులకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

విచారణకు హాజరైన క్రిష్

రక్త నమూనాల సేకరణ



సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: రాడిసన్ బ్లూ డ్రగ్ కేసులో అనుమానితుడిగా ఉన్న టాలీవుడ్ డైరెక్టర్ క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) పోలీసుల విచారణకు హాజరయ్యారు. సోమవారం వరకు సమయం కోరిన ఆయన, శుక్రవారం మధ్యాహ్నం అడ్వొకేట్‌తో కలిసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులు ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో క్రిష్ నుంచి రక్త నమూనాలు సేకరించారు. హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన క్రిష్ పోలీసుల విచారణకు మరికొంత సమయం కోరారు. బెయిల్ పిటిషన్ వేయడంతో విచారణకు రావాలని రెండోసారి నోటీసు ఇచ్చి పోలీసులు ఒత్తిడి పెంచారు. తప్పనిసరి పరిస్థితుల్లో క్రిష్ పీఎస్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన అనుమానితులు సందీప్, శ్వేత, విదేశాలకు పరారైన నీల్ పోలీసుల విచారణకు రావాల్సి ఉంది.

క్రిష్ బెయిల్ పిటిషన్‌పై వైఖరి చెప్పాలన్న హైకోర్టు

డ్రగ్స్ వ్యవహారంలో దర్శకుడు క్రిష్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వైఖరేంటో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అలాగే కేసు వివరాలను తమ ముందు ఉంచాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను సోమవారానికి (మార్చి 4కు) వాయిదా వేసింది. రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు వివేకానంద వాంగ్మూలం మేరకు పోలీసులు క్రిష్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ క్రిష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

5 నుంచి బీసీ విదేశీ విద్యానిధి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: మహాత్మ జ్యోతిభాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఈనెల 5 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గురుకుల టీజీటీ తుది జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు శుక్రవారం విడుదల చేసింది. అభ్యర్థుల హాల్‌టిక్కెట్ నంబర్లతో కూడిన వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో ప్రచురించింది. టీజీటీ కేటగిరీలో 4,006 ఉద్యోగ ఖాళీలకు గతేడాది ఆగస్టులో అర్హత పరీక్షలు నిర్వహించింది. గత వారం 1:2 విధానంలో అర్హుల ప్రాథమిక జాబితాను విడుదల చేసిన గురుకుల బోర్డు... తాజాగా తుది జాబితాను వెల్లడించింది. గురుకులాల్లో 9,210 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ దాదాపు ముగిసింది. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేటగిరీలు మినహా మిగతా కేటగిరీల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయింది. కేవలం ఏడాది వ్యవధిలో దాదాపు 9వేల ఉద్యోగాలను భర్తీ చేసిన గురుకుల బోర్డు సరికొత్త రికార్డును సృష్టించింది.

నేటి నుంచి పీపుల్స్ ప్లాజాలో రాష్ట్రీయ సంస్కృతి మహోత్సవ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సంస్కృతి మహోత్సవ్ (ఆర్ఎస్ఎం) 15వ ఎడిషన్‌లో భాగంగా... 'జాతీయ స్థాయి సాంస్కృతిక వేడుకలు' జరగనున్నాయి. ఈ నెల 2 నుంచి 5 వరకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో పీపుల్స్ ప్లాజా వేదికగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ఇతివృత్తంతో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రోత్సహించడంతో పాటుగా తర్వాతి తరాలకు అందించేలా కార్యక్రమాలు నిర్వహించడమే ఈ ఉత్సవాల ముఖ్యోద్దేశమని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5న ఈ వేడుకల చివరి రోజున కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'శారీ వాకథాన్ 'కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



సిరిమానోత్సాహం

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేట మండలం పోలెపల్లి ఎల్లమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల్లో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు ఉత్సాహం చూపారు. కోడిపుంజులు, కల్లుసాకలు, కొబ్బరికాయలు సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

– బొంరాస్‌పేట

ఇంద్రియాల కంటే మనసు ఉత్తమమైనది.
మనసు కంటే బుద్ధి శ్రేష్ఠమైనది. బుద్ధి కంటే జీవాత్మ అతిగొప్పది.
జీవాత్మ కంటే అవ్యక్త శక్తి ఉత్తమమైనది.
– కఠోపనిషత్తు

సాక్షి
శనివారం, 2 మార్చి 2024

ఇంత దారుణమా?!

ఉన్నత విద్యాసంస్థల్లో చేరే విద్యార్థినులు గతంతో పోలిస్తే 44 శాతం పెరిగారని మొన్న జనవరిలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఘనంగా ప్రకటించింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల పిల్లలు ఎక్కువుండటం శుభసూచకమని చెప్పింది. కానీ ఆడపిల్లల భద్రత విషయంలో ఉన్నత విద్యాసంస్థలు శ్రద్ధ పెడుతున్నాయా? వాటిని పర్యవేక్షించాల్సిన వ్యవస్థలు ఆ సంస్థలను అప్రమత్తం చేస్తున్నాయా? గుజరాత్‌లోని గాంధీనగర్‌లో కొలువుదీరిన గుజరాత్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (జీఎన్ఎల్‌యూ) వాలకం చూస్తే ఏదీ సక్రమంగా లేదన్న సందేహం కలుగుతుంది. నిరుడు సెప్టెంబర్‌లో మీడియాలో వచ్చిన కథనాలను గుజరాత్ హైకోర్టు పరిగణనలోకి తీసుకుని నియమించిన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ అనిరుద్ధ పి. మయీల నేతృత్వంలోని ధర్మాసనాన్ని దిగ్భ్రాంతి పరిచింది. ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సాగుతున్న లైంగిక నేరాలను కప్పిపుచ్చటానికి బాధ్యతాయుత స్థానాల్లో వున్న వారు ప్రయత్నించటం భీతి గొలుపుతున్నదని న్యాయమూర్తులు అన్నారంటే అక్కడి పరిస్థితులు ఎంతగా దిగజారాయో అర్థమవుతుంది. ఈ తరహా అకృత్యాలు, వికృతాలు రాజకీయ నాయకుల అండదండలు లేకుండా సాగవు. ఒక 'పలుకుబడిగల రాజకీయ నాయకుడు' ఇలాంటి నేరగాళ్లకు వత్తాసుగా ఉన్నాడని ఒక విద్యార్థిని చెప్పటం గమనార్హం. డైరెక్టర్, రిజిస్ట్రార్, మరికొందరు అధ్యాపకులపై సైతం ఆరోపణలు రావటం గమనిస్తే విశ్వవిద్యాలయం తోడేళ్ల పాలయిందా అన్న సందేహం తలెత్తుతుంది.

ప్రపంచీకరణకు తలుపులు బార్లా తెరిచాక దేశంలో ఉన్నత విద్యాసంస్థలు కళ్లు తేలేయటం మొదలైంది. సామాజిక శాస్త్రాల అధ్యయనం మహాపాపమని పాలకులే ప్రచారం చేయటం, విద్యార్జన అంతిమ ధ్యేయం కొలువులు సాధించటం మాత్రమేనన్న అభిప్రాయం కలిగించటం ఉన్నత విద్యాసంస్థలను క్రమేపీ దిగజార్చాయి. తాము ఈ సమాజం నుంచి వచ్చామని, తమ మేధస్సును దీని ఉన్నతికి వినియోగించాలన్న స్పృహ విద్యార్థుల్లో కరువైంది. చాలా ఉన్నత విద్యాసంస్థలు ఇప్పుడు కుల, మత, ప్రాంతీయ జాడ్యాల్లో కూరుకుపోయాయి. ఆడపిల్లల హాస్టళ్లలో సైతం ర్యాగింగ్‌లు సాగుతుండటం, కొందరు సస్పెండవుతున్నట్టు వార్తలు రావటం యాదృచ్ఛికం కాదు. వర్తమానంలో సినిమా హీరోలూ, క్రికెటర్లూ, ప్రపంచ సంగీత దిగ్గజాలూ ఆరాధ్య దైవాలవుతున్నారు. మాదకద్రవ్యాల సంగతి సరేసరి. ఇన్ని కశ్మలాల మధ్య కూనారిల్లుతున్న విద్యాసంస్థలు రాణిస్తాయని, విద్యార్థులకు వివేకాన్నీ, విజ్ఞానాన్నీ అందిస్తాయని నమ్మటం అమాయకత్వమే అవుతుంది. జీఎన్ఎల్‌యూలోని దారుణాలపై కనీసం అయిదేళ్లుగా ఆరోపణలు వినబడుతున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో మారుపేర్లతో కొందరు విద్యార్థినులు తమకెదురైన చేదు అనుభవాలను ఏకరువు పెట్టిన ఉదంతాలున్నాయి. అటువంటి ఉదంతం ఆధారంగా మీడియాలో వచ్చిన కథనమే గుజరాత్ హైకోర్టును రంగంలోకి దించింది. కానీ విశ్వవిద్యాలయం ఏం చేసింది? చర్యల మాట అటుంచి... సాక్షాత్తూ హైకోర్టు ధర్మాసనమే అడిగిందన్న ఇంగితజ్ఞానం కూడా లేకుండా రిజిస్ట్రార్ బుకాయింపులకు దిగాడు. ఈ మహానుభావుడే అంతక్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టిన ఇద్దరు విద్యార్థినులను మందలించాడు. ఆఖరికి బాలికల హాస్టల్ వార్డెన్‌గా ఉన్న మహిళా ప్రొఫెసర్ సైతం వారిని భయపెట్టి ఆ పోస్టులను తొలగింపజేశారు. సంస్థ కీర్తిప్రతిష్ఠలు దెబ్బతింటాయన్న సాకుతోనే ఇదంతా సాగించారు. పేరుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) వుంది. ఒక మహిళా ప్రొఫెసర్ నేతృత్వంలోనే సాగుతోంది. కానీ ఆ కమిటీకి ఫిర్యాదు చేయటం దండగ అనుకున్నారో, దానిగురించి తెలియనే తెలియదో ఏ బాలికా వారికి ఫిర్యాదు చేయలేదు. కనీసం ఆ కమిటీ తనంత తానే విచారణ జరపాలి కదా... ఆ పని కూడా జరగలేదు. తొలుత దారుణాలు తన దృష్టికొచ్చాక హైకోర్టు నియమించిన కమిటీలో ఐసీసీ చైర్‌పర్సన్‌కు కూడా చోటిచ్చారు. కానీ ఆమె గారి నిర్వాకం తెలిశాక ఆ కమిటీని రద్దుచేసి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో మరో కమిటీని ఏర్పాటు చేశారు. కనుకనే ఈ అకృత్యాలు వెలుగులోకొచ్చాయి.

విద్యార్థుల్లో జిజ్ఞాస రేకెత్తించటం, తార్కిక శక్తిని పెంచటం, స్ఫూర్తి రగల్చటం, వారిని సామాజిక మార్పులకు చోదకశక్తులుగా మార్చటం ఉన్నత విద్య లక్ష్యం. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వంటిచోట తమ పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు ఎందుకు ఆసక్తి చూపుతారు? అక్కడైతే అత్యున్నత ప్రమాణాలున్న న్యాయవిద్య అందుతుందని, ఆ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సెమినార్లు, ఇతర సదస్సులు తమ పిల్లలను ఉన్నతశ్రేణికి చేరుస్తాయని వారు ఆశిస్తారు. కానీ జరిగిందేమిటి? రేపన్నరోజున న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి సమాజంలోని దురంతాలను అంతం చేయాల్సినవారే బాధితులుగా మారారు. ఎవరికి చెప్పుకోవాలో, ఎట్లా ఎదుర్కోనాలో తెలియని నిస్సహాయ స్థితిలో పడ్డారు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఉదంతం తర్వాత జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిర్భయ చట్టం వచ్చింది. విద్యాసంస్థల్లోనూ, పనిస్థలాల్లోనూ బాలికలకు, మహిళకు భద్రత కల్పించటం వ్యక్తుల, సంస్థల బాధ్యతగా ఆ చట్టం గుర్తించింది. విఫలమైన పక్షంలో కఠినంగా దండించే నిబంధనలున్నాయి. కానీ జరిగిందేమిటి? ఈ దురంతాలపై లోతుగా విచారణ జరగాలి. నేరగాళ్లకూ, వారికి తోడ్పడిన పెద్దలకూ కఠినశిక్షలు పడేలా చర్యలుండాలి. దేశంలోని ఉన్నత విద్యాసంస్థలన్నిటికీ ఆ చర్యలు ఒక హెచ్చరిక కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.సప్తమి రా.3.33 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** విశాఖ ఉ.10.31 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ప.2.40 నుండి 4.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.20 నుండి 7.54 వరకు, **అమృతఘడియలు:** రా.12.34 నుండి 2.19 వరకు.

సూర్యోదయం: 6.22
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

పంట విక్రయంలో సాంకేతిక దన్ను

విశ్లేషణ



సంజీవ్ చోప్రా

పీవీ నరసింహారావు హయాంలో 1994లో 'స్మాల్ ఫార్మర్స్ అగ్రి–బిజినెస్ కన్సార్టియం' (ఎస్ఎఫ్ఏసీ) ఏర్పాటుచేయడం అర్థవంతమైన విధానపరమైన జోక్యం. ఆ సంస్థే ఇప్పుడు వ్యవసాయం కోసం జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే బాధ్యత చూస్తోంది. దీని కారణంగా, 2016లో నరేంద్ర మోదీ ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్' (ఈ–నామ్) పేరిట ఒక 'ఫిజిటల్' (ఫిజికల్ ప్లస్ డిజిటల్) మార్కెట్‌ను ప్రారంభించారు. దీనివల్ల 23 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 1.07 కోట్ల మంది రైతులకు వారి సొంత భాషలో, వారి మొబైల్ ఫోన్‌లో లావాదేవీలు జరిపే స్వేచ్ఛ, సౌలభ్యం ఏర్పడ్డాయి. 2024 జనవరి నాటికి, ఈ–నామ్ వల్ల రూ. 3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరిగింది. దీనికి మరింత ఊపునిచ్చేలా, ఇ–మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయడానికిగానూ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక్కో నియంత్రిత మండీకి నిధులు సమకూర్చింది.

మాజీ ప్రధానులు చరణ్ సింగ్, పీవీ నరసింహారావు, శాస్త్రవేత్త–అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌లకు ఇటీవల భారతరత్న ప్రదానం చేయడం భారతీయ రైతు వ్యవస్థాపక స్ఫూర్తికి నివాళి అనే చెప్పాలి. ఈ ముగ్గురూ వ్యవసాయంతో పాటు రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. స్వామినాథన్ అందించిన తోడ్పాటు సుపరిచితమే కాదు, అది అందరూ గుర్తించిన విషయమే. అయితే హరిత విప్లవాన్ని విజయవంతం చేసిన రాజకీయ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. సోవియట్, చైనీస్ తరహా 'సామూహిక వ్యవసాయం'లో ఉన్న ప్రమాదాలను నెహ్రూకి వివరించినది చరణ్ సింగ్. రైతులు రాటుదేలిపోయిన స్వతంత్ర సాగుదారులనీ, ప్రణాళికా సంఘం మెచ్చుకున్న 'ల్యాండ్ పూలింగ్, సహకార వ్యవసాయం' అనే కేంద్రీకృత ప్రణాళికను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనీ చరణ్ సింగ్ స్పష్టం చేశారు.

దార్శనికుడి విధాన జోక్యం

పీవీ నరసింహారావు హయాంలో భారతదేశం, ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరి వ్యవసాయ ఒప్పందంపై సంతకం చేసింది. అప్పటి వరకు, భారతదేశ విధాన వ్యవస్థ దిగుమతులను పరిమితం చేసింది. పీవీ ఆధ్వర్యంలో, భారతదేశం వ్యవసాయ ఎగుమతులను ఒక ముఖ్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టేదిగా చూసింది. ఏపీఈడీఏ (అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ)కి బడ్జెటరీ, సంస్థాగత మద్దతుతో, ఆయన భారతీయ వ్యవసాయాన్ని ప్రపంచవ్యాప్త పోటీదారుగా మార్చడంలో తోడ్పడ్డారు. అయినప్పటికీ దేశీయ వాణిజ్యం మాత్రం రైతుల కోసం కాకుండా, సేకరణ ఏజెన్సీలకూ, వ్యవసాయ పంటల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)లలోని నమోదైన వ్యాపారులకూ అనుకూలంగా నిర్బంధ వాణిజ్య పద్ధతుల ద్వారా నిర్వహించబడుతూనే ఉంది.

1994లో 'స్మాల్ ఫార్మర్స్ అగ్రి–బిజినెస్ కన్సార్టియం' (ఎస్ఎఫ్ఏసీ) స్థాపన, పీవీ చేసిన అత్యంత అర్థవంతమైన విధానపరమైన జోక్యం కావచ్చు. ఈ సంస్థకే వ్యవసాయం కోసం జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే బాధ్యతను అప్పగించారు. 2016 ఏప్రిల్ 14న ప్రధాని నరేంద్ర మోదీ ఎస్ఎఫ్ఏసీ మద్దతుతో 'ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్' (ఈ–నామ్) పేరిట ఒక 'ఫిజిటల్' (ఫిజికల్ ప్లస్ డిజిటల్) మార్కెట్‌ను ప్రారంభించారు. ఇది ఫిజికల్ బ్యాక్ ఎండ్‌తో కూడిన సింగిల్ విండో పోర్టల్. కార్యాచరణ సమాచారం, భౌతిక మౌలిక సదుపాయాలు, వాణిజ్య ఎంపికలు, చెల్లింపులపై ఎలక్ట్రానిక్ సెటిల్‌మెంట్లను ఇది అందిస్తుంది.

నేడు, ఎస్ఎఫ్ఏసీ చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల 23 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 1,389 నియంత్రిత హోల్‌సేల్ మార్కెట్లలో, 1.07 కోట్ల మంది రైతులు వారి సొంత భాషలో, వారి మొబైల్ ఫోన్‌లలో లావాదేవీలు జరిపే స్వేచ్ఛ, సౌలభ్యం కలిగి ఉన్నారు. భాగస్వామ్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరో 1.7 లక్షల ఇంటిగ్రేటెడ్ లైసెన్స్‌లను జారీ చేశారు. ఈ వేదికకు తమ మద్దతును ప్రతిబింబించేలా దాదాపు 3,500 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) ఇందులో చురుకుగా పాల్గొనడం గమనార్హం. 2024 జనవరి నాటికి, ఈ–నామ్ వల్ల రూ. 3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరిగింది.



తగిన బాధ్యత

ఈ విజయవంతమైన నేపథ్యాన్ని పంచుకోవడం అత్యవసరం. రైతుకు విపత్కరమైన అమ్మకాల నుండి రక్షణ కల్పించే ఉద్దేశంతో 1950వ దశకంలో 'ఏపీఎంసీ'లను ప్రవేశపెట్టారు. 'ధర ఆవిష్కరణ'ను నిర్ధారించడానికీ, కనీస మద్దతు ధర వ్యవస్థలో రాష్ట్ర ఏజెన్సీల ద్వారా సేకరణకు వేదికను అందించడానికీ ఇవి రూపొందాయి. అయితే, ఈ ప్రక్రియలో, వారు మధ్యవర్తుల ప్రత్యేక తరగతిని కూడా సృష్టించారు. నిర్దిష్ట మండీలో దాని అధికారికమైన కమాండ్ ఏరియాతో లైసెన్స్ కలిగి ఉన్న వ్యాపారిని స్థిరపరిచారు.

అయితే, భారతదేశం ఐటీ సూపర్‌పవర్‌గా అవతరించడం, రైతు నుండి మార్కెట్ ఉత్పత్తి విధానంలోకి వ్యవసాయం మారడంతో, వాణిజ్య పరిమితి నిబంధనలను మార్చవలసిన అవసరం ఏర్పడింది. సాంకేతికతలు, ఆర్థిక సాధనాల ద్వారా సన్నకారు, చిన్న రైతులకు వాణిజ్య నిబంధనలను మెరుగుపరచడానికి ఎస్ఎఫ్ఏసీ వంటి సంస్థలు స్థాపితమయ్యాయి. వ్యవసాయ–వ్యాపార వ్యవస్థాపకులకు వెంచర్ క్యాపిటల్ నిధులను అందించడం నుండి మౌలిక సదుపాయాల కల్పన వరకు ఎస్ఎఫ్ఏసీ కొత్త పుంతలు తొక్కింది. అందుకే ఈ–నామ్ స్థాపన బాధ్యతను ఎస్ఎఫ్ఏసీకే అప్పగించడంలో ఆశ్చర్యం లేదు మరి.

దీనికి మరింత ఊపునిచ్చేలా, ఇ–మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయడానికిగానూ కంప్యూటర్ హార్డ్‌వేర్, ఇంటర్నెట్ సౌకర్యం, పరీక్షా పరికరాలు వంటి సామగ్రి లేదా మౌలిక సదుపాయాల కోసం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక్కో నియంత్రిత మండీకి రూ. 30 లక్షలు మంజూరు చేసింది. క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకేజింగ్ సౌకర్యాలు, బయో–కంపోస్టింగ్ యూనిట్ వంటి అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ మొత్తాన్ని 2017లో రూ.75 లక్షలకు పెంచారు. మొదటి మూడేళ్లలో దాదాపు 200 మండీలను దీని పరిధిలోకి తీసుకురాగా, 2020 మే నాటికి మరో 415 మండీలు జమయ్యాయి. 2022 జూలై నాటికి మరో 260 మండీలు, 2023 మార్చి నాటికి మరో 101 మండీలు పెరిగాయి. గత సంవత్సరం ముగిసేనాటికి మరో 28 వీటికి కలిశాయి. ప్రతి త్రైమాసికంలో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది.

మరింత పురోగమించేలా...

విధాన రూపకల్పన అనేది సులభం. కానీ భౌతిక, ఐటీ మౌలిక సదుపాయాల కల్పనే కష్టం. ఇంకా కష్టతరమైనది క్షేత్రస్థాయిలో చేసే పని. ఈ–నామ్‌తో అనుసంధానమైన ప్రతి మండీకి ఒక ఏడాది పాటు ప్రారంభ శిక్షణ కోసం ఎస్ఎఫ్ఏసీ ఒక ఐటీ నిపుణుడిని (మండి విశ్లేషకుడు) గుర్తించి, మద్దతునిస్తుంది. వారు రాష్ట్ర సమన్వయ కర్త(ల)కు నివేదిస్తారు. ఈ సమన్వయకర్తలు ఒక్కొక్కరు 50 మండీల రోజువారీ సమన్వయాన్ని నిర్వహిస్తారు. ఈ–నామ్ విధానంలోని రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, మండి అధికారులందరికీ ఉచితంగా శిక్షణ ఇవ్వడం కూడా వీరి బాధ్యత.

తర్వాత ఏమిటి? సాధించిన పురోగతితో ఆగకుండా, ఈ–నామ్ కొత్త, ఉన్నత ప్రమాణాలను ఏర్పరుస్తోంది. దీని సవరించిన ఆదేశంలో రైతులకు పోటీ ధరలను సాధ్యం చేయడం కోసం కృషి చేస్తుంది. ఏపీఎంసీ నియంత్రిత మార్కెట్ కమిటీ మండీలకు వెలుపల కూడా వేదికలను ఏర్పాటుచేయడం ద్వారా దీన్ని సాధిస్తుంది. ఈ–నామ్ ద్వారా గిడ్డంగి ఆధారిత విక్రయానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. అంతిమంగా, ధరను కనుగొనడం, విక్రయించే స్వేచ్ఛ అనేవి రైతుకు ఎక్కువ మేలు చేస్తాయి.

వ్యాసకర్త లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మాజీ డైరెక్టర్ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అప్పటివరకే...



కాంగ్రెస్‌లో ఉండే సంఘీయులు కాంగ్రెస్ లోపల ఉన్నంతవరకే బీజేపీకి ఉపయోగం. వాళ్లను ఒకసారి బయటికి పంపేస్తే, వాళ్ల విలువ క్రమంగా సున్నా అవుతుంది.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

గెలిచే అవకాశం



అన్ని అంచనాలను దాటేస్తూ ఇండియా ఎకానమీ 8.4 శాతం జీడీపీ వృద్ధిరేటును (అక్టోబర్– డిసెంబర్ వరకు) నమోదు చేసింది. ఇది ఈ సంవత్సర ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరిన్ని ఎక్కువ సీట్లతో గెలిచే అవకాశాలను మరింతగా పెంచింది.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

నా నిరసన



దీన్ని నేను పోస్ట్ చేయడం వల్ల లాభం లేదని తెలుసు. దీనివల్ల తేడా కూడా ఏమీ ఉండదు. కానీ గాజా నరమేధానికి కారణం అవుతున్న ఇజ్రాయెల్, యూఎస్ ప్రభుత్వాల మీద; వాటికి మద్దతు ఇస్తున్నవారి మీద నా ఆగ్రహం, అసహ్యాలను నియంత్రించుకోలేక ఇది రాస్తున్నాను.

– బార్నెట్ ఆర్. రూబిన్, యూఎస్ పొలిటికల్ సైంటిస్ట్

అరగంట ముందు...



భోంచేస్తున్నప్పుడు నీటిని తాగడం అనేది జీర్ణక్రియకు ఆత్మాహత్యా సదృశం. దానికి బదులుగా భోజనానికి అరగంట ముందు నీళ్లు తాగండి. దీనివల్ల అవసరానికి మించి తినడం ఆగుతుంది, జీర్ణక్రియ మెరుగవుతుంది, జీర్ణ రసాయనాలు పలుచబడవు.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

అది తప్పు



ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న అత్యధికుల్లో అరబ్ యూదులు, అరబ్ ముస్లింలు, ఆఫ్రికన్ యూదులు, టర్కిష్ యూదులు ఉన్నారు. 'శ్వేత సామ్రాజ్యవాద ప్రాజెక్టు' అని ఇజ్రాయెల్‌ను పిలవడమంటే దారుణ అమాయకత్వం. – లుయీ అహ్మద్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

నలభీముల సాటి



చాలామంది కుక్స్, షెఫ్స్ ఉన్నారు; కానీ ఎవరూ ఇంతియాజ్ ఖురేషీకి సాటిరారు. పాకశాస్త్ర కళను అభ్యసిస్తున్న వాళ్లు ఎవరైనా ఆయన్ని ఒక ఐకాన్‌గా, స్ఫూర్తి ప్రదాతగా చూస్తారు. ఆహారం మీద ఆయనకు గొప్ప కుతూహలం ఉండేది. ఆయన లేని లోటు కనబడుతోంది. (దమ్‌పుఖ్త్– చిన్న మంట మీద నెమ్మదిగా ఉడికించే సంప్రదాయాన్ని పునరుద్ధరించిన ఇంతియాజ్ ఖురేషీ తన 93వ ఏట ఇటీవల మరణించారు.) – సదాఫ్ హుస్సేన్, షెఫ్

విసిగిస్తే అంతే మరి...



పడిపోయాడని 92 ఏళ్ల మా నాన్నను హాస్పిటల్‌కు తీసుకెళ్లాను. రక్తమోడుతున్న చేతికి చికిత్స చేయాల్సింది పోయి, ఆయన్ని 1. మీరు కోవిడ్, ఫ్లూ బూస్టర్స్ ఠంచనుగా వేసుకుంటున్నారా? 2. మీ ఇంట్లో తుపాకులు ఉన్నాయా? 3. మీకు ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయా? అని అడిగారు. ఆయనకేమో చెవుడు. 'డాడ్, నిన్ను నువ్వు చంపుకోవాలనుకుంటున్నావా?' అని ఆవిడ అడుగు తోంది' అని విడమరిచాను. 'ఇప్పటిదాకా అయితే అనిపించలేదు' అని గట్టిగా నవ్వారు.

– కెల్లీ పాల్, యూఎస్ రచయిత్రి

ఇన్ బాక్స్

వరంగల్ జైలును నిర్మించాలి

గత ప్రభుత్వం దాదాపు 135 ఏళ్ల చరిత్ర గల ఓరుగల్లు జైలును కూల్చి అదే స్థలంలో హాస్పిటల్ నిర్మాణం పనులు చేపట్టింది. జైళ్ల శాఖ అధికారులు ప్రజలకు ఉపయోగపడుతుందని వరంగల్ జైలు స్థలం హాస్పిటల్‌కు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేకుండా ఒప్పుకున్నారు. ఇందుకు ప్రతిగా వరంగల్ శివారులో పోలీస్ బెటాలియన్ పరిధిలో ఉన్న 101 ఎకరాలను ప్రభుత్వం జైళ్ల శాఖకు కేటాయించింది. అయితే హాస్పిటల్ నిర్మాణం పూర్తి కావస్తుంది కానీ నూతన జైలు నిర్మాణం కోసం శంకుస్థాపన కూడా చేయలేదు. స్వాతంత్ర్య పోరాటం, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం, తెలంగాణ తొలి–మలిదశ ఉద్యమాలు వంటివాటిలో పాల్గొన్నవారిని కొందరిని ఈ జైల్లోనే పెట్టారు.

వరంగల్ జైలు కూల్చి వేసినప్పుడు దాదాపు 970 మంది ఖైదీలను ఇతర జైళ్లకు తరలించారు. వారితో ములాకత్ కోసం బంధువులు ఇప్పుడు ఇతర జిల్లాలకు వెళ్తూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే విచారణ ఖైదీలు కోర్టులకు హాజరు పర్చడంలో సిబ్బంది కూడా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వరంగల్ ఖైదీలను నిజామాబాద్, హైదరాబాద్, అదిలాబాద్‌లలో ఉన్న జైళ్లలో ఉంచడం వల్ల వారి బంధువులు ఎంతో దూరం ప్రయాణం చేసి ములాకత్‌కు పొతే... వీరు పోయేసరికి సమయం అయిపోవడం జరుగుతోంది. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసి వారి కుటుంబ సభ్యులను కలిసి రావడం ఇబ్బంది కరంగా ఉంది.

వరంగల్ జైలు కూల్చినప్పుడు దాదాపు 267 మంది ఉద్యోగులు పనిచేసేవారు. ఇంకా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరంతా స్థానికంగా దాదాపు స్థిరపడ్డవారే. జైలును కూల్చివేయడంతో వీరిని దూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో పిల్లల చదువులు దెబ్బతిన్నాయి. కుటుంబాలు ఇక్కట్ల పాలవుతున్నాయి. ముఖ్యంగా రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నవారు కుటుంబాలను ఒకచోట ఉంచి, విధులు దూరంగా ఉన్న ప్రాంతాల్లో నిర్వహిస్తూ మానసిక వేదనకు గురవుతున్నారు. ఈ అన్ని అంశాలనూ దృష్టిలో ఉంచుకొని నూతన ప్రభుత్వం వెంటనే వరంగల్ జైలును నిర్మించాలి.

– ముచ్చుకర్ సుమన్ గౌడ్, కరీంనగర్

కుల రహిత భారతం సాధ్యమే

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

భారతదేశానికి 'కులం' అనేది ఓ శాపం లాంటిది. కుల వ్యవస్థ... తద్వారా వచ్చిన సామాజిక అంతరాల వల్ల ఉత్పత్తి శక్తుల ప్రతిభ నిర్వీర్యమైంది. మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గ వ్యవస్థ వేల ఏండ్లుగా కొనసాగుతోంది. అంబేడ్కర్ లాంటి ప్రపంచ మేధావియే కుల వ్యవస్థ దుర్మార్గం వల్ల విపరీతమైన వేదనకు గురయ్యారు. ఈ కులవ్యవస్థ పొడగింపు ప్రజాస్వామ్య ప్రభుత్వాల కాలంలోనూ కొనసాగడం గమనార్హం.

కులవ్యవస్థ భారత జాతిని నిర్వీర్యం చేసింది. దేశంలోని 85 శాతం ప్రజలను సేవకులుగా మార్చింది. అందుకే కుల రహిత భారతాన్ని కోరుకున్నారు అంబేడ్కర్. భారత దేశం కుల రహితంగా మారేంత వరకూ, ఆ వ్యవస్థ వల్ల వచ్చిన సామాజిక అంతరాలు పోయే వరకూ శూద్రులకు, అతిశూద్రులకు రిజర్వేషన్లు కల్పించాలని పోరాడి రాజ్యాంగంలో పొందుపరిచారు. కుల నిర్మూలన సిద్ధాంతాన్ని అందించారు. కులరహిత భారతాన్నీ, సెక్యులర్ భారతాన్నీ అంబేడ్కర్ కోరుకున్నారు. కానీ, రాజ్యాధికారంలో ఉంటున్నదీ, రాజ్యాంగాన్ని అమలుపరిచే స్థానంలో ఉంటున్నదీ కుల వ్యవస్థ వల్ల లాభపడుతున్న వారే కావడం వల్ల కుల నిర్మూలన జరుగడం లేదు. రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశిక సూత్రాలు కూడా అమలు కావడం లేదు.

ఏది ఏమైనా దేశాన్ని అంధకార యుగంలోకి తీసుకు వెళ్ళే కులవ్యవస్థ అంతరించాల్సిందే. కులవ్యవస్థ అంతరించడమంటే వృత్తి పనులు అంతరించడం కాదు. అన్ని దేశాల్లోనూ వివిధ వృత్తులకు సంబంధించిన పనులున్నాయి, కానీ కులాలు లేవు. కుల వృత్తులు లేవు. అయితే కులవ్యవస్థ లేనిచోట అన్ని సమస్యలూ పరిష్కారమైనాయా అంటే కాక పోయి ఉండవచ్చుగాక. కాని, కులవ్యవస్థ



వల్ల వచ్చే పుట్టుకతోనే దఖలుపడే అధికారాలు, ఆస్తులు, వివక్ష, పేదరికం, సామాజిక అంతరాలు అక్కడ లేవు. దేశంలోని కోట్లాది మందిని అస్పృశ్యులుగా ముద్ర వేయడం ఏ దేశంలోనూ లేదు. ఒక్క భారత్‌లో తప్ప. కుల రహిత భారతం ఏర్పడితే భారత జాతి అంతా ఒక్క టవుతుంది. సామాజిక అంతరాలు దూరమవుతాయి. ఎవరికిష్టమైన పనిని, వృత్తిని వారు స్వీకరిస్తారు. ఇది తక్కువ పని, అది ఎక్కువ పని అనే భేద భావాలు తొలగిపోతాయి. విదేశాల్లోలా కులాల బట్టి కాకుండా ఎవరికి ఏ పనిలో నైపుణ్యముంటుందో ఏ పని చేయడానికి ఇష్ట పడుతారో ఆ పని చేస్తారు. అందరూ అన్ని పనులూ చేస్తుంటే సామాజిక అంతరాలు ఆటోమేటిక్‌గా తొలగిపోతాయి.


కులాలను కాపాడుతున్నవారు కులాలతో సామాజిక గౌరవం, ఆస్తులు, రాజ్యాధికారం అనుభవిస్తున్నారు. వీళ్ళు కులనిర్మూలనకు సహకరించకపోగా కులాలను పెంచి పోషిస్తున్నారు. వీరి స్థానంలో కుల బాధితులూ, కులంలో అత్యంత హీనస్థితిలో ఉన్నవారూ, మూలజాతుల వారూ రాజ్యాధికారంలోకి వస్తే మంచి ఫలితం ఉంటుంది. వీరు కనీసం యాభై ఏళ్లు పరిపాలన చేస్తే కుల నిర్మూలన జరుగుతుంది.

నిచ్చెన మెట్ల కుల సమాజంలో అట్టడుగున ఉన్నవారు రాజ్యాధిరారంలోకి వస్తే పై మెట్టుపై ఉన్న వారు మాకీ కులాలు వద్దని మొత్తుకుంటారు. కుల నిర్మూలనకు సహకరిస్తారు. ఎలాగూ వేల ఏండ్లుగా బాధితులైన మూలజాతుల వారు తాము పాలకులై తమను ఇన్నేండ్లుగా బాధలో ఉంచిన కులాన్ని నిర్మూలించే ప్రయత్నం చేస్తారు. ఇలా అటు అగ్రకులాల వారూ, ఇటు శూద్ర, అతిశూద్ర కులాలవారూ కులనిర్మూలనకు సహకరిస్తే ఓ యాభై అరవై ఏళ్లల్లో దేశం లోంచి కులం మాయమైపోతుంది.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

తామరాకుపై నీటిబొట్టు!

'శూన్యమైన మనస్సు' అనేది సాధ్యమయ్యే పనేనా? అంటే కాదనే సమాధానం వస్తుంది. బాహ్య ప్రపంచాన్ని పూర్తిగా త్యజించి చేసే అతి కఠోరమైన తపస్సులో కూడా మనస్సు శూన్యం కాదన్న విషయాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే ఇందులో నిజం అర్థమౌతుంది. తపస్సు ఒక ధ్యానం. ఏదైతే ధ్యానించబడుతుందో దానితో మనసు నిండిపోయి ఉంటుంది. మనస్సును ఎంతవరకు ఖాళీ చెయ్యగలమంటే 'ఏకాగ్ర చిత్తం' అనే స్థాయి వరకే అనేది సత్యం. అంతకు మించిన స్థితి సాధ్యమయ్యేది కాదు. ధ్యానంలో అయినా, తపస్సులో అయినా పనిచేస్తూ ఉండేది ఏకాగ్ర చిత్తమే అన్నది అర్థం చేసుకోవచ్చు. విషయ లాలసకు లోనుకాని చిత్తం ఏకాగ్రతను అతి సులభంగా అందిపుచ్చుకునే సామర్థ్యం కలిగినదిగా ఉంటుంది. రోజువారీ జీవనంలో అనివార్యంగా వచ్చే సుఖం, అనగా ప్రయత్నం చేసి కూడా తాను నివారించ లేని సుఖాన్ని అనుభవించడం విషయలాలస అనిపించుకోదు. కనుపర్తి అబ్బయామాత్యుడు 'కవిరాజ మనోరంజనం' కావ్యం, ప్రథమాశ్వాసం లోని ఒక పద్యంలో, ఆ స్థితిలోని ఔన్నత్యాన్ని ఇలా వర్ణించాడు:



జ్యోతిర్మయం

నిర్విషయ చిత్తుడగు బ్రహ్మనిష్ఠునకును
దనుసుఖంబులు ప్రారబ్ధమున ఘటించు
నంతియే కాని యవి వాని నంటకుండు
గమలపత్త్రాగ్రమున జలకణిక వోలె.

విషయలాలసకు లోనుకాకుండా, నిర్విషయ చిత్తంతో బ్రహ్మైక్యం సాధించడమనే కోరిక తప్ప మరే ఇతర కోరిక లేని మనసు కలిగిన వ్యక్తికి కూడా 'తను సుఖంబులు' – అనగా శరీరానికి సంబంధించిన సుఖాలు – రోజువారీ జీవితంలో ఆ వ్యక్తి ఆచరించే కర్మలకు అనుగుణంగా తప్పక కలుగుతూనే ఉంటాయి. తప్పించుకోవాలన్నా తప్పనివిగా ఆ సుఖాలు ఉంటుంటాయి. అయినప్పటికీ ఆ సుఖాలు అతడి అంతరంగాన్ని అంటిపెట్టుకుని ఉండి, జీవితాన్ని ప్రభావితం చేసేవిగా మాత్రం ఉండవు. 'తామరాకుపై నీటి బొట్టు' చందంగా ఉంటాయి అని పోల్చాడు కనుపర్తి అబ్బయామాత్యుడు పై పద్యంలో. ఆ పోలికలో 'నీటిబొట్టు' అని చెప్పడానికి 'జలకణిక' అనే కొత్త మాటను ఉద్దేశపూర్వకంగానే ప్రయోగించాడు. పాపం అంటనిది, పవిత్రతకు ప్రతిరూపం అయినటువంటిది అయిన 'నిప్పుకణిక' నుంచి స్ఫూర్తిని పొంది సృజించిన మాట ఈ 'జలకణిక' 'నిప్పుకణిక' అంత పవిత్రమైనదే తామరాకుపై నిలిచి ఉండే 'జలకణిక' వంటి నిర్విషయ చిత్తుడి నిర్వికార అంతరంగం అని చెప్పడం అందులో కవి ఉద్దేశ్యం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

బిల్లులు చెల్లించకుంటే కరెంట్ కట్!

● డిస్కంలకు కేంద్రం షాక్

సాక్షి, హైదరాబాద్: తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉన్న రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. ప్రైవేటు, కేంద్ర ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కి సంబంధించిన బిల్లులను నిర్దేశిత గడువులోగా చెల్లించడంలో విఫలమయ్యే డిస్కంలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో కరెంట్ సరఫరాను పూర్తిగా నిలిపి వేయాలని నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్‌ఎల్డీసీ)ను ఆదేశించింది. ఒక విద్యుదుత్పత్తి కంపెనీకి బిల్లులను గడువులోగా చెల్లించడంలో విఫలమైతే దాని నుంచి విద్యుత్ సరఫరాను మాత్రమే నిలుపుదల చేయాలని ప్రస్తుతం అమల్లో ఉన్న లేట్ పేమెంట్ సర్‌చార్జి (ఎల్పీఎస్)–2022 నిబంధనలు పేర్కొంటున్నాయి. అలాంటప్పుడు ప్రత్యామ్నాయంగా ఇతర విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి స్వల్పకాలిక ఒప్పందాల ద్వారా/పవర్ ఎక్స్ఛేంజీల నుంచి ఓపెన్ యాక్సెస్‌లో డిస్కంలు విద్యుత్ కొనుగోలు చేసుకోవ డానికి అవకాశం ఉండేది. కానీ తాజాగా ఓపెన్ యాక్సెస్ విధానంలో డిస్కంలు విద్యుత్ కొనుగోళ్లు జరపకుండా పూర్తిగా అడ్డుకోవాలని ఎన్‌ఎల్డీసీని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు రెండు కీలక సవరణలను అమల్లోకి తెచ్చినట్టు కేంద్ర విద్యుత్ శాఖ శుక్రవారం ప్రకటించింది.

టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా అమిర్ ఉల్లా ఖాన్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా నియమితులైన ఇండియన్ పోస్టల్ సర్వీస్ విశ్రాంత అధికారి అమిర్ ఉల్లా ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు.

ఘనంగా ఎల్‌పీయూ 11వ స్నాతకోత్సవం

సాక్షి, హైదరాబాద్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం చండీఘర్‌లోని జలంధర్‌లో ఘనంగా జరిగింది. ఈ స్నాతకోత్సవా నికి ఆస్ట్రేలియా మాజీ ప్రధాని టోనీ అబాట్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎల్ పీయూ వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ అశోక్ మిట్టల్ మాట్లాడుతూ... ఆస్ట్రేలియాలోని 16 యూనివర్సిటీలతో ఎల్‌పీ యూ అనుసంధానమై విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో బోధనను అందిస్తుంద న్నారు. స్నాతకోత్సవంలో లవ్లీ గ్రూప్ చైర్మన్ రమేశ్ మిట్టల్, వైస్ చైర్మన్ నరేశ్ మిట్టల్, ఎల్‌పీయూ వీసీ రష్మీ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో డీఎస్సీ ప్రక్రియ

● విధి విధానాల రూపకల్పన, ప్రశ్నల తయారీ అంతా కేంద్రీకృతంగానే..
● కీలక పాస్‌వర్డ్స్ అన్నీ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో..
● ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే వారి గత చరిత్ర కూడా పరిగణనలోకి
● నియామక ఉత్తర్వులు జిల్లా స్థాయిలో..



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ప్రకటించిన డీఎస్సీ విధివిధానాలకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తయింది. ఈ నెల 4వ తేదీన పూర్తి సమాచారం వెలువరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష విధానం, సిలబస్, రిజర్వేషన్లను ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాల వారీగా పోస్టుల విభజన జరిగింది. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, భాషా పండితులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు బోధించే టీచర్ల ఖాళీలను వెల్లడించారు. ఈ ప్రక్రియ మొత్తం జిల్లా అధికారుల పరిధిలోనే జరిగింది. ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చే సమయంలో వీరి పాత్ర ఉండనుంది. కానీ పరీక్ష విధివిధానాల రూపకల్పన, ప్రశ్నపత్రాల తయారీ, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక అన్నీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్రీకృత వ్యవస్థతోనే డీఎస్సీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. ఈ ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర విద్యాశాఖ మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తుంది. వారికి జిల్లా అధికారులు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుందని విధివిధానాల్లో పేర్కొననున్నారు.

ఎక్కడా పొరపాట్లు జరగకుండా..

డీఎస్సీ సిలబస్‌పై అధికారులు ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చినట్లు సమాచారం. సబ్జెక్టు నిపుణులతో వివిధ విభాగాలకు సంబంధించిన ప్రశ్నల తయారీ అంతా రాష్ట్ర అధికారుల పరిధిలోనే జరుగుతుంది. ప్రశ్నపత్రం ఎక్కడా లీక్ అవ్వకుండా సాంకేతిక విభాగాన్ని పటిష్ట పరుస్తున్నారు. అవసరమైన కీలక పాస్‌వర్డ్స్ అన్నీ రాష్ట్ర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉంచాలని నిర్ణయించారు. ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే వారి గత చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది. దీంతో ఎలాంటి ఫిర్యాదులు లేని వ్యక్తులను ఎంపిక చేసే పనిలో ఉన్నారు.

టెట్‌కు 20 శాతం వెయిటేజ్

సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ తదితర పోస్టులకు కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్), ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిర్వహించిన టెట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్టు తెలిసింది. పరీక్షా సమయం మూడు గంటల పాటు ఉండబోతోంది. మొత్తం 160 ప్రశ్నలతో, 80 మార్కులకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మే 23 నుంచి పది రోజుల పాటు కంప్యూటర్ బేస్డ్‌గానే పరీక్ష ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ డీఎస్సీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదనపు జిల్లా కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిషత్ సీఈవోలు సభ్యులుగా ఉంటారు. వీరు పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ బాధ్యతలు నిర్వహిస్తారు. దరఖాస్తు స్వీకరణ మొత్తం ఆన్‌లైన్‌లో పద్ధతిలోనే ఉంటుంది.

రేపు బీజేపీ తొలి జాబితా

● తెలంగాణలోని ఆరు స్థానాలకు పచ్చజెండా!
● సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లో సిట్టింగ్‌లకే చాన్స్
● బూర, కొండా, పోతుగంటిలకు లైన్ క్లియర్!

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా విడుదల కానుంది. కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదముద్ర పడడంతో మార్చి 3న తొలి జాబితాను బీజేపీ కేంద్ర కార్యాలయం అధికారికంగా విడుదల చేయనుంది. గురువారం రాత్రి 10.50 గంటలకు ప్రారంభమైన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం సుమారు నాలుగు గంటల పాటు జరిగింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్ర నాయకత్వాలు తయారు చేసిన అభ్యర్థుల జాబితాలపై ఆయా రాష్ట్రాల కోర్ కమిటీ సభ్యులతో విడివిడిగా భేటీ అయి కూలంకషంగా చర్చించింది. అందులో భాగంగా తెలంగాణకు సంబంధించి ఆరు స్థానాలకు అభ్యర్థులపై సీఈసీ ఏక గ్రీవంగా ఆమోదముద్ర వేసిందని సమాచారం. సిట్టింగ్ స్థానాల్లో సికింద్రాబాద్ నుంచి జి.కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్‌లు మరోసారి బరిలో దిగేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి పోతుగంటి భరత్‌ల అభ్యర్థిత్వాలపై కూడా సీఈసీ ఆమోదముద్ర వేసిందని సమాచారం.

ఆచితూచి నిర్ణయం

బీఆర్‌ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీలు బీజేపీలో చేరుతున్నందున వివిధ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోంది. మరో సిట్టింగ్ స్థానమైన ఆదిలాబాద్ నుంచి సోయం బాపూరావ్ అభ్యర్థిత్వాన్ని ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారని తెలిసింది. అయితే జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ శుక్రవారం ఢిల్లీలో కాషాయ కండువా కప్పుకోవడంతో.. ఆ స్థానంలో బీజేపీ ఎంపీగా ఆయనే బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఇక ఎక్కువ అభ్యర్థులు పోటీ పడుతున్న మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ సహా ఇతర స్థానాలపై మరోసారి చర్చించిన తర్వాతే బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కారు దిగనున్న మరో ఎంపీ!

ఖమ్మం నుంచి బరిలో దిగేందుకు మరో బీఆర్‌ఎస్ ఎంపీ కాషాయ కండువా కప్పుకొనే అవకాశం ఉందని, ఆయనతో పాటు మరో ఇద్దరు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు సైతం బీజేపీలో చేరేందుకు సిద్ధమౌతున్నారని సమాచారం.

ఆంధ్ర ప్రజలారా... షర్మిలను నమ్మొద్దు

● తెలంగాణలో పార్టీ పెట్టి మమ్మల్ని నట్టేట ముంచింది
● వైఎస్సార్‌టీపీ నేతల ఆవేదన

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తా, అందుకే ఇక్కడ పార్టీ పెడుతున్నా.. వైఎస్సార్ అభిమానులు, నాయకులు నా వెంట నడవండి'.. అంటూ మాటలు చెప్పిన షర్మిల చివరకు తమను నట్టేట ముంచిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. 'రెండు, మూడేళ్లు షర్మిల వెంట నడిచాం. లక్షల రూపాయలు ఖర్చు చేశాం. చివరికి ఎవరికీ చెప్పకుండా కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుని పార్టీని విలీనం చేసింది. మమ్మల్ని ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతీసింది. తెలంగాణ నుంచి పారిపోయి ఆంధ్రకు వచ్చి పీసీసీ పదవి దక్కించుకుంది'.. అని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్ర ప్రజలారా మీకు చేతులెత్తి దండం పెడతాం.. షర్మిలను నమ్మొద్దంటూ హెచ్చరించారు. షర్మిల చేతిలో ఆర్థికంగా నష్టపోయి, రాజకీయంగా భవిష్యత్ కోల్పోయిన వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకులు శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు మాట్లాడుతూ.. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టిన నాటి నుంచి తాను పనిచేస్తున్నానని.. కరోనా కష్ట సమయంలో ఖమ్మంలో సంకల్ప సభ నిర్వహించానన్నారు. సతీష్, కొండలరావు, సుబ్బారావు అనే ముగ్గురి కోటరీలోనే షర్మిల పాదయాత్ర చేపట్టారని, సతీష్ అనే వ్యక్తి ప్రతి జిల్లాలో నాయకుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారన్నారు. జిల్లా అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న తన వద్దే సతీష్ రూ.30లక్షలు వసూలు చేశారని.. ఇందుకు తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. షర్మిల కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆర్థికంగా, రాజకీయంగా తమ జీవితాలు నాశనం చేసిందని ఆరోపించారు. తెలంగాణలో పార్టీ పెట్టే రోజు ఆంధ్రలో రాజన్న రాజ్యం వచ్చింది. తెలంగాణలో కూడా రాజన్న రాజ్యం తేవాలని పార్టీ పెడుతున్నానని షర్మిల చెప్పిందని వైఎస్సార్‌టీపీ ఎస్టీ విభాగం నాయకులు బాణోతు రాజ్‌కుమార్ అన్నారు. ఏపీలో ఆమెను అడ్డుకుంటామని హెచ్చరించారు.

బీసీ హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించాలి

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

కాచిగూడ (హైదరాబాద్): బీసీ కాలేజ్ హాస్టళ్ల మెస్ బిల్లులు, అద్దెలు, కరెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, వేముల రామకృష్ణలతో కలసి ఆర్.కృష్ణయ్య శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 10 నెలలుగా బీసీ హాస్టళ్ల మెస్, అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రికి వివరించారు. దీంతో హాస్టళ్లను మూసివేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చేశారు. గతేడాది నుంచి కరెంట్ బిల్లులు చెల్లించకపోడంతో హాస్టళ్లకు కరెంట్ కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ నేతలు అనంతయ్య, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

లంచగొండుల్ని పట్టిస్తే రూ. లక్ష

● మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం: అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి కేఎల్లార్ ట్రస్టు తరఫున రూ.లక్ష బహుమానం అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఆయన తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తన అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, తదితర శాఖల్లో పనిచేస్తున్న కొందరు విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు, ప్రజలు, కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారని తెలిపారు. లంచం ఇవ్వనిదే ఏ పనీ చేయడం లేదని చెప్పారన్నారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోదని కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

నలుగురు ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నలుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ ప్రాంతం
డాక్టర్ పాటిల్ సంగ్రామ్ సింగ్ గనాపాత్రో	ఎస్పీ, మహబూబాబాద్	రిపోర్ట్ టు డీజీపీ ఆఫీస్
కేకన్ సుధీర్ రామ్‌నాథ్	డీసీపీ, మంచిర్యాల	ఎస్పీ, మహబూబాబాద్
అక్షాన్ష్ యాదవ్	ఏడీసీ టు గవర్నర్	డీసీపీ, సెంట్రల్ జోన్ హైదరాబాద్ సిటీ
అశోక్‌కుమార్	ఓఎస్డీ, జయశంకర్ భూపాలపల్లి	డీసీపీ, మంచిర్యాల

కంటోన్మెంట్‌లో స్కైవేలకు కేంద్రం ఓకే

● వర్కింగ్ పర్మిషన్ ఇస్తూ ఉత్తర్వులు
● త్వరలోనే కార్యరూపంలోకి..
● ప్యాట్నీ నుంచి హకీంపేట, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి రూట్లో తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు



స్కైవే నిర్మించనున్న రోడ్డు



సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో ప్రతిపాదిత స్కైవేలు కేంద్రం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. స్కైవేల నిర్మాణానికి అవసరమైన రక్షణ భూముల కేటాయింపునకు ఇటీవలే అంగీకారం తెలిపిన కేంద్రం, తాజాగా స్కైవేల నిర్మాణానికి పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ బోర్డు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్ట్రాటజిక్ రోడ్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌డీపీ) పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ పరిధిలో స్కైవేల నిర్మాణం చేపట్టనుంది. రాజీవ్ రహదారిపై ప్యాట్నీ చౌరస్తా నుంచి హకీంపేట వరకు సుమారు 14 కిలో మీటర్లు, నాగ్‌పూర్ హైవే మార్గంలో ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు సుమారు 6.5 కిలో మీటర్లు రెండు ఎలివేటెడ్ కారిడార్‌లుగా స్కైవేలు నిర్మించనున్నట్లు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలి ప్రతిపాదనలో ప్యారడైజ్ నుంచి సుచిత్ర సర్కిల్ వరకు స్కైవే నిర్మించాలని భావించినప్పటికీ, ఈ మార్గంలో సుచిత్ర నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం కొనసాగుతోంది. దీంతో ప్రతిపాదిత స్కైవేను బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు కుదించినట్లు తెలుస్తోంది.

బీఓఓ కమిటీ ఏర్పాటు

● రక్షణ భూముల బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా కేంద్రం భాగస్వామ్య పక్షాలతో బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్ (బీఓఓ) కమిటీ ఏర్పాటు చేసింది. హెచ్‌ఎండీఏ, డిఫెన్స్ ఎస్టేట్స్ కార్యాలయం, లోకల్ మిలటరీ అథారిటీ, కంటోన్మెంట్ బోర్డుల నుంచి ఒక్కో ప్రతినిధి చొప్పున నలుగురు సభ్యులు ఈ కమిటీలో ఉంటారు.
● ప్రతిపాదిత ఫ్లైఓవర్‌ల నిర్మాణం కోసం మొత్తం 150 ఎకరాల రక్షణ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనున్నారు. ఇందులో 90 ఎకరాలు ఆర్మీకి సంబంధించిన స్థలాలు కాగా, కంటోన్మెంట్ బోర్డు స్థలాలు 30 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ ఇతరత్రా మరో 30 ఎకరాలు ఉన్నాయి. ప్రైవేటు స్థలాలు వీటికి అదనం.
● ఈ మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్లను 60 మీటర్లకు విస్తరించనున్నారు. ఈ మేరకు రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవేలో పెద్ద సంఖ్యలో ప్రైవేటు భవనాలు కనుమరుగు కానున్నాయి.
● బేగంపేట ఎయిర్‌పోర్టు, హకీంపేట ఎయిర్‌పోర్టు వంటి ప్రాంతాలకు సమీపంలో ఫ్లైఓవర్‌లకు బదులుగా టన్నెల్ రూపంలో రోడ్ల నిర్మాణం చేపట్టే అవకాశముంది. దీనిపై త్వరలోనే హెచ్‌ఎండీఏ పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వనుంది.
● ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కంటోన్మెంట్ బోర్డు 30 ఎకరాలకు పైగా స్థలాన్ని కోల్పోతున్నందున, అందుకు గానూ సుమారు రూ.300 కోట్ల పరిహారం ఇవ్వాలని బోర్డు అధికారులు కోరారు. అయితే కంటోన్మెంట్, ఆర్మీ, డిఫెన్స్ ఎస్టేట్స్, ఎయిర్‌ఫోర్స్ వంటి విభాగాలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివే కాబట్టి, పరిహారం పూర్తిగా కేంద్రానికి చెందేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బోర్డుకు ఎలాంటి పరిహారం దక్కే అవకాశం లేకుండా పోయింది.
● తాజా భూకేటాయింపుల్లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు బాలంరాయి పంప్ హౌజ్, బేగంపేట ఎయిర్‌పోర్టు, హకీంపేటలో ఎయిర్‌లైన్స్ స్థలాలు, కొన్ని ఓల్డ్ గ్రాంట్ బంగళాలు తమ స్థలాలను కోల్పోనున్నాయి. ముఖ్యంగా ఎన్‌సీసీ, ప్రతిష్టాత్మక సికింద్రాబాద్ క్లబ్ భారీ మొత్తంలో స్థలాలను కోల్పోనున్నాయి.

'జెండా పాట'పై రైతుల మండిపాటు

మార్కెట్‌లో వ్యాపారులు ధర తగ్గించారని ఆగ్రహం



ఖమ్మం మార్కెట్ ముందు ధర్నా చేస్తున్న మిర్చి రైతులు


ఖమ్మం వ్యవసాయం/హైదరాబాద్: మిర్చి ధరలో వ్యాపారులు దగా చేస్తున్నారని ఆరోపిస్తూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. జెండా పాటలో క్వింటా మిర్చి ధర రూ.20,800గా నిర్ణయించారు. ఆతర్వాత కొనుగోళ్లు మాత్రం జెండాపాటతో పొంతన లేకుండా రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు తగ్గించి రూ.14 వేల నుంచి రూ.16 వేల చొప్పున చేపట్టడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. రైతులంతా ఒక్కసారిగా మార్కెట్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ అధికారులు, పోలీసులు నచ్చజెప్పినా రైతులు ఆందోళన విరమించకపోవడంతో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మార్కెట్‌కు వచ్చి రైతులతో చర్చించారు. న్యాయం చేస్తానని హామీ ఇవ్వగా రైతులు తిరిగి పంట వద్దకు చేరుకున్నారు. అక్కడ పంట నాణ్యతను పరిశీలించిన అదనపు కలెక్టర్ వ్యాపారులను పిలిపించి ధరలో వ్యత్యాసం ఉండకుండా కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. దీంతో వ్యాపారులు మరోమారు మిర్చి నాణ్యతను పరిశీలించి.. ముందు నిర్ణయించిన ధర కన్నా కొంతమేర పెంచడంతో సమస్య సద్దుమణిగింది.

రైతులు ఇబ్బంది పడరాదు: తుమ్మల

మార్కెట్‌లో రైతులు ఎక్కడా ఇబ్బంది పడరాదని, వారికి మార్కెట్‌లో అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ధర్నాపై మంత్రి ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు మార్కెట్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. రైతులు తెచ్చే పంటలకు సరైన గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

400 సీట్లతో బీజేపీదే అధికారం

● ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్



సభలో మాట్లాడుతున్న యూపీ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్

నల్లగొండ టూటౌన్: పేదల సంక్షేమం, దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు గెలిచి మూడోసారి మోదీ ప్రభుత్వం కేంద్రంలో కొలువుతీరబోతోందని ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ అన్నారు. శుక్రవారం రాత్రి నల్లగొండ పట్టణంలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పేదలను అభివృద్ధికి దూరం చేసిందని, గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం పలు కుంభకోణాలకు పాల్పడగా కేంద్ర మంత్రులు జైలుకు కూడా వెళ్లారని గుర్తుచేశారు. కుంభకోణాల కాంగ్రెస్ దేశమంతటా కనుగమరుగైందని, బీజేపీ ప్రభుత్వంతోనే భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. కరోనా సమయంలో ప్రజలకు ప్రధాని మోదీ అండగా ఉన్నారని, ఉచితంగా టీకాలను వేశారని చెప్పారు. దేశంలో పేద ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్నది మోదీ ప్రభుత్వమేనని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.

'ఫాసిస్టులను ఓడించేందుకే విప్లవ పార్టీల విలీనం'

ఖమ్మం మయూరి సెంటర్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలతో దేశం ప్రమాదకర స్థితిలో ఉందని, అందుకే ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు మూడు విప్లవ పార్టీలు విలీనమైనట్లు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పేర్కొంది. మూడు విప్లవ పార్టీలైన సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్) కలసి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఏర్పాటైంది. మూడు పార్టీల విలీనం సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంగా ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు యూనిటీ మహాసభ, ప్రతినిధుల సభలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, పీసీసీ సీపీఐ(ఎంఎల్) జాతీయ కార్యదర్శి సుభాష్ దేవ్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ...సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీ య పార్టీగా ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయబో తోందన్నారు. ఈనెల 3న ఖమ్మంలో 30 వేల మందితో ప్రదర్శన నిర్వహించడంతో పాటు పెవిలియన్ మైదానంలో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

భువనగిరి నుంచి నా కొడుకు సిద్ధం

● శాసనమండలి చైర్మన్ 'గుత్తా'

భువనగిరి రూరల్: అధిష్టానం ఆదేశిస్తే.. భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పోటీ చేస్తాడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామంలో శుక్రవారం పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. భువనగిరి ప్రాంత ప్రజలతో తనకు విడదీయలేని బంధం ఉందన్నారు. గతంలో మదర్ డెయిరీ చైర్మన్‌గా, ఎంపీగా ప్రజలకు సేవలు అందించానని చెప్పారు. అధిష్టానంతో ఎంపీ టికెట్‌పై చర్చించానని వెల్లడించారు. తన కుమారునికే టికెట్ వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మహత్యాయత్నం

● నిద్రమాత్రలు మింగిన ముగ్గురు ఉద్యోగులు
● ఏజెన్సీ వేధింపులతో మనస్తాపం

నల్లగొండ రూరల్ : నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ముగ్గురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. హైదరాబాద్‌కు చెందిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ జిల్లా ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ కాంట్రాక్ట్ తీసుకుంది. అయితే వారి నుంచి మరో ఏజెన్సీ సబ్ కాంట్రాక్టు తీసుకుని పనులు చేపడుతోంది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా శానిటేషన్ పనులు చేస్తున్న వల్కి లలిత, మారం నాగమణి, బోడ జానకిలను విధుల నుంచి తప్పించేందుకు వారికి రావాల్సిన పూర్తి వేతనాన్ని చెల్లించడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీన వేసే డ్యూటీ చార్ట్‌లో వారి పేర్లు లేవని సిబ్బంది చెప్పారు. దీంతో ఆందోళన చెందిన ఆ ముగ్గురు ఉద్యోగులు తోటి సిబ్బందితో కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ధర్నాకు దిగారు. ధర్నా చేస్తూనే ఆ ముగ్గురు ఉద్యోగులు నిద్రమాత్రలు వేసుకోగా..సిబ్బంది గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఏజెన్సీ నిర్వాహకుడు తమ వేతనాల్లో కోత విధిస్తున్నాడని ఇటీవల ఉద్యోగులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినందుకే తమను వేధిస్తున్నట్లు లలిత, నాగమణి, జానకి ఆరోపించారు. అయితే ఉద్యో గులను తొలగించే ఉద్దేశం తమకు లేదని, వార్డులు మాత్రమే మార్చామని ఏజెన్సీ నిర్వాహకుడు వివరణ ఇచ్చారు.

ఉత్తర తెలంగాణకు 'రవాణా' ఊరట



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ – కరీంనగర్ రాజీవ్ రహదారితో పాటు హైదరాబాద్– నాగపూర్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ అనుమతి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. జనవరి 5న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించాలని లేఖను అందించారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శుక్రవారం ఉదయం అనుమతులు జారీ చేసింది. హైదరాబాద్ నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన కారిడార్ల నిర్మాణానికి అనుమతించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈమేరకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

● హైదరాబాద్ నుంచి కరీంనగర్–రామగుండంను కలిపే రాజీవ్ రహదారిలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగు రోడ్డు జంక్షన్ వరకు ఆరులేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి మొత్తంగా 11.30 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల భూమి అవసరమని రక్షణ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్–44)పై కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ మొత్తంగా 18.30 కిలోమీటర్ల మేర ప్రతిపాదించామని, అందులో 12.68 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, నాలుగు ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలకు, భవిష్యత్తులో డబుల్ డెక్కర్(మెట్రో కోసం) కారిడార్, ఇతర నిర్మాణాలకు మొత్తంగా 56 ఎకరాల రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించి.. కేంద్రం ఇచ్చిన అనుమతులతో ఉత్తర తెలంగాణ దిశగా రవాణా మార్గాల అభివృద్ధికి మార్గం సుగమమైంది. అటు నిజామాబాద్, ఆదిలాబాద్, ఇటు కరీంనగర్ రామగుండం వెళ్లేందుకు సికింద్రాబాద్ ఏరియాలోని అత్యంత ఇబ్బందికరంగా మారిన ట్రాఫిక్ సమస్య తొలగిపోనుంది.

ముఖ్యమంత్రి రేవంత్ హర్షం: కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ సమస్యకు పరిష్కారం లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. కేవలం 80 రోజుల కొత్త ప్రభుత్వం ఈ అనుమతులు సాధించటం ద్వారా తమ చిత్తశుద్ధిని చాటిందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరినైనా ఎన్నిసార్లైనా కలిసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో సన్నిహిత, స్నేహ సంబంధాలను కొనసాగిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజకీయ వైషమ్యాలు, పార్టీల సిద్ధాంతాలేవైనా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర రక్షణ శాఖ సూచనల మేరకు త్వరలోనే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలు తలపెడుతామని అన్నారు.

లావొక్కింత మితిమీరె!

100 కోట్లు దాటిన స్థూలకాయులు ● వారిలో టీనేజీ దాటనివారే 16 కోట్లు



ప్రపంచం లావెక్కిపోతోంది. అన్ని దేశాల్లోనూ కలిపి స్థూలకాయుల సంఖ్య ఇప్పటికే అక్షరాలా 100 కోట్లు దాటేసింది! 1990 నుంచే వీరి సంఖ్యలో ఏకంగా నాలుగు రెట్ల పెరుగుదల నమోదైంది. మూడు దశాబ్దాల క్రితం దాకా పెద్దల్లోనే ఎక్కువగా కన్పించిన ఊబకాయ సమస్య ఇప్పుడు చిన్నారుల్లో కూడా పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఆధునిక జీవితపు ఒత్తిళ్లతో పాటు పౌష్టికాహార లోపం కూడా దీనికి ప్రధాన కారణమేనని తాజా అధ్యయనంలో తేలింది. మొత్తమ్మీద ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికే వయోజనుల్లో ఊబకాయుల సంఖ్య 88 కోట్లు దాటింది. అలాగే టీనేజీ లోపు వయసు వారిలోనూ 16 కోట్ల పై చిలుకు ఊబకాయంతో బాధపడుతున్నారు. టోంగా, నౌరు, సమోవా తదితర దేశాల్లో మూడొంతులకు పైగా జనం ఊబకాయులేనట! 1990 నుంచి 2022 మధ్య పలు గణాంకాలు తదితరాల ఆధారంగా అధ్యయనం సాగింది. ఈ జాబితాలో అమెరికా కూడా పురుషుల్లో పదో స్థానంలో, మహిళల్లో 36వ స్థానంలో నిలిచింది. ఈ దేశాల్లో అనారోగ్యకరమైన ఆహారపు టలవాట్లే సమస్యకు ప్రధాన కారణమని తేలినట్టు అధ్యయన బృంద సభ్యుడు ప్రొఫెసర్ మజీద్ ఎజాటి వెల్లడించారు. మరోవైపు తక్కువ బరువుతో బాధపడుతున్న వారి సంఖ్యలో 50 శాతం తగ్గదల నమోదైంది. కాకపోతే నిరుపేద దేశాలు, సమాజాల్లో ఇది ఇంకా ప్రబల సమస్యగానే ఉందని అధ్యయనం పేర్కొంది. భారత్‌లోనూ ఊబకాయుల సంఖ్య 8 కోట్లు దాటినట్టు వెల్లడించింది.

తక్షణం మేల్కొనాలి...

ఒకప్పుడు ప్రధానంగా పెద్దవాళ్లలోనే కన్పించిన స్థూలకాయ సమస్య ఇప్పుడు స్కూలు వయసు చిన్నారుల్లోనూ ప్రబలమవుతుండటం చాలా ఆందోళనకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ గేబ్రియేసస్ అన్నారు. చిన్న వయసులోనే గుర్తించి అరికట్టాల్సిన అవసరాన్ని తాజా సర్వే మరోసారి నొక్కిచెప్పిందని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా పెద్ద ఎత్తున ముందుకు రావాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకరమైన ఆహారం, నియమిత వ్యాయామాలు తదితరాలను జీవన శైలిలో భాగంగా మార్చుకోవడం తప్పనిసరన్నారు. పలు దేశాల్లో ప్రధానంగా పౌష్టికాహార లోపమే స్థూలకాయానికి దారి తీస్తోందని అధ్యయనంలో పాలుపంచుకున్న మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ గుహా ప్రదీప అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు, కొవిడ్ కల్లోలం, ఉక్రెయిన్ యుద్ధం వంటివన్నీ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయని వివరించారు. ''ఇవి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఖరీదైన వ్యవహారంగా మార్చేస్తున్నాయి. ఫలితంగా చాలా దేశాల్లో ప్రజలకు చాలీచాలని, నాసిరకం ఆహారం అందుతోంది'' అని ఆవేదన వెలిబుచ్చారు.

మహిళల్లో టాప్ 10 ఊబకాయ దేశాలు

దేశం	ఊబకాయుల శాతం
టోంగా	81
అమెరికన్ సమోవా	81
సమోవా	75
తొకలావ్	75
తువలు	73
కుక్ ఐలాండ్స్	73
నౌరు	73
న్యూయే	71
ఈజిప్ట్	59
మైక్రొనేసియా	57

పురుషుల్లో టాప్ 10 ఊబకాయ దేశాలు

దేశం	ఊబకాయుల శాతం
అమెరికన్ సమోవా	70
నౌరు	70
తొకలావ్	67
కుక్ ఐలాండ్స్	66
న్యూయే	64
టోంగా	63
తువలు	58
సమోవా	53
ఫ్రెంచ్ పాలినేసియా	47
అమెరికా	42

ఇలా చేశారు...

- అధ్యయనంలో 1,500 మందికి పైగా రీసెర్చర్లు పాలుపంచుకున్నారు.
- ఎన్‌సీడీ రిస్క్ ఫ్యాక్టర్ కొలాబరేషన్ పేరిట వీరంతా ప్రపంచ ఆరోగ్య సంస్థతో పని చేశారు.
- ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాల నుంచి ఐదేళ్ల పైబడ్డ 22 కోట్ల మందికి పైగా ప్రజల ఎత్తు, బరువు తదితర శారీరక కొలతలను సేకరించారు.
- ఊబకాయాన్ని నిర్ధారించేందుకు బాడీ మాస్ ఇండెక్స్‌ను ఆధారంగా తీసుకున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గణాంకాలివీ...

- ప్రపంచవ్యాప్తంగా వయోజనుల్లో 88 కోట్లు, టీనేజీ, ఆ లోపు వారిలో దాదాపు 16 కోట్ల మంది ఊబకాయులున్నారు.
- వయోజన ఊబకాయుల్లో 50 కోట్లకు పైగా పురుషులు కాగా 38 కోట్ల మంది స్త్రీలు.
- 1990లో వయోజనుల్లో ఊబకాయుల సంఖ్య 20 కోట్ల లోపే ఉండేది.
- వారిలో స్త్రీలు 13 కోట్లు కాగా 7 కోట్ల మందికి పైగా పురుషులుండేవారు.

భారత్‌లోనూ...

భారత్ కూడా ఊబకాయ సమస్యతో బాధపడుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య బాగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వయోజన మహిళల్లో ఊబకాయులు 1990లో కేవలం 1.2 శాతముండగా 2022 నాటికి ఏకంగా 9.8 శాతానికి పెరిగారు. పురుష జనాభాలో ఊబకాయుల సంఖ్య 0.5 శాతం నుంచి 5.4 శాతానికి పెరిగింది. మొత్తమ్మీద 2022 నాటికి దేశవ్యాప్తంగా 4.4 కోట్ల మహిళలు, 2.6 కోట్ల మంది పురుషులు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇక దేశవ్యాప్తంగా 5–19 ఏళ్ల మధ్య వయస్కున్న పిల్లల్లో దాదాపు 1.25 కోట్ల మంది ఊబకాయులేనని అధ్యయనంలో తేలింది. 75 లక్షలతో వీరిలో అబ్బాయిల సంఖ్యే ఎక్కువ.

మోదీతో దీదీ భేటీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలో భేటీ అయ్యారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యలను ప్రస్తావించినట్టు అనంతరం మీడియాకు చెప్పారు. రూ.1.18 లక్షల కోట్ల బకాయిలు రావాలంటూ మమత రెండు రోజుల పాటు ధర్నాకు దిగడం, అంతేగాక జాతీయ ఉపాధి హామీ కూలీలకు మమత సర్కారే చెల్లింపులు చేయడం తెలిసిందే.

కులం, మతం, భాష పేరుతో ఓట్లడగొద్దు

దేవుళ్లను అవమానించేలా మాట్లాడరాదు ● పార్టీలకు ఈసీ హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: కులం, మతం, భాష ప్రాతిపదికన ఓట్లు అడగవద్దని, ఇతర మతాల దేవుళ్లను, దేవతలను కించపరచరాదని పార్టీలకు, నేతలకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ శుక్రవారం అడ్వైజరీ విడుదల చేసింది. గతంలో నియమావళిని ఉల్లంఘించి నోటీసులందుకున్న స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు మరోసారి తప్పిదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవంది. ప్రచార సమయంలో మర్యాదలు, సంయమనం పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రత్యర్థులను కించపరిచడం, అవమానించడం, సదరు పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేయడం కూడదని పేర్కొంది. విద్వేషానికి వ్యాఖ్యలకు పార్టీలు దూరంగా ఉండాలని కోరింది. ''స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు నియమావళిని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉల్లంఘించరాదు. వీటిని నిశితంగా పరిశీలిస్తుంటాం. సమాజంలో వర్గ విభేదాలను, శత్రుత్వాన్ని పెంచే మాటలు, చర్యలకు దూరంగా ఉండాలి. ఓటర్లను తప్పుదోవ పట్టించే లక్ష్యంతో తప్పుడు ప్రకటనలు లేదా నిరాధార ఆరోపణలను ప్రచారం చేయవద్దు. వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలి. దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా లేదా మరే ఇతర ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదు'' అని స్పష్టం చేసింది. మహిళల గౌరవం, గౌరవానికి భంగం కలిగించే ఎటువంటి చర్యలు లేదా ప్రకటనలను నివారించాలని ఈసీ కోరింది. సోషల్ మీడియాలో సంయమనం పాటించాలని, ప్రత్యర్థుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పోస్ట్‌లను షేర్ చేయడం మానుకోవాలని పేర్కొంది.



శుక్రవారం లఖ్‌నవూలో ఎన్నికల కాఫీ టేబుల్ బుక్ విడుదల చేస్తున్న సీఈసీ రాజీవ్ కుమార్



ఆంక్షల మధ్య నవాల్నీ అంత్యక్రియలు

మాస్కో: రష్యా విపక్ష నేత అలెక్సీ నవాల్నీ అంత్యక్రియలు శుక్రవారం ఆంక్షల నడుమ ముగిశాయి. జైల్లో అనుమానాస్పద రీతిలో మరణించిన ఆయన మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించేందుకు పుతిన్ సర్కారు ఒక పట్టాన అంగీకరించని విషయం తెలిసిందే. అనంతరం సర్కారు భయంతో అంత్యక్రియ నిర్వహణకు చర్చిలు కూడా వెనకడుగు వేశాయి. ఎట్టకేలకు మాస్కోలోని ఓ చర్చి ఒప్పుకున్నా శ్మశానవాటికకు పార్థివదేహాన్ని తరలించేందుకు వాహనం దొరకడమూ గగనమే అయింది. మృతదేహాన్ని తరలించేందుకు ముందుకొచ్చిన వారికి బెదిరింపులు వచ్చినట్టు నావల్నీ అధికార ప్రతినిధి కీరా యార్మిష్ చెప్పారు. చివరకు మాస్కో పరిధిలోని మేరినో జిల్లా బోరిసోవస్కోయీ శ్మశానవాటికలో నవాల్నీ పార్థివ దేహాన్ని ఖననం చేశారు. జనం గుమికూడొద్దన్న ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరుచేస్తూ వేలాదిగా వేలాదిగా మద్దతుదారులు, ఉద్యమకారులు, అభిమానులు హాజరయ్యారు. మృతదేహాన్ని ఉంచిన మదర్ ఆఫ్ గాడ్ సూథీ మై సారోస్ చర్చిలో వేలాదిగా నివాళులర్పించారు. నవాల్నీ నవాల్నీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అమెరికా, ఫ్రాన్స్ రాయబారులు తదితరులు పుష్పగుచ్ఛాలుంచి అంజలి ఘటించారు. అంత్యక్రియల్లో ఆంక్షలు అతిక్రమించిన వారికి శిక్షలు తప్పవని ప్రభుత్వ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు.

'మోదీ గ్యారంటీల'తో గెలుస్తాం

ఎన్డీయేకు 400 సీట్లు తథ్యం

- నా జీవితంలో ప్రతిక్షణం ప్రజలకే అంకితం: మోదీ
- జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన



బర్వాడా/సింద్రీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 400కుపైగా సీట్లు సాధించడం తథ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మోదీ గ్యారంటీలే తమను గెలిపిస్తాయని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా తాను ఎక్కడికి వెళ్లినా 'మోదీ గ్యారంటీ' అనే నినాదం గట్టిగా వినిపిస్తోందని చెప్పారు. ప్రజల ఆశలు అంతమైన చోటునుంచే మోదీ గ్యారంటీ ప్రారంభమవుతుందని మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ జిల్లాలోని సింద్రీలో రూ.35,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అనంతరం 'విజయ్ సంకల్ప్ మహార్యాలీ'లో ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా కూడా ఒకటి అని గుర్తుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో 8.4 వృద్ధి రేటు నమోదైందని, ఇది చాలా ప్రోత్సాహకరంగా ఉందని వెల్లడించారు.

ప్రజల కలలే మా ప్రతిజ్ఞ

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. జార్ఖండ్‌లో అధికార జేఎంఎం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. రూ.350 కోట్ల నగదుతో జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ దొరికిపోవడాన్ని మోదీ ప్రస్తావించారు. అన్ని నోట్ల కట్టలు తన జీవితంలో ఏనాడూ చూడలేదని అన్నారు. ఆ సొమ్మంతా జార్ఖండ్ ప్రజలదేనని తేల్చిచెప్పారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాల్సిన డబ్బును కాంగ్రెస్ నేతలు లూటీ చేశారని ధ్వజమెత్తారు. వారు దోచుకున్న సొమ్మును తిరిగి వసూలు చేసి, ప్రజలకు అందజేస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని చెప్పారు. జార్ఖండ్ ప్రజలు కష్టపడి పనిచేస్తారని, వారి కష్టం వృథా కానివ్వబోమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఎంత బురద చల్లినా కమలం(బీజేపీ గుర్తు) ప్రతిచోటా వికసిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. 'ప్రజల కలలే మా ప్రతిజ్ఞ, వారి సంక్షేమమే మోదీ గ్యారంటీ' అని స్పష్టం చేశారు. తన జీవితంలో ప్రతిక్షణం ప్రజలకే అంకితం అని పేర్కొన్నారు. జనం బాగు కోసమే తాను పని చేస్తున్నానని వెల్లడించారు. దేశంలో గత పదేళ్లలో ఏకంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని హర్షం వ్యక్తం చేశారు. పేదరికాన్ని పూర్తిగా అంతం చేసే దిశగా ముందడుగు వేస్తున్నామని తెలిపారు.

సందేశ్‌ఖాలీపై నోరు విప్పరెందుకు?

ప్రధాని మోదీ శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. హుగ్లీ జిల్లాలోని ఆరామ్‌బాగ్‌లో రూ.7,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ పాలనలో అరాచక శక్తులు చెలరేగిపోతున్నాయని మోదీ మండిపడ్డారు. సందేశ్‌ఖాలీలో మహిళలు ఘోరమైన అకృత్యాలు జరిగాయని, దీనిపై ప్రతిపక్ష ఇండియా కూటమి ఎందుకు నోరువిప్పడం లేదని నిలదీశారు. సందేశ్‌ఖాలీలో మన అక్కచెల్లెమ్మలను తృణమూల్ కాంగ్రెస్ నేతలు వేధించారని, అత్యాచారాలు చేశారని, ఇది నిజంగా సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు. నిందితులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు.

బెంగళూరు కేఫ్‌లో బాంబు పేలుడు



పేలుడు తర్వాత భీతావహంగా మారిన ఘటనా స్థలి

10 మందికి గాయాలు

సాక్షి, బెంగళూరు: బాంబు పేలుడు ఘటనతో బెంగళూరు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరంలో నిత్యం రద్దీగా ఉండే వైట్‌ఫీల్డ్ పరిధిలోని బ్రూక్‌ఫీల్డ్ ప్రాంతంలోని రామేశ్వరం కేఫ్‌లో మధ్యాహ్నం వేళ ఈ బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కేఫ్ సిబ్బంది సహా 10 మంది గాయపడ్డారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించిందని తొలుత అందరూ భావించారు. 30 ఏళ్లలోపు వయసు వ్యక్తి ఒకరు ఆ కేఫ్‌లోని హ్యాండ్‌వాష్ వద్ద ఉన్న చెత్తబుట్టలో ఒక బ్యాగును పడేసి వెళ్లినట్లు అక్కడి సీసీటీవీ ఫుటేజీలో కనిపించింది. అత్యాధునిక పేలుడు పదార్థం(ఐఈడీ) వల్లే ఈ పేలుడు సంభవించిందని బాంబు నిర్వీర్య బలగాలు, ఫోరెన్సిక్స్ ల్యాబొరేటరీ, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందాలు ఒక ప్రాథమిక అంచనాకు వచ్చాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఆ వ్యక్తిని గుర్తించారు. టోకెన్ కౌంటర్ వద్ద రవ్వ ఇడ్లీ ఆర్డర్ చేసిన ఆ వ్యక్తి తర్వాత తినకుండా వెళ్లిపోయినట్లు సీసీటీవీలో రికార్డయింది. పోయేముందు ఒక బ్యాగును అక్కడి హ్యాండ్‌వాష్ దగ్గరి చెత్తబుట్టలో పడేసినట్లు కనిపిస్తోంది. ఒక గంట తర్వాత బాంబు పేలింది. ఐఈడీ బాంబును టైమర్ సాయంతో పేల్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఘటనాస్థలిని కర్ణాటక డీజీపీ సందర్శించారు. ' ఈ బాంబు పేలుడు ఘటనలో ఇప్పటికే లభించిన ఆధారాల సాయంతో దర్యాప్తు ముమ్మరం చేశాం' అని రాష్ట్ర డీజీపీ అలోక్ మోహన్ చెప్పారు. ''కేఫ్‌లో తినేందుకు అప్పుడే అక్కడికొచ్చాం. 40 మంది దాకా ఉన్నాం. ఒక్కసారిగా భారీ పేలుడు జరగడంతో ప్రాణభయంతో పరుగులు తీశాం'' అని ప్రత్యక్ష సాక్షులు ఎడిసన్, అమృత్ చెప్పారు. ఎన్ఐఏ బృందం ఘటనా స్థలిని సందర్శించింది. పేలుడు స్థలంలో బ్యాటరీ, వైర్లను గుర్తించారు. కేవలం పది సెకండ్ల వ్యవధిలో రెండు పేలుళ్లు సంభవించాయని కెఫే ఎండీ, సహ వ్యవస్థాపకురాలు దివ్య చెప్పారు.

దుండగులను వదలిపెట్టం

కేఫ్‌లో పేలుడుకు ఐఈడీ బాంబే కారణమని ఆ రాష్ట్రముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. ''నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెడతాం. ఈ ఘటన వెనుక ఉన్నది ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదు' అని శుక్రవారం మైసూరులో వ్యాఖ్యానించారు. '' ఘటనపై పోలీసు శాఖ దర్యాప్తు చేపట్టింది. సీసీకెమెరాల ద్వారా నిందితుల ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపట్టాం. ఇది ఉగ్రవాదుల పనిలా లేదు. పేలుడు ఘటన వెనుక ఉన్నవారిని కఠినంగా శిక్షిస్తాం' అని సీఎం అన్నారు.

ఢాకాలో ఘోర అగ్ని ప్రమాదం

షాపింగ్ మాల్‌లో మంటలు.. 46 మంది దుర్మరణం



ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో గురువారం రాత్రి ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఏడంతస్తుల షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగి 46 మంది సజీవ దహనమయ్యారు. 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి గ్యాస్ లీకేజీయే కారణమని భావిస్తున్నారు. బైలీ రోడ్డు ప్రాంతంలోని గ్రీన్ కోజీ కాటేజీలో పలు రెస్టారెంట్లు, వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఈ భవనం మొదటి అంతస్తులోని రెస్టారెంట్‌లో రాత్రి 9.50 గంటల ప్రాంతంలో చెలరేగిన మంటలు పై అంతస్తులకు శరవేగంగా వ్యాపించాయి. దీంతో అందులోని వారంతా ప్రాణభయంతో పై అంతస్తులకు చేరుకున్నారు. అగ్ని మాపక సిబ్బంది సుమారు 75 మందిని నిచ్చెనల సాయంతో కిందికి దించారు. మంటలను అర్ధరాత్రి 12.30 గంటలకు అదుపులోకి తీసుకురాగలిగారు. ఘటనపై ప్రధాని షేక్ హసీనా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రక్షణ ఉత్పత్తుల కొనుగోలుకు ఒప్పందాలు

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్లు, అత్యాధునిక రాడార్లు, ఆయుధ వ్యవస్థలు, మిగ్–29 జెట్ విమానాలకు ఏరో ఇంజిన్ల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం రూ.39,125 కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇందులో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)తో ఒకటి, బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్)తో రెండు, లార్సెన్ అండ్ టూబ్రోతో రెండు ఒప్పందాలు ఉన్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణశాఖ కార్యదర్శి గిరిధర్ అరమానె సమక్షంలో శుక్రవారం ఆయా సంస్థల ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. 'సైనిక బలగాల పోరాట సామర్థ్యాన్ని మరింత ఇనుమడింప జేసే ఈ ఒప్పందాలు దేశీయ సంస్థల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తాయి. భవిష్యత్తులో విదేశీ పరికరాల తయారీపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి'అని రక్షణశాఖ తెలిపింది. ఒప్పందంలో భాగంగా భారత్– రష్యాల జాయింట్ వెంచర్ బీఏపీఎల్ నుంచి 200 బ్రహ్మోస్ క్షిపణులను రక్షణశాఖ కొనుగోలు చేయనుంది.

తుండా విడుదలపై సుప్రీంకు సీబీఐ

న్యూఢిల్లీ: 1993 వరుస పేలుళ్ల కేసులో అబ్దుల్ కరీం తుండా(81)ను నిర్దోషిగా పేర్కొంటూ స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని సీబీఐ తెలిపింది. కోర్టు తీర్పును క్షుణ్నంగా పరిశీలించాక సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని పేర్కొంది.తుండాపై మోపిన అభియోగాలను రుజువు చేసేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ చూపలేకపోయిందని పేర్కొన్న అజ్మేర్‌లోని ప్రత్యేక టాడా కోర్టు అతడిని నిర్దోషిగా తేల్చింది. ఇదే కేసులో రైళ్లలో బాంబులను అమర్చినట్లు ఉన్న ఆరోపణలు రుజువు కావడంతో ఇర్ఫాన్, హమీదుద్దీన్ అనే వారికి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. బాబ్రీ మసీదు విధ్వంసానికి ఏడాదైన సందర్భంగా 1993 డిసెంబర్ 5, 6 తేదీల్లో లక్నో, కాన్పూర్, హైదరాబాద్, సూరత్, ముంబైల్లోని రైళ్లలో వరుసగా పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనల్లో ఇద్దరు చనిపోగా మరో 22 మంది గాయపడ్డారు.

స్టాలిన్‌కు చైనా భాషలో శుభాకాంక్షలు

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రాష్ట్ర బీజేపీ విభాగం శుక్రవారం చైనా భాషలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. 'బీజేపీ తమిళనాడు విభాగం గౌరవ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఆయనకు ఇష్టమైన భాషలో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతోంది'అని 'ఎక్స్'లో పేర్కొంది. అందులో ప్రధాని మోదీ, పార్టీ చీఫ్ నడ్డా, తమిళనాడు విభాగం అధ్యక్షుడు అన్నామలై చిత్రాలు, ఆపక్కనే స్టాలిన్ చిత్రం కింద చైనీస్ భాషలో ఒక సందేశం ఉంది. రాష్ట్రంలో ఇస్రో కాంప్లెక్స్ సముదాయం ప్రారంభం సందర్భంగా ఇటీవల డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలో చైనా జెండా కనిపించడం వివాదం రేపింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ ఈ మేరకు స్పందించడం విశేషం. అయితే, ఆ ప్రకటనలో పొరపాటున చైనా జెండా అచ్చయిందే తప్ప, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని ఆ ప్రకటన ఇచ్చిన మంత్రి రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల శకం: ముర్ము

బెర్హంపూర్: దేశాభివృద్ధిలో మహిళల శకం మొదలైందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. జాతి నిర్మాణంలో నేడు బాలికలు అన్ని రంగాల్లో కీలకంగా మారారని, ఈ పరిణామం ఎంతో ప్రోత్సాహకరమైందని పేర్కొన్నారు. గంజాం జిల్లాలోని బెర్హంపూర్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. సాహిత్యం, సంస్కృతి, సంగీతం వంటి రంగాల్లో మహిళ భాగస్వామ్యం ప్రశంసనీయమని తెలిపారు. 'సైన్స్, టెక్నాలజీ మొదలుకొని పోలీసు, ఆర్మీ వరకు ప్రతి రంగంలోనూ మన కుమార్తెల సామర్థ్యం కనిపిస్తోంది. ఇప్పుడు మనం మహిళాభివృద్ధి దశ నుంచి మహిళల సారథ్యంలో అభివృద్ధి వైపు పయనిస్తున్నాం'అని రాష్ట్రపతి తెలిపారు.

పంజాబ్‌లో ఆప్ కార్యకర్త కాల్చివేత

అమృత్‌సర్: పంజాబ్‌లో అధికార పార్టీ ఆప్‌నకు చెందిన ఓ కార్యకర్తను గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. తారన్‌తారన్ జిల్లాకు చెందిన గుర్‌ప్రీత్ సింగ్ అలియాస్ గోపీ చోహల్ కోర్టు కేసు విషయమై కపుర్తలా వైపు కారులో ఒక్కడే వెళ్తున్నాడు. కారును వెంబడిస్తున్న దుండగులు ఫతేబాద్, గోయింద్వాల్ సాహిబ్ మధ్యలోని రైల్వే క్రాసింగ్ వద్ద అతడిపైకి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి పరారయ్యాడు. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు గుర్‌ప్రీత్ సింగ్ అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

33% రాజ్యసభ సభ్యులపై క్రిమినల్ కేసులు

న్యూఢిల్లీ: రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245. వీరిలో 225 మంది సిట్టింగ్ ఎంపీలపై నమోదైన క్రిమినల్ కేసులు, వారి ఆస్తులను ఎన్నికల హక్కుల సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) విశ్లేషించింది. ఒక నివేదిక విడుదల చేసింది. 225 మంది రాజ్యసభ సభ్యుల్లో 33 శాతం మంది(75 మంది)పై క్రిమినల్ కేసులు ఉన్నట్లు గుర్తించింది. ఈ విషయాన్ని వారే స్వయంగా అఫిడవిట్లలో ప్రస్తావించారని వెల్లడించింది. 225 మంది సభ్యుల మొత్తం ఆస్తుల విలువ రూ.19,602 కోట్లు అని తేల్చింది. అలాగే వీరిలో 14 శాతం మంది.. అంటే 31 మంది బిలియనీర్లు ఉన్నారని తెలియజేసింది. 18 శాతం మంది(40 మంది) ఎంపీలపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరాల్లో కేసులు నమోదయ్యాయని పేర్కొంది.

పాక్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్‌గా సాదిక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ముస్లిం లీగ్(నవాజ్)(పీఎంఎల్–ఎన్), పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)మరికొన్ని పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ కూటమిలో పదవుల పంపిణీ కొలిక్కి వస్తోంది. నేషనల్ అసెంబ్లీ స్పీకర్ పదవికి శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో పీఎంఎల్–ఎన్ సీనియర్ నేత సర్దార్ అయాజ్ సాదిక్, డిప్యూటీ స్పీకర్‌గా పీపీపీ నేత గులాం ముస్తాఫాషా ఎన్నికయ్యారు. అయాజ్ సాదిక్‌కు 291 ఓట్లకు గాను 199 ఓట్లు రాగా, తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ బలపరిచిన అమిర్ డోగార్‌కు 91ఓట్లు దక్కాయి. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్‌లో చేరిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్–ఎన్ బలపరిచిన అభ్యర్థి ప్రధాని పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

మేం వినబోం.. హైకోర్టుకు చెప్పకోండి

ఆశారాం బాపు శిక్ష రద్దు పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: టీనేజీ అమ్మాయిలపై లైంగిక దాడులు, అత్యాచారం ఆరోపణల్లో దోషిగా తేలి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న వివాదాస్పద గురువు ఆశారాం బాపు తన శిక్షను రద్దుచేయాలంటూ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ విషయంలో తామేమీ వినదల్చుకోలేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ''ఏదైనా ఉపశమనం కావాలంటే రాజస్థాన్ హైకోర్టుకు వెళ్లండి'' అని స్పష్టం చేసింది. అయితే ఈ మేరకు ఆశారం గతంలో పెట్టుకున్న పిటిషన్లను రాజస్థాన్ హైకోర్టు నాలుగుసార్లు కొట్టేసిందని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆశారాం శిక్ష రద్దుచేసి మహారాష్ట్ర ఆస్పత్రిలో వైద్యానికి అవకాశం ఇవ్వాలని కోరారు. తామేమీ చేయలేవని, మళ్లీ హైకోర్టుకే వెళ్లాలని ధర్మాసనం స్పష్టం చేసింది. 2013 ఏడాదిలో తన ఆశ్రమంలో టీనేజీ అమ్మాయిని రేప్ చేశాడనే కేసులో అదే ఏడాది అరెస్టయి 2018లో పోక్సో కోర్టు యావజ్జీవ శిక్ష విధించిన నాటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

బిహార్‌లో ఆగని ఫిరాయింపుల పర్వం

పట్నా: బిహార్‌లోని మహాఘట్‌బంధన్ కూటమిలో ఫిరాయింపుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆర్‌జేడీకి చెందిన మరో ఎమ్మెల్యే భరత్ బింద్ అసెంబ్లీ సమావేశాల చివరి రోజైన శుక్రవారం ఎన్డీఏ పక్షంలోకి మారారు. కాంగ్రెస్‌కు చెందిన మహిళా ఎమ్మెల్యే నీతూ కుమారి పార్టీ లోక్‌సభ టిక్కెట్ ఇస్తే సరేసరి లేకుంటే బీజేపీలో చేరడం ఖాయమని ప్రకటించారు. ఇప్పటికే ఆర్‌జేడీకి చెందిన స్పీకర్ అవధ్ బిహారీ చౌధరిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా అదే పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటేయడం, నితీశ్ కుమార్ ప్రభుత్వానికి మద్దతు తెలపడం తెలిసిందే. తాజా పరిణామాలతో 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఎన్డీఏ బలం 135కు చేరుకుంది.

సాక్షి కరీంనగర్

శనివారం । 2 । మార్చి । 2024



క్వింటాల్ పత్తి రూ. 7,350

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తి ధర రూ. 7,350 పలికింది. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగూలోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

శ్రీవారికి పూలతోరణం



ధర్మపురి: శ్రీలక్ష్మీ నృసింహస్వామి అనుబంధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించారు.

గరిష్టం/కనిష్టం 36.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇల్లందకుంట చేరుకున్న 'బండి' యాత్ర



ఇల్లందకుంట: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చేపట్టిన మలిదశ ప్రజాహిత యాత్ర శుక్రవారం రాత్రి హుజూరాబాద్ నియోజకవర్గం ఇల్లందకుంట చేరుకుంది. మండలంలోని మల్యాల, సిరిసేడు, మర్రివానిపల్లి, సీతంపేట, బూజునూరు, వంతడ్పుల గ్రామాల మీదుగా కొనసాగిన యాత్రకు కార్యకర్తలు, ప్రజలు నిరాజనం పలికారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మల్యాలలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. సంజయ్ రాత్రి జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామంలో బస చేశారు. కాగా.. యాత్రను అడ్డుకుంటారనే సమాచారంతో పోలీసులు పెద్ద ఎత్తున్న బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, గౌతమ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బండి సంజయ్ కాదు... బోగస్ సంజయ్

- సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి



కరీంనగర్ కార్పొరేషన్: అనని మాటలు అన్నట్లు, లేని భక్తి ఉన్నట్లు చూపించి లబ్ధిపొందే బండి సంజయ్ తన పేరును బోగస్ సంజయ్‌గా మార్చుకోవాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. శుక్రవారం సిటీకాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అయోధ్యలో రాముడి పుట్టుక గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ అనని మాటలను అన్నట్లుగా చెప్పి, తల్లిని అవమానించేలా మాట్లాడిన సంజయ్ విధానాలను ప్రజలు గమనించాలన్నారు. పొన్నం ప్రభాకర్ ఎక్కడ అన్నాడో సంజయ్ నిరూపించాలని లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భక్తి పేరుతో రాజకీయ లబ్ధిపొందే ఎంపీ, నగరంలో జరిగిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. భూ కబ్జాల్లో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అరెస్ట్ అయి జైలుకు వెళ్తుంటే ఎందుకు నోరువిప్పడం లేదన్నారు. చీకటి ఒప్పందం కారణంగానే అరెస్ట్‌లపై స్పందించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే గంగుల కమాలకర్, ఎంపీ బండి సంజయ్ ఇద్దరు ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ నాయకులు సమద్‌నవాబ్, ఖమ్రొద్దీన్, మొహమ్మద్ అమీర్, ముక్క భాస్కర్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

న్యూరో డాక్టర్ల రాష్ట్రస్థాయి సదస్సు

- తొలిరోజు లైవ్ సర్జరీలు



కరీంనగర్‌టౌన్: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన న్యూరో డాక్టర్ల 8వ రాష్ట్రస్థాయి సదస్సును శుక్రవారం కరీంనగర్ రెనె ఆస్పత్రిలో ప్రారంభించారు. తొలిరోజు లైవ్ సర్జరీలు నిర్వహించారు. బ్రెయిన్ ట్యూమర్, అండర్ డిస్క్ సర్జరీలు లైవ్‌లో చూపించారు. చల్మెడ మెడికల్ కాలేజీలో మెదడు, వెన్నుముక, నరాల సమస్యలకు అధునాతన వైద్య పద్ధతుల గురించి వివరించారు. ఈనెల 2, 3వ తేదీల్లో నగరంలోని వీ కన్వెన్షన్‌లో సదస్సు నిర్వహిస్తారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎం.రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్ పర్సన్ పీవీకే కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

11న జేఎల్‌ఎం అభ్యర్థులకు స్తంభం పరీక్ష

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈనెల 11న ఉదయం 9 గంటల నుంచి ఆరో విడత జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం) పోస్టుల భర్తీ కోసం స్తంభం పరీక్ష, ధృవీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. అభ్యర్థులకు ఇప్పటికే రిజిస్టర్ పోస్టుద్వారా కాల్‌లెటర్లు పంపినట్లు తెలిపారు. ఏదైనా కారణంచేత కాల్‌లెటర్లు అందని వారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో పొందవచ్చునన్నారు. పారదర్శకంగా నిర్వహించే ఈపరీక్షకు అభ్యర్థులు ప్రలోభాలకు లోనై మోసపోవద్దని ఎస్ఈ సూచించారు.

ఆ పథకాలు ఉండేనా.. ఊడేనా..?

- దళితబంధు, గొర్రెల పంపిణీ అమలుపై గందరగోళం
- స్పష్టత లేకపోవడంతో అర్జీదారుల అయోమయం
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

సాక్షి ఫోకస్

కరీంనగర్:

'గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పథకాలపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దళితబంధు, గొర్రెల పంపిణీ, బీసీ కులవృత్తులకు చేయూత, గృహలక్ష్మి పథకాలకు ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి చెందడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సదరు పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దళితబంధు పథకంలో లబ్ధిపొందిన కొంత మందికి పూర్తిస్థాయిలో డబ్బులు అందకపోవడంతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే గొర్రెల పంపిణీకి లబ్ధిదారు వాటా కింద డీడీలు చెల్లించిన వారు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని కోరుతున్నారు. గృహలక్ష్మి పథకంతో ఓ ఇంటివారమవుతామని కలలు కన్నవారి ఆశలు అడియాశలయ్యాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. దళితబంధు, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, బీసీ చేయూత పథకాలు కొనసాగుతాయో లేదోననే సందిగ్ధంలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు.'

ఎన్నికల ముందే రెండోవిడత..

జిల్లాలో ఎన్నికలకు ముందే రెండో విడత దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రతీ నియోజకవర్గంలో 1,100 మందికి అవకాశం ఇచ్చారు. ప్రాధాన్యం కింద నియోజకవర్గానికి 500మంది చొప్పున ఎంపిక చేశారు. కొంతమంది పేర్లను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేశారు. మొదట రూ.3లక్షలు అందిస్తామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో తర్వాత చర్యలు చేపట్టలేదు. కలెక్టరేట్‌కు వచ్చి దళితబంధు మంజూరు చేయాలని కోరుతున్నారు. అధికారులు మాత్రం ఏమీ చెప్పలేని పరిస్థితి ఎదురుకావడంతో వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఈ పథకాలు కొనసాగే అవకాశం ఉంది.



గతనెల 26న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడానికి వచ్చిన దళితబంధు బాధితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గొర్రెల పంపిణీ పథకం

జిల్లాలో గొర్రెల పెంపకం అభివృద్ధి పథకాన్ని 2015లో ప్రారంభించారు. మొదటి విడత కింద ఎంపిక చేసినవారికి గొర్రెలు పంపిణీ చేశారు. జిల్లాలో రెండో విడత కింద 10,236 యూనిట్ల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 718 యూనిట్లను పంపిణీ చేశారు. మిగతావారికి 2018–19 ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేయాల్సి ఉన్నా వివిధ కారణాల వల్ల చేయలేదు. మిగిలిన 9,518 యూనిట్ల పంపిణీ ప్రారంభమైనట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో 2,686 మంది వాటాగా రూ.43,750 చెల్లించి గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూస్తున్నట్లు జిల్లా యాదవ కుర్మ సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. డీడీలు కట్టిన వారు నిత్యం పశుసంవర్ధక శాఖ అధికారుల చుట్టూ తిరిగివెళ్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో అధికారులు కూడా లబ్ధిదారులకు ఏమీ చెప్పలేని పరిస్థితి ఉంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల యూనిట్లపై సమీక్షిస్తే తప్ప స్పష్టత వచ్చే అవకాశం లేదు.

వెంటనే పంపిణీ చేయాలి



రెండో విడత గొర్రెల పంపిణీ కోసం గత ప్రభుత్వంలో డీడీలు కట్టి వేచి చూస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా గొర్రెల పంపిణీ మాత్రం చేయడం లేదు. లబ్ధిదారులు అందినచోటల్లా అప్పులు తెచ్చి మరీ డీడీలు కట్టారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల యూనిట్లను పంపిణీ చేసి ఆదుకోవాలి.

– బండి మల్లయ్యయాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ పరిధిలోని అంశం

దళితబంధు పథకం లబ్ధిదారుల అంశం ప్రభుత్వ పరిధిలోని వ్యవహారం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తాం. ప్రస్తుతానికి స్టేటస్‌కోలో దళితబంధు పథకం ఉంది. లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న డబ్బు విడుదలపై ప్రభుత్వ నిర్ణయమే శిరోధార్యం.

– నాగార్జున, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

శివారుకాలనీలు అభివృద్ధి చేస్తాం

- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని శివారుకాలనీల అభివృద్ధిపై తమ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. నగరంలోని 21వ డివిజన్‌లో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ జంగిలి సాగర్‌తో కలిసి మేయర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ తమ పాలకవర్గం వచ్చాక రూ.వందల కోట్ల వ్యయంతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. విలీన ప్రాంతాలైన రేకుర్తి, ఆరెపల్లి, సీతారాంపూర్, అలుగునూరు, సదాశివపల్లి, వల్లంపహాడ్, తీగలగుట్టపల్లి, పద్మనగర్ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. కానీ ఈ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని, వాటి అభివృద్ధి పనులకు డిమాండ్ ఏర్పడుతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో సీఎం హామీ నిధులు రూ.700 కోట్లు రావడంతో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రూ.200 కోట్లు స్పెషల్ గ్రాంట్ కింద కేటాయిస్తే శివారు ప్రాంతాలు మరింతగా అభివృద్ధికి నోచుకొంటాయని ఆయన అన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

సీజ్ చేసిన వాహనాలకు వేలం

- ఉమ్మడి జిల్లా రవాణా శాఖ డెప్యూటీ కమిషనర్ పురుషోత్తం

తిమ్మాపూర్(మానకొండూర్): సరైన ధ్రువపత్రాలు లేక పట్టుపడిన వాహనాలు రవాణా శాఖ కార్యాలయంలో కొన్నేళ్లుగా పేరుకుపోతున్నాయని, వాటికి త్వరలో వేలం వేస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీ పురుషోత్తం తెలిపారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. శుక్రవారం తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ ట్రాక్, కార్యాలయంలో పాడుబడిన వాహనాలను, ఫిట్నెస్ రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న సీజ్ చేసిన వాహనాల లిస్టు తయారుచేసి వారం రోజుల్లోగా అందజేయాలని ఏఎంవీఐ స్రవంతిని ఆదేశించారు. ఫిట్నెస్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భారీ వాహనాలకు, ఆటోలకు నాణ్యమైన రేడియం స్టిక్కర్లు ముందు, వెనకాల ఉండేలా చూసుకోవాలని సూచించారు. స్టిక్కర్ల వల్ల రాత్రి వేళ ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని వివరించారు. డ్రైవింగ్ ట్రాక్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. డ్రైవింగ్ ట్రాక్ విషయమై ఇటీవల మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి చర్చించామని, నిధులు సమకూర్చాలని కోరగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సమకూర్చేలా కృషి చేస్తానని తెలిపారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి రవాణా శాఖ మంత్రితో ప్రారంభించేలా చర్యలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, సిబ్బంది శ్రీనివాస్, రవూఫ్, గౌస్ పాష పాల్గొన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న డీటీసీ పురుషోత్తం

దరఖాస్తుల వెల్లువ

- బల్దియా దుకాణ సముదాయాలకు డిమాండ్

కరీంనగర్ కార్పొరేషన్ : నగరపాలకసంస్థ దుకాణ సముదాయాల కోసం వీధి వ్యాపారుల నుంచి డిమాండ్ అధికంగానే ఉంది. స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మించిన దుకాణ సముదాయాల్లో షట్టర్లను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు నగరపాలకసంస్థ టెండర్ నోటీసు ఇవ్వడం తెలిసిందే. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి గోడను ఆనుకొని నిర్మించిన సముదాయంలోని 126 షట్టర్లు, విద్యానగర్ శాతవాహన యూనివర్సిటీ వద్ద నిర్మించిన 25 షట్టర్ల కేటాయింపు కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. అర్హులైన దరఖాస్తు దారుల నుంచి ఈ నెల 5న కలెక్టరేట్ ఆడిటోరియంలో లాటరీ ద్వారా కేటాయిస్తారు.

ఇప్పటికే 876 దరఖాస్తులు

రెండుచోట్ల ఉన్న 151 షట్టర్ల కోసం శుక్రవారం నాటికి 876 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. ముందుగా వేలం ద్వారా షట్టర్ల కేటాయింపు చేపట్టాలని భావించినప్పటికీ.. పారదర్శకంగా నిర్వహించాలనే ఆలోచనతో లాటరీ విధానాన్ని అమలు చేస్తున్నారు. నగరపాలకసంస్థ నుంచి వీధి వ్యాపారులుగా గుర్తింపుకార్డు జారీ చేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల కోసం నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా రెండు చొప్పున నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వ్యాపారులు గుర్తింపు, ఆధార్ కార్డు చూపించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కాగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధి వ్యాపారులు అధికంగా వస్తుండడంతో దరఖాస్తులు తీసుకునే కార్యాలయం కిటకిటలాడుతోంది. ఉదయం నుంచే క్యూలైన్ కార్యాలయం వెలుపలి వరకు ఉంటోంది. ఒత్తిడి అధికంగా ఉండడంతో కౌంటర్లు పెంచే అవకాశాన్ని పరిశీలించాలని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు

ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వద్ద
126 షట్టర్లకు : 633

శాతవాహన యూనివర్సిటీ వద్ద
25 షట్టర్లకు : 243

చదువులో హీరోయిజం చూపించాలి

- పిల్లలు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: విద్యార్థులు చదువులో హీరోయిజం చూపించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జిల్లాకేంద్రంలోని ముకరంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల(పురాతన)లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్నేహిత కార్యక్రమంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. శారీరక, మానసిక ఇబ్బందులు ఎదురైతే నేరుగా 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందివ్వాలని సూచించారు. అక్కాచెల్లెలు, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. మొబైల్‌ఫోన్లు అతిగా వినియోగించవద్దని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. డీఈవో జనార్దన్‌రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృపారాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, హెచ్‌ఎం ఎస్‌కే చాంద్ పాల్గొన్నారు.

మ్యూజియం ఆధునికీకరించండి..

పాఠశాలలోని మ్యూజియం ఆధునికీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మ్యూజియం భవనాన్ని ఆమె పరిశీలించారు. పురాతనైన మ్యూజియం భవనాన్ని కాపాడుకోవాలని కోరారు. అంచనాలను రూపొందిస్తే నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.

ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక పూర్తిచేయండి

ప్రకృతి వైపరీత్యాలు, అనూహ్య ప్రమాదాల్లో బాధితులను కాపాడేందుకు ఉద్దేశించిన ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 300 మంది ఆపదమిత్ర వలంటీర్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు, గజఈతగాళ్లు, క్రీడాకారులు, గ్రామపంచాయతీ వర్కర్లు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ టీచర్లకు వలంటీర్ల ఎంపికలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. మిగతా వారిని డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీల నుంచి ఎంపిక చేయాలని సూచించారు. మార్చి మూడోతేదీలోగా జాబితా తయారుచేయాలని చెప్పారు. ఎంపికైన వారికి 12 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. డీఆర్డీవో పవన్‌కుమార్ వలంటీర్ల ఎంపిక, శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీవో శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ ఆఫీసర్ రాజు, ఎన్‌సీసీ 9వ బెటాలియన్ సుబేదార్ ద్రోవ్, కలెక్టరేట్ ఈ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం కోసం తయారు చేసిన కర్రీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ధరణి అర్జీలపై నజర్

- మండలానికి మూడు బృందాల ఏర్పాటు
- మొదలైన ప్రక్రియ.. 9లోగా పూర్తికి కసరత్తు
- స్లాట్ బుకింగ్ డబ్బులపై లేని స్పష్టత

కరీంనగర్ అర్బన్:


సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఏళ్లుగా ధరణి పెండింగ్ సమస్యలపై నిరీక్షిస్తున్న రైతన్నకు సాంత్వన కలిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 1 నుంచి 9వరకు పెండింగ్ అర్జీలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్న ఆదేశాల క్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇన్నాళ్లూ కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలో ధరణి అర్జీల పరిష్కారం ఉండగా ప్రభుత్వం అధికారాలను వికేంద్రీకరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించేందుకు మండలానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు. అర్జీలను సేకరించిన రెవెన్యూ యంత్రాంగం శుక్రవారం నుంచి ప్రక్రియలో నిమగ్నమైంది.

9వరకు ప్రత్యేక డ్రైవ్

జిల్లాలో కరీంనగర్ అర్బన్‌తో పాటు 16 మండలాలుండగా మండలానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 9వరకు ప్రత్యేక డ్రైవ్ పూర్తి చేయాల్సి ఉండగా అర్జీల క్రమంలో బృందాలను నియమించారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, గిర్దావర్లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేయగా మిగతా రెండు బృందాలు ఇలాగే ఉండనున్నాయి. ధరణి రాకతో చాలామంది రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ఏళ్ల తరబడి తిరుగుతున్న రైతులెందరో? కాగా కాంగ్రెస్ ప్రభుత్వ సమస్య పరిష్కారానికి నిర్ణయం తీసుకోవడంతో చాలామంది రైతులు తమ సమస్యకు విముక్తి కలుగుతుందని ఆశిస్తున్నారు. జిల్లాలో 10,580 అర్జీలు పెండింగ్‌లో ఉండగా కరీంనగర్ రూరల్‌లో అత్యధికంగా 1,439, గంగాధరలో 1,004, రామడుగులో 984, కొత్తపల్లిలో 936, అత్యల్పంగా కరీంనగర్ అర్బన్‌లో 10, ఇల్లందకుంటలో 168, గన్నేరువరం 312, సైదాపూర్‌లో 331 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ సదరు బృందాలు కేటాయించిన గ్రామాల్లో పరిష్కరించనుండగా ఆర్డీవో, కలెక్టర్ స్థాయి సమస్యలను ఆయా అధికారులకు నివేదించనున్నారు.

స్లాట్ బుకింగ్ డబ్బులపై లేని స్పష్టత

కాగా స్లాట్ బుకింగ్ చేసిన డబ్బులు చాలా మందికి వెనక్కి రాకపోగా వాటికోసం నిరీక్షిస్తున్నారు.



సదరు సమస్య గత నాలుగేళ్లుగా అన్నదాతలను వెంటాడుతుండగా కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పష్టత వస్తుందని ఆశించారు. ధరణి పెండింగ్ అర్జీలపై దృష్టిసారించిన ప్రభుత్వం స్లాట్ బుక్ అయి క్యాన్సల్ అయిన నగదును వెనక్కి ఇవ్వడంపై స్పష్టతనివ్వలేదు. వేల రూపాయలు చెల్లించిన అన్నదాతలు వాటి కోసం నిరీక్షిస్తూ..నే ఉన్నారు. త్వరలోనే స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ పరిధి వరకు

ధరణి అర్జీల పెండింగ్ సమస్యలను వివిధ వర్గాలుగా విభజించారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయి అంశాలుగా ఆయా సమస్యలను నిర్దేశించారు. సేత్వార్, కాస్రా, పహాణీ, ఇతర లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి క్షేత్రస్థాయి విచారణలు జోడించి తహసీల్దార్లు సమస్యలను పరిష్కరించనున్నారు. అసైన్డ్ భూములతో పాటు అన్నిరకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, పాసుపుస్తకాలు, జీపీఏ, ఎస్పీఏ, ఎగ్జిక్యూటెడ్ జీపీఏ, రెండు, మూడు ఖాతాలు నమోదై ఉంటే కలపడం, భూ సమస్యలకు సంబంధించిన వినతులను పరిష్కరిస్తారు. ఇక ఆర్డీవోలు పాసు పుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదు, భూ సేకరణ, ప్రవాసీయులకు చెందిన భూ సమస్యలు, సంస్థల పేరుతో పాసుపుస్తకాలు, కోర్టు కేసులు, సమాచారం, పాసు పుస్తకాల్లో తప్పుల నమోదు, మిస్సింగ్ సర్వే నంబర్లు, సబ్ డివిజన్ సర్వే నంబర్లు, విస్తీర్ణాల్లో హెచ్చు తగ్గులను పరిష్కరిస్తారు. కలెక్టర్ యాజమాన్య హక్కుల బదిలీ, అసైన్డ్‌భూములతో పాటు వారసత్వ బదిలీకి సంబంధించి పాస్‌పుస్తకాలు లేనివి, నిషేధిత భూములు, సెమీ అర్బన్ భూములు, కోర్టు కేసులు– పాసుపుస్తకాలు వంటి ఇతర సమస్యలను పరిష్కరించనున్నారు.

కరీంనగర్ జిల్లాలో..

పెండింగ్‌లో ఉన్న అర్జీలు	10,520
ఇందులో జీఎల్‌ఎం	1,866
మ్యుటేషన్	858
పీవోబీ	1,381
కోర్టు కేసులు	998
పీపీబీ కోర్టు కేసులు	223
జీపీఏ	04
నాలా వితౌట్ పీపీబీ	402
సక్సెషన్	916
పాస్‌బుక్ సమస్య	3,311
సెమీ అర్బన్ ల్యాండ్	110
ఖాతా మెర్జింగ్	292
ఓఆర్‌జీపీబీ	15
సర్వే నంబర్ డిలెషన్	08
ఎన్ఆర్ఐ	17
హౌజ్‌సైట్స్	112
ఇతరములు	07

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన పల్లికొండ నవీన్ (31) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఎంబీఏ చేసిన నవీన్ చదువు పూర్తి కాగానే గల్ఫ్ దేశం వెళ్లి వచ్చాడు. ఆరేళ్ల క్రితం వివాహం చేసుకుని స్వగ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. కాగా వివాహం జరిగి ఆరేళ్లు అవుతున్నా సంతానం కలగడం లేదని మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని బలవన్మరణం

సిరిసిల్లక్రైం: భార్యభర్తలకు జరిగిన గొడవలో అవమానం భరించలేక భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరిసిల్లలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల సుభాష్‌నగర్‌కు చెందిన నాగుల శ్రీకాంత్ (42) పవర్‌లూం బీముల కార్మికుడు. శుక్రవారం ఉదయం భార్యతో చిన్నపాటి గొడవ జరిగింది. ఇంటిలోకి వెళ్లిన శ్రీకాంత్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే కరెంట్ వైర్లు ఉన్న దానికి ఉరేసుకుని మృతి చెందడం అనుమానాస్పదంగా ఉందని స్థానికులు అనడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ఇంటర్‌లో ముగ్గురు డిబార్

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ముగ్గురు డిబార్ అయినట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా జనరల్ విభాగంలో 15,202 మందికి గాను 466 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా.. 14,736 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,660 మందికి గాను 520 మంది గైర్హాజరు కాగా.. 1,140 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగాలను కలుపుకొని జిల్లావ్యాప్తంగా 16,862 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 986 మంది గైర్హాజరయ్యారు. 15,876 మంది హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు.

కాపర్ వైరు చోరీ

ధర్మపురి: ట్రాన్స్‌ఫారాలను ధ్వంసం చేసి సుమారు రూ.40 వేల విలువ గల కాపర్‌వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. మండలంలోని నక్కలపేట, గాదెపెల్లి గ్రామాల్లో రైతులు పంట పొలాల్లో ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం రాత్రి దొంగలు వాటిని ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 49 మందికి జరిమానా

సిరిసిల్లక్రైం: జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 49 మందికి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి సృజన శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 33 మంది మందుబాబులు పట్టుబడ్డారని తెలిపారు. వీరందరినీ కోర్టులో ప్రవేశపెట్టగా 8 మందికి రూ.2వేల చొప్పున, 25 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారన్నారు. అలాగే కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిపై కేసు నమోదు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా 9 మందికి రూ.2వేలు చొప్పున, ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకునేలా

- ఐసీటీ అకాడమీ ద్వారా విద్యార్థినులకు పవర్ బీఐ, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ
- సవాళ్లను ఎదుర్కొనేలా ట్రైనింగ్
- 21 రోజుల శిక్షణకు 115 మంది ఎంపిక
- 'జ్యోతిష్మతి'లో కొనసాగుతున్న కార్యక్రమం


సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

తిమ్మాపూర్(మానకొండూర్): అవకాశాలు అన్నిరంగాల్లో అనేకం ఉంటాయి. వాటిని అందిపుచ్చుకోవడమే అసలు సవాల్. ఏటా లక్షల మంది ఇంజినీరింగ్ పూర్తిచేసి బయటకు వస్తున్నారు. కానీ వారిలో సరైన స్కిల్స్, నూతన సాంకేతికత లేకపోవడంతో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వంద మందిలో 30 శాతం మంది మాత్రమే మంచి కంపెనీల్లో కొలువులు సాధిస్తున్నారు. 20 శాతం చిన్న కంపెనీలతో సరిపెట్టుకుంటున్నారు. మిగతా 50 శాతం మంది ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

స్కిల్స్ పెంపొందించేలా..

విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్ పెంచేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) అకాడమీ ఆధ్వర్యంలో సెంటర్ ఎక్స్‌లెన్స్ స్థాపించారు. విద్యార్థినులకు దీని ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాఫ్ట్ స్కిల్స్ పెంచడమే లక్ష్యంగా ఇది పనిచేస్తోంది.

జ్యోతిష్మతిలో శిక్షణ..

ప్రస్తుతం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీటీ సెంటర్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందుకోసం జిల్లాలోని 115 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. పవర్ బీఐ 15 రోజులు, 6 రోజులు సాఫ్ట్ స్కిల్స్‌పై మైక్రోసాఫ్ట్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో 35 ప్రోగ్రామ్స్‌లో శిక్షణ ఇస్తుంది. విద్య, నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలకు అడ్డంకులు తొలగించేలా శిక్షణ కార్యక్రమాలు ఉంటున్నాయి.

సాఫ్ట్ స్కిల్స్‌పై 21 రోజులపాటు శిక్షణ అందించేలా ట్రైనింగ్ నిర్వహించారు. శిక్షణ అనంతరం ప్రపంచ స్థాయి మైక్రోసాఫ్ట్ శిక్షణ ధ్రువీకరణతో కూడిన ఉద్యోగ అవకాశాలను కూడా పొందవచ్చు. ఈమేరకు ట్రైనింగ్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు. కాగా సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా మహిళలు ఉద్యోగావకాశాలు పొందాలన్న ఉద్దేశంతో పే పాల్ కంపెనీ సహకారంతో ఐసీటీ ఆధ్వర్యంలో 115 మంది విద్యార్థినులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ అభిప్రాయాలు 'సాక్షి'తో పంచుకున్నారు.

కచ్చితంగా ఉద్యోగం సాధిస్తా



నిత్యం శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నా. శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్ష నిర్వహించి గ్లోబల్ సర్టిఫికేషన్ సైతం అందిస్తారు. దాంతో మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించవచ్చు. మంచి కంపెనీలో ఉద్యోగం సాధిస్తా.

– వాస్తవిక, సీఎస్ఈ, ఫైనల్ ఇయర్

ధైర్యం వచ్చింది



టెక్నికల్ స్కిల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తీసుకుంటున్న. గ్రూప్ డిస్కషన్ ఇంటర్వ్యూ శిక్షణ ఇచ్చారు. ఇంటర్వ్యూ ఫేస్ చేసే ధైర్యం వచ్చింది. ఉద్యోగాల్లో మహిళలు ముందుండాలనే ఉద్దేశంతో జ్యోతిష్మతిలో ట్రైనింగ్ ఇవ్వడం ఆనందంగా ఉంది.

– వైష్ణవి, సీఎస్ఈ (ఏఐఅండ్ఎంఎల్), ఫైనల్ ఇయర్

నైపుణ్యాలు అవసరం



విద్యార్థులకు మార్కులు, ర్యాంకులతోపాటు ఉద్యోగ సాధన నైపుణ్యాలు ముఖ్యం. మంచి ర్యాంకులు ఉన్నా ఇంటర్వ్యూలో చాలామంది ఉద్యోగం కోల్పోతున్నారు. టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్ ఉన్న విద్యార్థులే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు రావాలంటే సాఫ్ట్ స్కిల్స్ తప్పనిసరి.

– కుమార్, పల్లెపంగు జోయేల్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షకులు, హైదరాబాద్

ప్రతి మహిళ ఉద్యోగం చేయాలి



అబ్బాయిలతో పోటీగా ప్రతీ అమ్మాయి ఉద్యోగం చేయాలి. మహిళామణులు ఉద్యోగాల్లో కీలకంగా ఉండాలని ఉద్దేశంతో ఐసీటీ వారు జ్యోతిష్మతిలో 21 రోజుల పాటు మహిళా సాధికారత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థినులు మైక్రోసాఫ్ట్ శిక్షణ పొంది గ్లోబల్ సర్టిఫికెట్ అర్హత సాధించి మంచి కంపెనీలో ఉద్యోగంలో చేరుతారు.

– జువ్వాడి సాగర్ రావు, జ్యోతిష్మతి కళాశాల చైర్మన్

ఫెర్టిలిటీ డాక్టర్, సిబ్బందిపై కేసు

కరీంనగర్‌టౌన్: సంతానం కలగాలని నగరంలోని ఓ ఫెర్టిలిటీ కేంద్రానికి వచ్చిన మహిళ వద్ద డబ్బులు తీసుకొని ట్రీట్మెంట్ చేయకుండా అదనంగా డబ్బులు కావాలని బెదిరింపులకు గురి చేయడమే కాకుండా ఆసుపత్రిలో బంధించిన డాక్టర్, సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తిరుమణి నాగలక్ష్మి తనకు సంతానం కలగాలని నగరంలోని డాక్టర్ పద్మజ సంతన సాఫల్య కేంద్రాన్ని సంప్రదించారు. రూ.5లక్షలు తీసుకొని ఎలాంటి ట్రీట్మెంట్ చేయకుండా ఇంకా అదనంగా రూ.80వేలు కట్టమనగా.. నాగలక్ష్మి తన భర్త వీర వెంకటరావు ఇదివరకే చాలా డబ్బులు కట్టాం, ఇంకా ఎందుకు కట్టాలని ప్రశ్నించారు. వారిని దూషించి హాస్పిటల్‌లో బంధించారు. చంపుతామని బెదిరించారని ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరీంనగర్ టూటౌన్ ఇన్స్పెక్టర్ ఓ.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై..

సిరిసిల్లక్రైం: నకిలీ భూపత్రాలు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడుతున్న సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ అర్బన్ మండలం తెట్టెకుంట, చంద్రగిరి గ్రామపరిధిలోని సర్వే నం.6లోని 126 చదరపు గజాల స్థలానికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి, అసలు హక్కుదారుడైన కరీంనగర్‌కు చెందిన రేకల బెంజిమెన్‌ను బెదిరించి ఆక్రమించాలని చూశాడన్నారు. బాధితుడు శుక్రవారం వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సిరిగిరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హైకోర్టు ఏజీపీగా అరుణ్‌కుమార్


అరుణ్‌కుమార్

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, ప్రస్తుత జెడ్పీటీసీ మార్కొండ లక్ష్మీ కుమారుడు మార్కొండ అరుణ్‌కుమార్ హైకోర్టు ఏజీపీగా నియామకమయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అరుణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

అగ్ని ప్రమాదంలో భారీ నష్టం



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో మైసమ్మగడ్డ వద్ద సిద్ధార్థ ఏజెన్సీలో మంటలు చెలరేగి తీవ్ర నష్టం జరిగింది. పోలీసుల వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి బందారి రామన్న ఇటీవల ఏర్పాటు చేసుకున్న సిద్ధార్థ ఏజెన్సీలో గురువారం రాత్రి మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. శుక్రవారం ఉదయం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి 1.56 గంటలకు ఏజెన్సీకి నిప్పు పెట్టినట్లు రికార్డు అయ్యింది. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

గంజాయి పట్టివేత


నిందితులను అరెస్టు చేసిన సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్‌క్రైం: నగరంలోని భగత్‌నగర్‌లో శుక్రవారం ముగ్గురు యువకుల వద్ద గంజాయి పట్టుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. భగత్‌నగర్‌లో శాంతినగర్‌కు చెందిన శశికుమార్, పెగడపల్లికి చెందిన రామకృష్ణ, వరంగల్‌కు చెందిన జయంత్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారంతో దాడి చేసి వారి వద్ద 535గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ఎక్సైజ్ అర్బన్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో నాగేశ్వర్‌రావుతోపాటు హెడ్ కానిస్టేబుల్ మోసిన్, సిబ్బంది కుమార్‌యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమాలుద్దీన్ పాల్గొన్నారు.

చెరుకు పంట దగ్ధం


దగ్ధమవుతున్న చెరుకు పంట

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన చెరుకు పంట దగ్ధమైంది. గ్రామస్తుల వివరాలు.. గ్రామానికి చెందిన నల్ల విఠల్ మూడెకరాల్లో చెరుకు పంట సాగు చేశాడు. పంట చేతికి రావడంతో గురువారం రాత్రి చెరుకు కోత మిషన్ తెప్పించి మరుసటి రోజు కోసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కోత మిషన్ వచ్చిన రోజే చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా మంటలు ఆర్పేందుకు యత్నించారు. కానీ అప్పటికే సగానికి పైగా పంట కాలిబూడిదైంది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కుట్రతోనే చెరుకు పంటకు నిప్పంటించారని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశాడు.

ప్రైవేట్ బస్సు బోల్తా

- గుంటూరుపల్లి స్టేజీ వద్ద ప్రమాదం


బోల్తా పడ్డ ప్రైవేట్ బస్సు

కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారిలోని గుంటూరుపల్లి స్టేజీ ప్రమాదాలకు నిలయంగా మారింది. సాక్షి దినపత్రికలో రోడ్డు ప్రమాదాలపై వరుస కథనాలు ప్రచురించడం జరిగింది. ఈక్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. బ్లూకోర్ట్స్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ నుంచి శుక్రవారం రాత్రి ఓ ప్రైవేట్ బస్సు కూలీలతో కరీంనగర్‌కు వస్తోంది. ఈక్రమంలో తెల్లవారుజామున 5 గంటలకు గుంటూరుపల్లి స్టేజీ దాటిన అనంతరం అతివేగంగా వస్తున్న బస్సు అదుపుతప్పి నేరుగా డివైడర్ మీద నుంచి మూడు విద్యుత్ లైట్ల స్తంభాలను ఢీకొట్టి పెద్దపల్లి వైపు బోల్తా పడింది. స్థానికులు వెంటనే బస్సులో ఉన్న కూలీలను బయటకు తీసి రక్షించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 45 మంది వరకు కూలీలున్నట్లు తెలుస్తోంది. అనంతరం క్రేన్ ద్వారా బోల్తా పడిన బస్సును రోడ్డు మీద నుంచి తొలగించారు. ఈ ప్రమాదంలో కూలీలకు గాయాలు కాలేదని, ఎవరు ఫిర్యాదు చేయలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

కారును ఓవర్ టేక్ చేయబోయి..

- బస్సును ఢీకొని ఒకరు మృతి


గాయపడిన ఎల్లయ్య

జగిత్యాల: కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మల్యాల మండలం రాజారం గ్రామ శివారులో జరిగింది. గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య(36) శుక్రవారం జగిత్యాలకు వచ్చి, తిరిగి వెళ్తుండగా రాజారం శివారులో కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మల్యాల ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి ఘటనా స్థలానికి వెళ్లి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు


గాయపడ్డ కార్మికుడు వినయ్‌రెడ్డి

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధిలోని వకీల్‌పల్లి గనిలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు వినయ్‌రెడ్డి గాయపడ్డాడు. రాత్రి షిఫ్ట్‌లో భాగంగా 74 లెవల్ వద్ద విధులు నిర్వహిస్తుండగా సైడ్‌ఫాల్ అయి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యచికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన కొండపల్కల ఆశీష్‌కుమార్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదైంది. అశీష్‌కుమార్ గురువారం రాత్రి తన ఇంటి ముందు ఉండగా, అదే ప్రాంతానికి చెందిన అర్ముల్ల సాయితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ మన్మథరావు తెలిపారు.

ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేయండి


వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కరీంనగర్: ప్రభుత్వం మరోరెండు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను అమలు చేస్తోందని, లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీచేసిందని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి ఆమె డీజీపీ రవిగుప్త, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్హులందరికీ గ్యారంటీలు అందేలా ఎంపీడీవో, మున్సిపల్ వార్డు ఆఫీస్‌ల్లో ప్రజా పాలన సేవాకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నెంబర్ విద్యుత్ మీటర్ నంబర్ సమర్పించిన వారందరికీ పథకాలు అమలు అవుతాయని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చని శాంతికుమారి వివరించారు. ఇంటర్, పదో తరగతి కేంద్రాల లోపలికి ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి వీలులేదన్నారు. నిబంధనలను ఉల్లంఘించి లీకేజీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, బాధ్యులను విధుల నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఐఈవో జగన్మోహన్ రెడ్డి, డీఈసీ మెంబర్స్ కె.రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, జెడ్పీ సీఈవో ఎం.శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కొత్తపెల్లి, చొప్పదండి, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్లు రమేశ్ , నాగరాజు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, ఫోన్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సంపత్

కరీంనగర్: మత్తు పదార్థాలు, ఫోన్లకు పిల్లలు దూరంగా ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ అన్నారు. శుక్రవారం పద్మనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో స్నేహిత, మహిళా దినోత్సవ వారోత్సవాల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాలికలు యుక్త వయస్సులో వచ్చే మార్పులతో తెలిసి తెలియని ప్రేమకు ఎక్కువ ఆకర్షితులవుతున్నారని అన్నారు. సినిమాలు, సీరియళ్లలో ప్రేమ వరకే చూపిస్తారని, పెళ్లి తరువాత వచ్చే కష్టాలను చూపించరన్నారు. మాదకద్రవ్యాలు, స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సిగరెట్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్ పాస్‌వర్డ్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ద్వారా ఏవిధంగా మోసపోతున్నారో అవగాహన కల్పించారు. జీసీడీవో కృపరాణి, సీడీపీవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ అరుణ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్, షీ టీం పోలీస్ కానిస్టేబుల్ స్వప్న, సఖీ సంధ్య, ప్రిన్సిపాల్, టీచర్లు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: అక్రమ సంబంధం అనుమానంతో ఒకరిని హత్య చేసేందుకు ప్రయత్నించిన నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన పిట్టల సుదర్శన్ అతడి సంబంధీకుడైన పిట్టల రవి మధ్య ఓ అక్రమ సంబంధంపై అనుమానాలు మొదలైనాయి. ఈ విషయంపై పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో సుదర్శన్ జూన్ 4, 2020 రోజున రాత్రి 9.30 గంటల సమయంలో తన ఇంటి వెనుకకు బహిర్భూమికి వెళ్లగా, పిట్టల రవి ఇదే అదనుగా భావించి సుదర్శన్‌పై కత్తితో దాడి చేయగా పలు చోట్ల తీవ్ర గాయాలైనాయి. సుదర్శన్ అరుపులు విన్న అతడి భార్య బయటకు వెళ్లగా అమెను సైతం తోసేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న సుదర్శన్‌ను జగిత్యాల ఆసుపత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఈ ఘటనపై బాధితుడి భార్య లక్ష్మి మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడు రవిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు డి.శ్రీధర్, కెవి.సాగర్, కిరణ్‌కుమార్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడైన రవికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

బాలుడిని విక్రయించిన తల్లి?

- దత్తత ఇచ్చినట్లు పుకార్లు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన పదేళ్ల బాలుడిని విక్రయించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. సదరు మహిళకు కుమారుడు జన్మించిన తర్వాత మూడేళ్ల క్రితం భర్తతో వివాదాలు వచ్చి విడాకులు తీసుకుంది. దీంతో కొద్దిరోజులుగా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో కొడుకుతో కలిసి ఉంటోంది. నిత్యం తన కొడుకును కొట్టడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో స్థానికులు పలుమార్లు ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రెండురోజుల క్రితం గుట్టు చప్పుడు కాకుండా బాలుడిని రూ.2 లక్షల నగదు, 3 తులాల బంగారం తీసుకుని విక్రయించినట్లు సమాచారం. ఈక్రమంలో సదరు మహిళను గురువారం స్థానికులు నిలదీయగా, పక్క గ్రామానికి చెందినవారికి దత్తత ఇచ్చానని చెప్పినట్లు తెలిసింది. కాగా మహిళ చెప్పిన మాటలు పొంతనలేకుండా ఉండటంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ద్వారా దత్తత ఇచ్చానని సదరు మహిళ చెప్పిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అలుగునూర్ చౌరస్తా సమీపంలో రాజీవ్ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు రహదారి మధ్యలోని మొక్కలకు నీరు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ కారు బలంగా ఢీకొట్టింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండలంలోని మహాత్మానగర్‌కు చెందిన అనుమాండ్ల రాజేందర్ కారులో శుక్రవారం ఉదయం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రాజేందర్ స్వల్ప గాయాలతో బయటపడినా కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. రాజీవ్ రహదారిపై పనిచేసే కార్మికులు జాగ్రత్తగా ఉండాలని కొద్దిదూరం ముందే సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని వాహన దారులు అంటున్నారు. విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై చేరాలు తెలిపారు.

దంపతులకు రిమాండు

గంగాధర(చొప్పదండి): వ్యాపారి వద్ద నుంచి రూ.56 లక్షలు అప్పుగా తీసుకొని, హామీగా మూడెకరాల ముప్పైతొమ్మిదిన్నర గుంటల భూమిని మార్టిగేజ్ చేయించి, వ్యాపారికి తెలియకుండా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఇతరులకు అమ్మి మోసానికి పాల్పడిన భార్యభర్తలను అరెస్ట్ చేసి రిమాండుకు పంపించినట్లు గంగాధర ఎస్ఐ అభిలాశ్ తెలిపారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన మాల కనకయ్య కరీంనగర్‌లోని గాంధీనగర్‌కి చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి నుంచి 2016లో రూ.ముప్పైలక్షలు, 2017లో రూ.ఇరవై ఆరు లక్షలు అప్పుగా తీసుకొని హామీగా భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేయడమేగాక రెండు బ్యాంకు చెక్కులను ఇచ్చారు. మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలోవాస్తవమని తేలడంతో కనకయ్య,మంజులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. కేసును పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితులిద్దరికి 14 రోజుల రిమాండ్ విధించగా జైలుకు తరలించారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పపెట్టిన వ్యక్తి అరెస్ట్


బద్దెనపల్లిలో కాలిపోయిన ద్విచక్రవాహనాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లిలో మూడు ద్విచక్ర వాహనాలు దహనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయికృష్ణ శుక్రవారం తెల్లవారుజామున గుగ్గిళ్ల అంజయ్య ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన మూడు బైకులకు నిప్పుపెట్టాడు. తగులబెట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో నిందితుడిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయికృష్ణను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

క్లుప్తంగా

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాంపూర్ జిల్లా సిలైబర్ గ్రామంలో సుమేశ్(17) అనే దళిత యువకుడు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటంతో ఉన్న బోర్డును పార్కులో ఏర్పాటు చేసినందుకు పోలీసులు అతడిని అన్యాయంగా కాల్చి చంపారని పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య అన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాసిన లేఖను శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రంగారెడ్డి

కరీంనగర్: జిల్లాకేంద్రంలోని కిసాన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994, రూల్స్ 1996పై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ రంగారెడ్డి అవగాహన కల్పించారు. ఆడ, మగ పిల్లలందరూ సమానమేనని అన్నారు. కొంతమంది వివక్ష చూపించి గర్భస్థ దశలోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి పరీక్షలు ప్రోత్సహించినవారికి, పరీక్షలు చేయించుకున్నవారికి, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి కఠిన శిక్ష తప్పదన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్ పాల్గొన్నారు.

దోమల బెడదను నియంత్రించండి

కరీంనగర్: దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నగరంలోని అన్ని వాడల్లో ఫాగింగ్ చేసి ప్రజలను రక్షించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు కార్పొరేషన్ అధికారులను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలోని అన్ని వాడల్లో దోమల నియంత్రణ మందు స్ప్రే చేయకపోవడంతో ప్రజలు దోమల బెడదతో నరకం చూస్తున్నారని, సాయంత్రం అయిందంటే దోమలు ఎక్కువై ఇళ్లలోకి వస్తున్నాయని వాపోయారు. కార్పొరేషన్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేయాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయడంతోపాటు అన్ని వాడల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని అన్నారు. కొన్ని వాడల్లో పరిసరాలు బాగా లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఖాళీగా ఉన్న ఇంటి స్థలాల్లో మురుగునీరు నిలిచి దోమల పునరావాస కేంద్రంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. జ్వరం, డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా ప్రబలుతున్నాయన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విజయ

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని జ్యోతినగర్‌లో మోర్ సూపర్‌మార్కెట్ వద్ద చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని 58వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి విజయ కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నాలుగు నెలల క్రితం సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారని చెప్పారు. ఇప్పటివరకు ఆ పనులు కావడం లేదన్నారు. డ్రైనేజీల కోసం ఇళ్ల ముందు ఉన్న ర్యాంప్‌లు, మెట్లు తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాహుల్

కరీంనగర్‌కార్పొరేషన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు పార్లమెంట్ పరిధిలోని గ్రామ, మండల అధ్యక్షుల నియామకం రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే బూత్ జోడో ద్వారా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం వెంటనే ఇంటింటి ప్రచారం ప్రారంభించాలన్నారు. యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులి కృష్ణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ విద్యానగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం మేళతాళాలు, ముత్యాల తలంబ్రాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఘనంగా జరిగింది. అంతకుముందు ఆలయ ప్రధానార్చకుడు వానమామలై పవన కుమారాచార్యుల ఆధ్వర్యంలో నిత్య హోమం అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి రథంపై ఆలయ సమీప వీధుల్లో విహరించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్రెడ్డి, కోశాధికారి దూలూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మడతల మీరయ్య తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం, చక్రస్నానం, సాయంత్రం గరుడసేవ, శ్రీపుష్పయాగం జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

కేంద్ర బలగాల కవాతు



కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో శుక్రవారం కేంద్ర రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్) బలగాలు, స్థానిక పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీం పోలీసులు కవాతు నిర్వహించారు. గీతాభవన్ నుంచి గోదాంగడ్డ, కాశ్మీర్‌గడ్డ రైతుబజార్ వరకు, తరువాత కిసాన్‌నగర్, హుస్సేనిపుర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ బిస్వ రంజన్ సాహు, అడిషనల్ డీసీపీ సి.రాజు, ఏసీపీ నరేందర్, ఇన్‌స్పెక్టర్లు రవీంద్రరోషన్(ఆర్‌ఏఎఫ్), లలితగోప్ నారాయణ్(ఆర్‌ఏఫ్), వెంకటేశ్, శ్రీనివాస్, సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి బోండానికి భలే గిరాకీ..





ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి బోండం ఆరోగ్యానికి వరం లాంటిది. ఎన్నో పోషక విలువలతోపాటు శరీరానికి తక్షణ శక్తిని ప్రసాదించే గుణాలుండడంతో.. సీజన్‌లకతీతంగా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేకంగా వేసవిలో గొంతు తడుపుకునేందుకు కూల్‌డ్రింక్‌లు, జ్యూస్‌లు, కాలుష్య కారకాల పానీయాలకు కొబ్బరి బోండం మంచి ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. కేరళ రాష్ట్రంలో కల్పవృక్షంగా పిలువబడే కొబ్బరి చెట్టుకు ఎంతో విశిష్టత ఉందనే చెప్పొచ్చు. సాధారణంగా మిగతా సీజన్లలో వీటి విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నా.. వేసవి కాలంలో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి మరీ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

- జోరుగా సాగుతున్న విక్రయాలు
- రోజుకు రూ.10లక్షలకు పైగా టర్నోవర్

కరీంనగర్: సీజన్ ఏదైనా కొబ్బరి బోండాల గిరాకీ తగ్గడం లేదు. ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న రోగులకు తక్షణ శక్తినిచ్చే ఆహారంగా కొబ్బరి నీళ్లను వైద్యులు సూచిస్తుండడంతో.. బోండాలకు ఏడాదంతా గిరాకీ ఉంటుంది. తాజాగా నగరంలో వీటి దిగుమతి కూడా పెరిగింది. ప్రస్తుతం నగరానికి రోజుకు కనీసం పది లోడ్ల బోండాలు దిగుమతి అవుతున్నాయి. ఒక్కో లోడులో 7వేల బోండాలుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. రోజుకు 70వేల బోండాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 నుంచి 120 విక్రయ కేంద్రాల ద్వారా అమ్ముడవుతున్నాయి. ప్రతి బోండం సగటున రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. రోజుకు రూ.10లక్షల టర్నోవర్ జరుగుతోందని తెలుస్తోంది.

బాటిల్‌లోనూ..

నగరంలోని పలు ప్రాంతాల్లో కొబ్బరి నీళ్లను ప్లాస్టిక్ బాటిళ్లలో కూడా విక్రయిస్తున్నారు. స్థానిక మార్కెట్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, అటవీ శాఖ కార్యాలయ సమీపంలోని బోండాల వ్యాపారులు బాటిళ్లలో కొబ్బరి నీళ్లు నింపి విక్రయిస్తున్నారు. ఒక బాటిల్‌కు వేసవి సీజన్‌లో రూ.60 నుంచి రూ.100 వరకు తీసుకుంటున్నారు. ఆస్పత్రుల్లో తమ బంధువులను పరామర్శించేందుకు వెళ్లేవారు ఈ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. పార్సిల్‌గా తీసుకెళ్లేందుకు కూడా సౌకర్యంగా ఉండడంతో.. సాధారణ ప్రజలు సైతం ఈ కొబ్బరి నీళ్ల సీసాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. నగరంలోని బస్టాండ్, అటవీ శాఖ కార్యాలయ పరిసరాలు, డాక్టర్స్ స్ట్రీట్, మార్కెట్ రోడ్డు, కోర్టు, మంచిర్యాల చౌరస్తా, ప్రాంతీయ ప్రధానాసుపత్రి పరిసరాలు, సెవెన్ హిల్స్‌తోపాటు జనం ఉండే ఇతర ప్రాంతాల్లో విక్రయాలు జరుగుతున్నాయి. చిన్న సైజు బోండం రూ.20 నుంచి రూ.30 వరకు, పెద్దవి రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు.



కొబ్బరి నీళ్లు చేసే మేలు

- శరీరంలో రోగ నిరోధకశక్తి పెంచుతాయి.
- మధుమేహ రోగుల్లో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతాయి.
- కొలెస్ట్రాల్ ఉండదు కాబట్టి శరీర బరువు తగ్గేందుకు దోహదపడతాయి.
- ఎండల్లో తిరిగేటపుడు చెమట రూపంలో లవణాలు నష్టపోయిన కారణంగా ఏర్పడే నిర్జలీకరణ స్థితి నుంచి రక్షిస్తాయి.
- శరీరాన్ని చల్లబరుస్తూ ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించి నియంత్రిస్తాయి.
- శరీరంలోని లవణాల శాతాన్ని పెంచుతాయి.
- రక్తపోటు, గుండె పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తాయి.
- మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నిరోధిస్తాయి. మూత్రకోశ సంబంధ వ్యాధుల నివారణలో దోహదం చేస్తాయి.

బోండంలో లభించే పోషకాలు

నీరు: 95.5
నత్రజని: 0.05
ఫాస్పారిక్ ఆమ్లం: 0.56
పొటాషియం: 0.25
కాల్షియం ఆక్సైడ్: 0.69
మెగ్నీషియం ఆక్సైడ్: 0.59
ఇనుము: 0.5 గ్రాములు/100గ్రాములకు
యాష్: 0.62గ్రాములు
టోటల్ సాలిడ్స్: 4.71గ్రాములు

ఇదే మంచి డ్రింక్

కూల్‌డ్రింక్స్, ఇతర పానీయాల కంటే కొబ్బరి బోండం శ్రేష్టమైనది. దాహం తీర్చడమే గాక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తది కాబట్టే ప్రతిరోజు కచ్చితంగా కొబ్బరి బోండం తాగడం అలవాటు చేసుకున్నా. వాస్తవంగా ఇదే మంచి డ్రింక్.
– పావని, అంబేద్కర్‌నగర్

40 ఏళ్లుగా వ్యాపారం



40 ఏళ్లుగా కొబ్బరి బోండాల వ్యాపారం చేస్తున్నా. ఏడాదంతా ఇక్కడే అమ్ముతుంటా. ఎండాకాలంలో వ్యాపారం మంచిగుంటది. ఆసుపత్రులకు వచ్చేటోళ్లు ఎక్కువ కొంటరు. ఎప్పుడు అచ్చేటోళ్లే వస్తుంటరు. కొబ్బరి బోండం ఆరోగ్యానికి మంచిది. ప్రస్తుతం వ్యాపారం మంచిగానే ఉంది. కేరళ, బెంగళూరు, కోనసీమ జిల్లాలు, తమిళనాడు నుంచి జిల్లాకు కొబ్బరి బోండాలు దిగుమతి అవుతాయి.
– కనకరాజు, కొబ్బరి బోండాల హోల్‌సెల్ డీలర్, కరీంనగర్

ఒక నిమిషం ఆలస్యం నిబంధన సడలించాలి

విద్యానగర్(కరీంనగర్)/కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో 3 రోజుల నుంచి జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో ఒక నిమిషం ఆలస్యం నిబంధన ఈ మూడు రోజుల్లో 24 మంది విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సుజాతరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోరి తెచ్చుకున్న రాష్ట్రంలో పరీక్షలకు ఒక నిమిషం ఆలస్యంగా వస్తే అనుమతించబోమన్న పద్ధతి అమాయక విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. ఒక నిమిషం ఆలస్యమయితే జరిగే నష్టం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు కార్యాలయాలకు గంటల తరబడి ఆలస్యంగా వచ్చినా పట్టించుకోని ప్రభుత్వం.. విద్యార్థుల విషయంలో ఒక నిమిషాన్ని కూడా పరిగణలోకి తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పరీక్ష హాల్‌లో సరైన సమయంలో ప్రశ్నాపత్రం ఇవ్వడం లేదన్న విషయం ప్రభుత్వ పెద్దలు గమనించాలని అన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి రావాలనుకున్న సమయంలో ట్రాఫిక్ సమస్యలుత్పన్నమయినప్పుడు వారిని జవాబుదారులను చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికయినా 5 నిమిషాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

కరీంనగర్: 4నెలలుగా ఉపాధిహామీ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సిబ్బందికి 4నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమయ్యిందని, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కల్పించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని సజావుగా నడిపించడంలో, ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉపాధిహామీ సిబ్బంది పని చేస్తూ పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు.

అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గానికి సన్మానం

కరీంనగర్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్(ఏఏసీఐ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137(ఏ) 2024–25 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా చెర్మాల వెంకటేశ్వర్లు(అచీవర్స్ స్కూల్స్ అధినేత), మొదటి జిల్లా ఉప గవర్నర్‌గా చీకోటి శ్రీనివాస్ గాంధీ, రెండో జిల్లా ఉప గవర్నర్‌గా కొంజర్ల మహేశ్, జిల్లా క్యాబినెట్ సెక్రటరీగా వీఎంఎస్ఎం ప్రసాద్, జిల్లా ట్రెజరీగా సాగర్‌రెడ్డి, జిల్లా క్యాబినెట్ పీఆర్‌వోగా సోమారపు వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు ఎన్నికల చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్(వాసుదేవ హాస్పిటల్ అధినేత) ప్రకటించారు. ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, అవుట్ గోయింగ్ గవర్నర్ గాలిపల్లి నాగేశ్వర్, సిద్దుల బాలకృష్ణ, సిరిపురం సత్యనారాయణ, పుల్లెల శ్యామ్, భూపతి వరుణ్, పండుగ నాగరాజు, మొగులోజు సత్యచారి అభినందనలు తెలిపారు.

4న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న కరీంనగర్ కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ బాలుర జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి ఈనెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 9441925807 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు శ్రీపాద స్మారక పురస్కారాల ప్రదానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం జయంతి వేడుకల్లో భాగంగా కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, మానేరు విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీపాద స్మారక పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.కృపాదానం తెలిపారు. సాహిత్య విభాగంలో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, యోగాచార్య సంపత్‌కుమార్, కళారంగంలో మంచాల రమేశ్, గొల్లపల్లి రవీందర్, ఎండీ ఇస్మాయిల్, దయానంద్ గాంధీ, రతనకుమార్‌కు పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్య కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న హన్మంతరావు

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఇక్రిసాట్ రిటైర్డు ప్రొఫెసర్, సైంటిస్ట్ కోరుకంటి హన్మంతరావు అన్నారు. శుక్రవారం దుర్శేడ్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు కోరుకంటి సుశీల–రాంగోపాల్‌రావు జ్ఞాపకార్థం గత సంవత్సరం 6వతరగతి నుంచి 10వతరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆయన రూ.10వేల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, వార్డు సభ్యులు అశోక్, నర్సింగరావు, ప్రధానోపాధ్యాయుడు పరబ్రహ్మమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన టూటౌన్ సీఐ



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టూటౌన్ సీఐగా ఒ.రమేశ్ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ సీఐగా పనిచేసిన వెంకటేశ్‌ను పోలీసులు అధికారులు పీసీఆర్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

పొన్నం అభినందన సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కర్ర రాజశేఖర్

కరీంనగర్‌కార్పొరేషన్: బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈనెల 7న నిర్వహిస్తున్న అభినందన సభను విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు టి.సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ కుల గణనను చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన చారిత్రిక ఘట్టం నేపథ్యంలో అందుకు దోహదం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించాలని నిర్ణయించామని తెలిపారు. ఈనెల 7న నగరంలోని ఇందిరా గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. బీసీల అభివృద్ధికి, భవిష్యత్ తరాలకు బీసీ కుల గణన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ మేరకు అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో తీర్మానం చేసిందని తెలిపారు. రాజకీయాలకతీతంగా బీసీలంతా అధిక సంఖ్యలో పాల్గొని పొన్నం అభినందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీసీ కుల సంఘాల ప్రతినిధులు కర్ర రాజశేఖర్, ఎ.కిరణ్‌కుమార్, లక్కాకుల సురేందర్‌రావు, మెతుకు సత్యం, మడుపు మోహన్, మియాపురం రవీంద్రచారి, మాచర్ల ప్రసాద్, పూసాల సంపత్‌కుమార్, వీర దేవేందర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఇన్నోవేషన్ కోచ్‌లుగా ఎంపిక



కోచ్‌లుగా ఎంపికైనవారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

కరీంనగర్‌సిటీ: విద్యార్థులు మరింత ప్రతిభతో రాణించాలని కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఉత్తమ ఇన్నోవేషన్ కోచ్‌లుగా కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ఇన్నోవేషన్ కోచ్‌లుగా ఎంపికైన హర్షిత, రమ్య, శ్వేతను అభినందించారు. సోహం అకాడమీ తెలంగాణవ్యాప్తంగా 15 జిల్లాల నుంచి 250 మంది కళాశాల విద్యార్థినీవిద్యార్థులకు రోబోటిక్స్ హ్యూమన్ ఎక్సలెన్స్‌పై శిక్షణ అందించి వారి ద్వారా తెలంగాణవ్యాప్తంగా ఉన్న స్కూల్ విద్యార్థులకు శిక్షణ ఇప్పించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి 30 మంది విద్యార్థినులు శిక్షణ పొంది స్కూల్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారు. 250 మంది విద్యార్థినీవిద్యార్థులకు ఇన్నోవేషన్ కోచ్‌లుగా నామకరణం చేసి వారిచే శిక్షణ ఇవ్వబడిన పిల్లలు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయిలో ప్రదర్శింపజేశారు. ఈ 250 మందిలో 15 మందిని బెస్ట్ ఇన్నోవేషన్ కోచ్‌లుగా ఎంపిక చేశారు. వారిలో కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థినులను ఎంపిక చేశారు. బీఎస్సీ ఎంపీసీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న టి.హర్షిత, జి.రమ్య, టి.శ్వేత ఎంపికయ్యారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి ఎస్.సత్యనారాయణరెడ్డి, పి.అరుణ తదితర అధ్యాపకులు అభినందించారు.

గృహకల్ప భూమిని పరిరక్షించాలని రిలే దీక్ష



చింతకుంటలో దీక్ష చేస్తున్న స్థానికులు

కొత్తపల్లి: చింతకుంటలోని రాజీవ్ గృహకల్ప–1కు సంబంధించిన ఆరు గుంటల భూమి ఆక్రమణకు గురవుతోందని, అధికారులు వెంటనే స్పందించి 142 సర్వే నెంబర్‌లోని భూమిని పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం స్థానికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కవ్వంపెల్లి శంకర్, కె.స్వప్న, లక్ష్మీ, లత, షబానా, ఎం.లత, కె.రాము, జి.లక్ష్మీ, కె.లక్ష్మీ, కె.మహేందర్, రామిరెడ్డి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్..

జనసేన అధినేత ఏ నిర్ణయం తీసుకోవాలన్నా చంద్రబాబు ఓకే చెప్పాల్సిందే

- ఆ పార్టీకి 24 సీట్లు కేటాయించినా, ఇప్పటివరకు ఐదు మాత్రమే ఖరారు
- బాబు అభ్యంతరాలతో పవన్ పోటీచేసే నియోజకవర్గం పెండింగే
- రాజోలు, తణుకు, రాజమండ్రి రూరల్ కూడా..
- ఎన్నికల వేళ హైదరాబాద్‌లో మకాం ఏమిటని పార్టీ శ్రేణుల ప్రశ్న



సాక్షి, అమరావతి : ఒక రాజకీయ పార్టీ అధినేత అంటే ఎలా ఉండాలి.. స్వీయ నిర్ణయాలు తీసుకునే ధైర్యం, ట్రబుల్ షూటర్ లక్షణాలు.. కార్యకర్తలు, నేతల అభిప్రాయాలకు విలువివ్వడం.. ఇలాంటివన్నీ పుణికిపుచ్చుకోవాలి. కానీ, ఇవేవీ లేనివాళ్లను ఏమనాలి? జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అనాలి. ఎందుకంటే.. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ ఆయన వేసే ప్రతీ అడుగు, తీసుకునే ప్రతి నిర్ణయం తెలుగుదేశం అధినేత చంద్రబాబు కనుసైగ చేస్తేనే జరుగుతోంది. ఇది ప్రత్యర్థి పార్టీల నుంచి వస్తున్న విమర్శ కాదు.. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో సాక్షాత్తు జనసేన శ్రేణులు వ్యక్తంచేస్తున్న నిశ్చితాభిప్రాయం. ఎందుకంటే.. టీడీపీతో పొత్తులో జనసేనకు కేటాయించిన 24 అసెంబ్లీ సీట్లలో ఇప్పటికీ కేవలం ఐదు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించిన పవన్‌కళ్యాణ్, మిగిలిన 19 స్థానాల పేర్లు ఇంకా ప్రకటించలేదు. ఇందుకు కారణం.. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తుది అనుమతి కోసం ఎదురుచూస్తున్నారట. ఇదే విషయం ఇప్పుడు జనసేనలో హాట్ టాపిక్‌గా మారింది. చంద్రబాబు సూచన మేరకు రెండు, మూడు జాబితాలుగా వెలువడే అవకాశముందని జనసేన నేతలు చెబుతున్నారు. చివరకు.. పవన్ తాను పోటీచేసే స్థానంపై ఇరువురు నేతలు సూచనప్రాయంగా ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ.. దానిని అధికారికంగా ప్రకటించకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తున్నారని వారంటున్నారు. ఇక వారం రోజుల క్రితం జరిగిన టీడీపీ–జనసేనల సీట్ల కేటాయింపు ప్రకటనకు ముందే రాజోలు, రాజానగరం స్థానాల్లో జనసేనే పోటీచేస్తుందని పవన్ ప్రకటించారు. అయితే.. ఆ తర్వాత ఈనెల 24న చంద్రబాబు–పవన్‌కళ్యాణ్ ఉమ్మడిగా నిర్వహించిన మీడియా సమావేశంలో గతంలో చంద్రబాబు ప్రకటించిన రెండు స్థానాలకు టీడీపీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారుగానీ.. పవన్ ప్రకటించిన రెండింటిలో రాజోలు స్థానం అభ్యర్థిని ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టేశారు. అక్కడ పవన్‌కళ్యాణ్ ముందుగా అనుకున్న పేరుపై చంద్రబాబు అభ్యంతరం చెప్పిన కారణంగానే జనసేన తొలి జాబితాలో అదిలేదని జనసేన వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కన.. జనసేన పోటీచేసే మిగిలిన 19 స్థానాల జనసేన అభ్యర్థుల ఎంపికకు కూడా చంద్రబాబు ఆమోదం కావాల్సి ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. అలాగే.. ఆయా స్థానాల్లో తమకు సీట్లు ఖాయమని ఇప్పటివరకూ అనుకుంటున్న జనసేన నేతలు కూడా తమ అభ్యర్థిత్వానికి టీడీపీ అధినేత ఎసరు పెడతారేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. చంద్రబాబు జనసేనకు 24 అసెంబ్లీ స్థానాలే కేటాయించడాన్ని కూడా పవన్ పవిత్ర గాయత్రీ మంత్రంతో గొప్పగా పోల్చుకున్నారని.. నిజానికి.. హిందూ సంప్రదాయం ప్రకారం ఆ మంత్రాన్ని చెవిలోనే ఉపదేశిస్తుంటారని.. ఈలెక్కన జనసేనకు కేటాయించిన ఆ 24 సీట్లలో ఎవరు పోటీచేయాలన్నది చంద్రబాబు పవన్ చెవిలో చెప్పిన తర్వాతే తమ అధినేత అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుందని జనసేన నాయకులే ఛలోక్తులు విసురుతున్నారు.

బాబు చెప్పుచేతల్లో పవన్..

లోకేశ్ రాజకీయ భవిష్యత్తు కోసం చంద్రబాబు ఇప్పటికే పవన్ మాటలకు విలువ లేకుండా చేశారని వారంటున్నారు. ఒక వ్యూహం ప్రకారం తమ అధినేతను ఆయన తన చెప్పుచేతల్లో ఉంచుకునే ఎత్తుగడలో ఉన్నారని జనసేన నేతలు అనుమానిస్తున్నారు. ఎందుకంటే..

- తొమ్మిది నెలల క్రితం తణుకులో పవన్ అక్కడి స్థానిక పార్టీ ఇన్‌చార్జి వి. రామచంద్రరావుకు సీటు ఇస్తానని ఇచ్చిన మాటకు విలువలేకుండా ఆ స్థానంలో చంద్రబాబు టీడీపీ అభ్యర్థిని ప్రకటించడాన్ని వారు ఉదహరిస్తున్నారు.
- అలాగే, సీట్ల కేటాయింపు ప్రకటనకు వారం రోజుల ముందే పవన్ రాజమండ్రి పర్యటనలో రూరల్ స్థానంలో జనసేనే పోటీచేసేలా చంద్రబాబును ఒప్పిస్తానని స్థానిక పార్టీ నేతలకు మాటిచ్చారు. కానీ, ఆ స్థానం ఇప్పటివరకూ అధికారికంగా ఖరారు కాకపోయినా, అనధికారికంగా ఆ స్థానం టీడీపీకి కేటాయించినట్లు ఇరు పార్టీలు వెల్లడిస్తున్నాయి.
- ఇంకోవైపు.. 2019 ఎన్నికల్లో టీడీపీతో సంబంధం లేకుండా జనసేన వేరుగా పోటీచేసినప్పుడే పవన్ 30 వేలకు పైగా ఓట్లు తెచ్చుకున్న పలు స్థానాలను కూడా ఇప్పుడు పొత్తులో జనసేనకు కేటాయించకుండా, ఏదో ఒక సాకుతో అక్కడ టీడీపీ అభ్యర్థులను చంద్రబాబు ఖరారు చేసేసి ఆఎన్నికలో జనసేనకు కేవలం 7,633 ఓట్లు మాత్రమే వచ్చిన నెలిమర్ల.. 11,988 ఓట్లు మాత్రమే వచ్చిన అనకాపల్లి వంటి నియోజకవర్గాలను తమ పార్టీకి కేటాయించారని జనసేన నేతలు గుర్తుచేస్తున్నారు.

బాబు కోసం దిగజారుతున్న పవన్..

ఇవన్నీ ఒక ఎత్తయితే.. జనసేనకు 24 అసెంబ్లీ సీట్లనే కేటాయించిన విషయాన్ని సమర్థించుకోవడానికి పవన్‌కళ్యాణ్ ఏకంగా సొంత పార్టీనే తక్కువ చేసి మాట్లాడడాన్ని జనసేన శ్రేణులు, ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికలప్పుడు బూత్‌లో పనిచేయడానికి రాష్ట్రంలో ఎన్ని స్థానాల్లో జనసేనకు 800–1000 మంది కార్యకర్తలున్నారని ప్రశ్నిస్తూ తాడేపల్లిగూడెం సభలో పవన్ మాట్లాడారని.. ఇలాంటి మాటలు టీడీపీ కోసం తన నాయకత్వాన్ని ఆయనే తక్కువ చేసుకున్నట్లుగా ఉన్నాయని జనసేన నాయకులు వాపోతున్నారు.

ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో..

ఇదిలా ఉంటే.. రోజురోజుకీ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంటే పవన్‌కళ్యాణ్ మాత్రం ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితమై ఉండడమేంటని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈనెల 24న ఉమ్మడి అభ్యర్థుల తొలిజాబితా ప్రకటన ప్రక్రియ పూర్తికాగానే ఆయన తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. మళ్లీ 28న తాడేపల్లిగూడెం సభలో పాల్గొనేందుకు నేరుగా హైదరాబాద్ నుంచి సభాస్థలికి వచ్చారు. సభ పూర్తి కాగానే తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. గత మూడు రోజులుగా హైదరాబాద్‌కే పరిమితయ్యారు. ఇలా పవన్ వ్యవహారశైలి చూస్తుంటే ఆయన చంద్రబాబు కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు సుస్పష్టమవుతోందని జనసేన శ్రేణులు, ఆ పార్టీ అభిమానులు కుండబద్దలు కొడుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన పులివెందుల టీడీపీ సీనియర్ నేత సతీష్‌కుమార్‌రెడ్డి



సతీష్‌కుమార్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పులివెందుల టీడీపీ సీనియర్ నేత, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.వి. సతీష్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద సతీష్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను వైఎస్ ఫ్యామిలీని ఇబ్బంది పెట్టినా.. తనను సీఎం జగన్ ఆహ్వానించి అక్కున చేర్చుకొన్నారని చెప్పారు. సీఎం జగన్ చూపిన ప్రేమ, ఆప్యాయత ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. అలాంటి మంచి ఫ్యామిలీపై తాను ఎందుకు పోరాటం చేశానా అని బాధ కలిగిందని చెప్పారు. టీడీపీలో చంద్రబాబు నాయకత్వం దిగజారిపోయి లోకేశ్ పెత్తనమే నడుస్తోందని సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆపార్టీలో సీనియర్లకు గౌరవం లేదన్నారు. సీఎం జగన్ ఔదార్యం జీవితాంతం గుర్తుపెట్టుకొంటానని సతీష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. భవిష్యత్తులో సీఎం జగన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడిగా పనిచేయాలని నిర్ణయించుకొన్నానని చెప్పారు. ఎన్నికల్లో పోటీపై తనకు ఎలాంటి ఆలోచన లేదన్నారు. నిజంగా పులివెందుల్లో తన అవసరం కూడా జగన్‌కు లేదన్నారు. అయినా సీఎం జగన్ పిలిచారని, ఆయన ఏ బాధ్యతలు ఇచ్చినా సమర్థవంతంగా, చిత్తశుద్ధితో, నిజాయితీగా నిర్వహిస్తానని చెప్పారు.

నెల్లూరు వైఎస్సార్‌సీపీ లోక్‌సభ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: ఒక లోక్‌సభ స్థానానికి, రెండు శాసనసభ స్థానా లకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. తొమ్మి దో జాబితాలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌స భ నియోజకవర్గ సమన్వయకర్తగా వేణుంబాక విజయసాయిరెడ్డి, కర్నూలు అసెంబ్లీ నియోజ కవర్గం సమన్వయకర్తగా ఎ.ఎండీ ఇంతియాజ్ (రిటైర్డ్ ఐఏఎస్), మంగళగిరి అసెంబ్లీ నియో జకవర్గం సమన్వయకర్తగా మురుగుడు లావ ణ్యలను నియమించారు. ఈ మేరకు శుక్రవా రం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వివేకా హత్య కేసు దర్యాప్తుకు వారం రోజులు చాలు

- మీడియాతో నర్రెడ్డి సునీత



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తునకు వారం రోజులు చాలని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత చెప్పారు. ఆమె శుక్రవారం ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వివేకా హత్య కేసు దర్యాప్తును సీబీఐ ఎందుకు జాప్యం చేస్తోందో తెలియదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాత్ర గురించి ఇప్పుడే చెప్పలేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్, రఘురామ కృష్ణరాజు, మహాసేన రాజేష్, పట్టాభి, కొలికపూడి శ్రీనివాసరావు, లాయర్ రజని, సీపీఎం మధు, బొండా ఉమ, వర్ల రామయ్య, ఆదినారాయణ రెడ్డి, డీఎల్ రవీంద్రారెడ్డి, ఎస్.తులసి రెడ్డి, వైఎస్ షర్మిల మొదటి నుంచి తనకు అండగా ఉన్నారని, వారికి కృతజ్ఞతలు అని చెప్పారు. జడ శ్రవణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయినా సరే తన తండ్రి రాజకీయంగా మరింత బలోపేతం కావడం వల్లే రాజకీయ ప్రత్యర్థులు ఆయన్ని హత్య చేశారని చెప్పారు. ఇప్పటివరకూ సీబీఐ విచారణలో నిందితులుగా ఉన్న అవినాష్ రెడ్డి, భాస్కర్‌రెడ్డిని రక్షిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూడా సీబీఐ విచారించాలని ఆమె అన్నారు. ప్రజలు కూడా తనకు సహకరించాలని, అదీ ఓటు రూపంలో అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను లేదా తన భర్త పోటీ చేస్తారో లేదో ఇప్పుడే చెప్పలేనన్నారు.

చంద్రబాబు, మహాసేన రాజేశ్‌లకు ధన్యవాదాలతో...

ఇట్లు.. నర్రెడ్డి సునీత

సునీత ఢిల్లీ ప్రెస్‌మీట్‌తో తొలగిన ముసుగు..

సాక్షి, అమరావతి : 'నాకు అన్ని విధాలుగా మద్దతుగా నిలిచిన చంద్రబాబు, పి.గన్నవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి రాజేష్ మహాసేనలకు కృతజ్ఞతలు'.. అంటూ మూడేళ్లుగా తన వెనుక ఉండి, తనను ఎవరు ఆడిస్తున్నారో, తన నోటి నుంచి వస్తున్న మాటల వెనుక స్క్రిప్ట్ ఎవరిదో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత విస్పష్టంగా వెల్లడించారు. ఇన్నాళ్లూ తాను కప్పుకున్న ముసుగును తొలగించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేందుకు చంద్రబాబు ఆమెను తెరమీదకు తెచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో తన తండ్రి, మాజీ మంత్రి వైఎస్ వివేకా కేసుతో ప్రారంభించి, చివరకు ఏపీ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దని కోరుతూ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు. తన తండ్రి వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తుపై మరోసారి అవాస్తవాలు, అభూత కల్పనలు జోడించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. అందుకోసం 2017లో ఎమ్మెల్సీ ఎన్నికల ఉదంతాన్ని వక్రీకరించారు. ఆమె తండ్రిని కుట్రతో ఓడించిన చంద్రబాబు ముఠాను వెనకేసుకొచ్చారు. ఆ ముఠా సభ్యులు బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డితో సునీత, ఆమె భర్త సన్నిహితంగా ఉంటున్న విషయాన్ని దాటవేశారు. ఆమె తండ్రి రెండో వివాహంతో కుటుంబంలో తలెత్తిన విభేదాలను మరుగున పరచడానికి చూశారు. వివేకాను హత్య చేశానని అంగీకరించిన దస్తగిరితో మాటామంతీ కొనసాగిస్తున్న విషయం బయటి ప్రపంచం గుర్తించడంలేదనే భ్రమలో ఉన్నారు. వెరసి తాను చంద్రబాబు గూటిలో చిలకనని స్పష్టం చేశారు. చంద్రబాబు నేర్పిన నాలుగు పలుకులనే పలికారు. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే సునీత సానుభూతి డ్రామా ఆడారు.

వివేకాను కుట్రతో ఓడించినందుకా చంద్రబాబు, ఆయన ముఠాకు కృతజ్ఞతలు?

సునీత టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన పార్టీ సభ్యులు బీటెక్ రవి, మహాసేన రాజేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలపడమే విడ్డూరం. వృత్తి రీత్యా డాక్టరైన సునీత ఉద్దేశపూర్వకంగా మతిమరుపు నటిస్తున్నట్టుగా ఉన్నారు. ఎందుకంటే వైఎస్ వివేకానందరెడ్డిని 2017లో కుట్రతో రాజకీయంగా అంతమొందించింది చంద్రబాబే. తర్వాత 2019లో ఆయన్ని భౌతికంగా అంతం చేసిందీ చంద్రబాబు ప్రభుత్వ హయంలోనే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఎంపీ అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి ఓడించారని ఆమె అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరం. 2017లో వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ వివేకాను పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందినవారే కావడంతో ఆయన సునాయాసంగా గెలుస్తారని అంతా భావించారు. వివేకా ఎమ్మెల్సీగా ఎన్నికైతే జిల్లాలో టీడీపీకి ఉనికే ఉండదని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి వారి వైపు లాక్కున్నారు. కుట్రపూరితంగా వివేకాను ఓడించారు. ఈ వ్యవహారంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారు.

హత్య వెనుకా ఎల్లో గ్యాంగే..!

ఇక 2019 సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వైఎస్ జగన్ అభ్యర్థిగా ఖరారు చేశారు. నియోజకవర్గం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా వైఎస్ వివేకానందరెడ్డిని నియమించారు. వివేకానందరెడ్డి పార్టీ విజయం కోసం ఎన్నికల వ్యూహాలు పన్నుతూ అందర్నీ కలుపుకొంటూ దూసుకుపోతున్నారు. దాంతో అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణ రెడ్డి బెంబేలెత్తారు. వివేకా జీవించి ఉంటే వారితో పాటు బీటెక్ రవికీ రాజకీయంగా ప్రతిబంధకంగా మారుతారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ వివేకా హత్యకు గురయ్యారు. అంటే వివేకా భౌతికంగా లేకపోవడం రాజకీయంగా ప్రయోజనం కలిగిస్తుందని టీడీపీ పెద్దలు భావించారన్నది సుస్పష్టం. వివేకా హత్యకు ముందు టీడీపీ నేతలు కొందరితో రహస్య సమావేశాలు, హత్య తరువాత ఆ నేతలు వ్యవహరించిన తీరే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. వివేకాతో ఆర్థిక విభేదాలు తలెత్తిన కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డితో బీటెక్ రవి సాన్నిహిత్యం పెంచుకున్నారు. హత్యకు ముందు రోజు అంటే 2019 మార్చి 14 సాయంత్రం టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో హరిత హోటల్‌లో రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందడం గమనార్హం. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిస్తోంది. అంటే వివేకా హత్య వెనుక ఎల్లో గ్యాంగ్ ఉందన్నది స్పష్టమవుతోంది. కానీ ఆ పచ్చ ముఠాలోని చంద్రబాబు, బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డిలను సునీత వెనకేసుకు వస్తుండటం వెనుక ఆంతర్యం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

కుటుంబ వివాదాల మాటేమిటి?

వివేకానందరెడ్డి రెండో వివాహంతో కుటుంబంలో రేగిన విభేదాలు, ఆస్తుల కోసం ఘర్షణలు సునీత మరుగున పెడుతున్న మరో ప్రధాన అంశం. వివేకా మరణిస్తే ఎవరికి ప్రయోజనం, ఆయనతో వ్యక్తిగతంగా ఆస్తిపరంగా, రాజకీయంగా ఎవరికి విభేదాలు ఉన్నాయన్నది ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకం. షమీమ్ అనే మహిళను వివేకా రెండో వివాహం చేసుకున్నారు. ఆ మహిళకు పుట్టిన కుమారునికి ఆస్తిలో భాగం ఇవ్వాలని భావించారు. తన రాజకీయ వారసునిగా చేస్తానని కూడా ప్రకటించారు. దాంతో ఆ కుటుంబంలో ఆస్తి వివాదాలు, రాజకీయ వారసత్వ వివాదాలు తీవ్రస్థాయిలో తలెత్తాయి. వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తీవ్రంగా గొడవపడి ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్నారు. కుటుంబానికి చెందిన కంపెనీల్లో వివేకాకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేశారు. సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. వివేకానందరెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, సునీత దూషించుకుంటూ చేసుకున్న వాట్సాప్ చాటింగ్‌ను కూడా అప్పట్లోనే సిట్ బృందం వెలికితీసింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని, ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా అవడంలేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. షమీమ్ కూడా సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో ఇవన్నీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి జీవించి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదికే ఎక్కువ ప్రయోజనమన్నది స్పష్టమవుతోంది. వివేకాను హత్య చేసిన తరువాత ఆయన నివాసంలో కొన్ని ఆస్తి పత్రాలు, రౌండ్ సీల్ కోసం హంతకులు వెదికారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంటే వివేకా తన రెండో భార్యకు రాసిచ్చిన ఆస్తి పత్రాలను ఆ ఇంటి నుంచి తీసుకువెళ్లారన్నది స్పష్టం. వివేకా లేకపోతే ఆస్తి మొత్తం దక్కడంతోపాటు రాజకీయ వారసత్వం కూడా తమకే వస్తుందన్న ఉద్దేశం ఆయన బావమరిది, అల్లుడికి ఉందన్నది స్పష్టమైంది.

లేఖను గోప్యంగా ఉంచి.. గుండెపోటు ప్రచారం

వివేకా గుండెపోటుతో చనిపోయారని ప్రచారం చేసేందుకు ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి పక్కా పన్నాగంతోనే వ్యవహరించారు. శివప్రకాశ్‌రెడ్డి మొదటగా ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. అదే విషయాన్ని ఆదినారాయణ రెడ్డి మీడియాకు వెల్లడించారు. దాంతో వివేకా గుండెపోటుతో మరణించారనే అసత్య సమాచారం బయటకు వచ్చింది. టీవీ చానళ్లలో ప్రసారమైంది. ఆ ప్రచారాన్ని కొనసాగించేందుకు వివేకా రాసిన లేఖను కుమార్తె, అల్లుడు రహస్యంగా ఉంచారు. ఆ లేఖను మొదటగా ఆ రోజు ఉదయం 6.10 గంటలలోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి ఆ విషయాన్ని సునీత భర్త రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖ, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని రాజశేఖరరెడ్డి ఆయనతో చెప్పారు. ఆ లేఖను వెంటనే పోలీసులకు అప్పగించమని వారు చెప్పి ఉంటే వివేకాని హత్య చేశారన్న విషయం వెంటనే అందరికీ తెలిసిపోయేది. కానీ ఆ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి ఆ లేఖను సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. వారు ఆ లేఖను చదివిన వెంటనే దాన్ని పోలీసులకు అప్పగించలేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. ఆ లేఖను సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ కేసులో కీలక అంశం. వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారనే ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఆ లేఖను బయట పెట్టకూడదని వారు నిర్ణయించారా అన్నది ఇక్కడ అందరికీ కలిగే సందేహం.

వివేకా హంతకులతో సఖ్యత.. ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితో సాన్నిహిత్యం

వివేకాను గొడ్డలితో నరికి చంపానని అంగీకరించిన హంతకుడు దస్తగిరితో సునీత సఖ్యతతో ఉండటం వెనుక గూడుపుఠాణి ఏమిటన్నది మరో కీలకాంశం. టీడీపీ ప్రభుత్వంలో నియమించిన సిట్, తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్, సీబీఐ కూడా వివేకానందరెడ్డిని దస్తగిరితో సహా నలుగురు హత్య చేశారని నిర్ధారించాయి. వివేకాను గొడ్డలితో స్వయంగా నరికాను అని చెప్పిన దస్తగిరి అప్రూవర్‌గా మారడంతోనే ఈ కేసు దర్యాప్తు దారితప్పింది. సునీత, ఆమె భర్త దస్తగిరితో పలుసార్లు భేటీ అవుతున్నారు. టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితోనూ సన్నిహితంగా ఉంటున్నారు. అంటే వివేకా కుటుంబం, టీడీపీ నేతల పన్నాగంలో భాగంగానే దస్తగిరి అప్రూవర్‌గా మారారన్నది సుస్పష్టం. వివేకా హంతకుడితో, రాజకీయ ప్రత్యర్థులతోనూ ఆ కుటుంబం సన్నిహితంగా ఉండటం ఈ హత్య కుట్రలో వారి సామూహిక భాగస్వామ్యాన్ని బహిర్గతం చేస్తోంది.

వారంరోజుల్లో తేలిపోయేదే అయితే చంద్రబాబునే ప్రశ్నించాలి

వివేకా హత్య కేసు వారం రోజుల్లోనే తేలిపోవాలి కానీ, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని సునీత ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమే. ఎందుకంటే వివేకా హత్యకు గురైనప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది చంద్రబాబే. అప్పుడు వారం రోజుల్లోనే ఆ హత్య కేసును ఎందుకు ఛేదించలేదని సునీత ప్రశ్నించాల్సింది చంద్రబాబునే. ఇలా ప్రశ్నించకపోగా, వెనకేసుకు వస్తుండటం వెనుక ఉద్దేశం ఏమిటన్నది నిగ్గు తేలాలి. అంతేకాదు వివేకా హత్య జరిగిన వెంటనే ఆ కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు చంద్రబాబు అమరావతి నుంచి పెద్ద కథే నడిపారు. అప్పటి ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు కడప ఎస్పీతో, మంత్రి ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కేసు దర్యాప్తును ప్రభావితం చేశారు. అయినా సునీత చంద్రబాబును ప్రశ్నించడంలేదు.

ప్రశ్నించాల్సింది కేంద్రాన్ని కదా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వివేకా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. కానీ ఆ దర్యాప్తును అడ్డుకుంది సునీతే. రాష్ట్ర పోలీసుల దర్యాప్తు వద్దని, సీబీఐ దర్యాప్తు కావాలని ఆమె న్యాయస్థానంలో కేసు వేశారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలన్న న్యాయస్థానం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం కేసును బదిలీ చేసింది. మూడేళ్లుగా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధమే లేదు. ఇప్పుడు సునీత నిలదీయాల్సింది కేంద్ర ప్రభుత్వాన్నే. ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టిన ఆమె అక్కడే కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని నిలదీస్తూ ప్రశ్నల వర్షం కురిపించాల్సింది. ఆమె అలా చేయలేదు. ఎందుకంటే ఎన్నికల్లో బీజేపీ ప్రాపకం కోసం పాకులాడుతున్న చంద్రబాబుకు అది ఇష్టం లేదు. బాబుకు ఇష్టంలేని పని సునీత చేయరు. అది ఆమె తండ్రి హత్య కేసు దర్యాప్తు అయినా సరే..

సునీత టీడీపీ గూటి చిలుకే

ఇన్నాళ్లూ తన తండ్రి వివేకా హంతకులెవరో నిగ్గు తేలాలంటూ వాదించిన సునీత.. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కడంతో అసలు స్వరూపం బయటపెట్టారు. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలే తనకు ప్రధానమని తేల్చిచెప్పారు. అందుకోసమే ఢిల్లీ ప్రెస్ మీట్‌లో రాజకీయ ప్రసంగమే చేశారు. చంద్రబాబు, పవన్, లోకేశ్, రఘురామరాజు, మహాసేన రాజేష్, పట్టాభి... ఇలా ఈ ఎల్లో గ్యాంగ్ కొన్నేళ్లుగా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న అసత్య ఆరోపణలనే తాజాగా సునీతా చెప్పారు. అచ్చమైన టీడీపీ నేతగా మారారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటేయవద్దని చెప్పారు. ఇది నైతికంగా సునీత దిగజారుడుతనమే. ఇన్నాళ్లూ తండ్రి హత్యకు గురైన బాధితురాలిగా చెప్పుకున్న సునీత.. ప్రస్తుతం చంద్రబాబు కుట్ర రాజకీయంలో పావునని అంగీకరించారు. ఇన్నాళ్లూ తాను కార్చింది మొసలి కన్నీరేనని, చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనమే తన కంట్లో పన్నీరని చెప్పకనే చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఓటేయకూడదని అంటున్నారు. ఎందుకో మాత్రం ఆమె చెప్పనే లేదు. కులం, మతం, రాజకీయం చూడకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకా? మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేసినందుకా? విద్య, వైద్య సంస్కరణలను ప్రవేశపెట్టినందుకా? గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సుపరిపాలనను ప్రజల చెంతకు చేర్చినందుకా? పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లతోభారీ ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నందుకా.. ఎందుకు ఓటేయకూడదని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. కేవలం తన తండ్రి రెండో భార్యకు ఆస్తి లేకుండా అన్యాయం చేసినందుకు, తన రాజకీయ ప్రయోజనాల కోసం తండ్రి హత్యను ఉపయోగించుకోవాలని చూస్తున్నందుకే ఆమెకు ప్రజలు సహకరించాలా అని ప్రశ్నిస్తున్నారు.

మాటలు మార్చిన సునీత

సునీత వైఖరి ఊసరవెల్లిని తలపిస్తోంది. తన తండ్రి వైఎస్ వివేకా హత్య వెనుక టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డి, అప్పటి టీడీపీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి ఉన్నారని ఆమె 2019 మార్చిలో చెప్పారు. అంతే కాదు.. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి చివరి వరకూ కృషి చేశారని కూడా చెప్పారు. ఈ మేరకు 2019 మార్చి 21న హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మరీ తన తండ్రి వివేకా, ఎంపీ అవినాష్‌రెడ్డి మధ్య ఉన్న అన్యోన్యతను వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రపూరితంగా వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసి తన తండ్రి కోరిక నెరవేర్చాలని ఆమె ప్రజలను కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా కొంతకాలం అదే వైఖరి అవలంబించారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్లేటు ఫిరాయించారు. సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి పూర్తిగా చంద్రబాబు గుప్పిట్లోకి వెళ్లి టీడీపీ రాజకీయ కుట్రలో భాగస్వాములయ్యారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై అవాస్తవ ఆరోపణలు చేయడం మొదలెట్టారు. మాటలు మారుస్తూ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌ను విచారించాలంటున్నారు. చివరగా వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దంటూ ముసుగు తొలగించేశారు. తన ఎల్లో విధానాన్ని బహిర్గతం చేశారు.

త్వరలో రైతు కమిషన్.. విద్యా కమిషన్!

కౌలురైతుల రక్షణ అంశంపై అఖిలపక్ష సమావేశం కూడా..

- సామాజిక, పౌర సంస్థల ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్
- రైతు భరోసా ఎవరెవరికి అందాలన్నది తేల్చాల్సి ఉందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే రాష్ట్రంలో రైతు కమిషన్, విద్యా రంగంపై (ఎడ్యుకేషన్) కమిషన్లను ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని చెప్పారు. రైతులు, కౌలు రైతుల సాధక బాధకాలు, వారి సంక్షేమం, వ్యవసాయరంగంలో సంస్కరణలకు సంబంధించి రైతు కమిషన్ తగిన సలహాలు, సూచనలు అందిస్తుందని తెలిపారు. శుక్రవారం సచివాలయంలో వివిధ సామాజిక సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులతో సీఎం రేవంత్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజాహిత కార్యక్రమా లు చేపట్టిందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకా రం సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. మహిళలు, నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా నాలుగు గ్యా రంటీలను అమలు చేశామ ని.. రైతులు, నిరుద్యోగుల కు మేలు చేసేందుకు మరిన్ని చర్యలు చేపడతామని చెప్పారు.

అసలైన అర్హులకు అదనపు సాయం!

కౌలు రైతుల రక్షణకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని.. ప్రత్యేక చట్టం తీసుకురావాలనే ఆలోచన ఉందని రేవంత్ చెప్పారు. రైతు భరోసా అనేది రైతులు పంటలు వేసేందుకు అందించే పెట్టుబడి సాయమని.. అది ఎవరికి ఇవ్వాలన్న దానిపై విస్తృత చర్చ జరగాలని పేర్కొన్నారు. నిస్సహాయులకు, అసలైన అర్హులకు చెప్పిన దానికంటే ఎక్కువ సాయం చేయాలనేది తమ ఆలోచన అని రేవంత్ చెప్పారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. పంట మార్పిడికి, అన్ని పంటల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాలయాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోందని తెలి పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలను వేర్వేరు చోట్ల కాకుండా.. దాదాపు 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లుగా ఏర్పాటు చేస్తామని, దీనితో కుల, మత వివక్ష కూడా తొలగుతుందని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా ముందుగా కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ నెలకొల్పుతామని, దశలవారీగా అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తామని తెలిపారు. గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ మరింత సమర్థంగా జరిగేలా చూస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని చెప్పారు. సీఎంను కలసిన వారిలో ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్, యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, రమ మేల్కొటే, ప్రొఫెసర్ రియాజ్, ప్రొఫెసర్ పురుషోత్తం, గాదె ఇన్నయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా...

'ఫసల్ బీమా'లోకి తెలంగాణ

- రాష్ట్రంలో పంటల బీమా అమలుకు సర్కారు నిర్ణయం



సమావేశంలో సీఎం రేవంత్, మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటల బీమాను అమలు చేయాలని, కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లో తిరిగి చేరాలని సర్కారు నిర్ణయించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పీఎంఎఫ్‌బీవై సీఈవో, కేంద్ర సంయుక్త కార్యదర్శి రితేశ్ చౌహాన్ శుక్రవారం సమావేశమయ్యారు. 2016 నుంచి 2020 వరకు పీఎంఎఫ్‌బీవైలో తెలంగాణ ఉండటం, తర్వాత నాటి ప్రభుత్వం ఉపసంహరించుకోవడంపై ఈ సందర్భంగా చర్చించారు. రాష్ట్రంలో పీఎంఎఫ్‌బీవైని అమలు చేయాలని నిర్ణయించారు. దీనితో వచ్చే పంట కాలం నుంచే రైతులు ఈ పథకం నుంచి పంటల బీమా పొందే అవకాశం ఉంటుంది. పీఎంఎఫ్‌బీవైతో రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుందని, పంటలు నష్టపోయినప్పుడు సకాలంలో పరిహారం అందుతుందని రితేశ్ చౌహాన్ వివరించారు. తర్వాత సీఎం మాట్లాడుతూ.. రైతులకు దన్నుగా నిలుస్తూ, సాగు రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్య మని చెప్పారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో రైతు కేంద్రిత విధానాల అమలుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

గొర్రెల పథకం లొసుగులపై ఏసీబీ ఆరా

- రెండో రోజూ నలుగురు నిందితులను ప్రశ్నించిన ఏసీబీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల కొనుగోలు పథకంలో నిధులు పక్కదారిపట్టడంపై అవినీతి నిరోధక శాఖ దృష్టి పెట్టింది. ఈ పథకానికి సంబంధించిన నిధులు గోల్‌మాల్ చేయడంలో ఏయే లొసుగులు వాడుకున్నారన్న దానిపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శనివారంతో వీరి కస్టడీ ముగియనున్న నేపథ్యంలో...ఇప్పటికే అరెస్టయిన నిందితులను వరుసగా శుక్రవారం ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. గొర్రెల కొనుగోళ్లలో పాల్గొన్న నిందితులు నిధుల మళ్లింపు పథకం ఎలా రూపొందించారు? కీలక నిందితుల నుంచి వీరికి అందిన ఆదేశాలు ఏంటి? ఎవరి వాటా ఎంత? వంటి విషయాలను విచారించి ఏసీబీ అధికారులు స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు తెలిసింది. గొర్రెల కొనుగోలు ఏజెన్సీగా వ్యవహరించిన మొహిదొద్దీన్ అండ్ కో చెప్పినట్లు చేశామని నిందితులు అంగీకరించినట్టు తెలిసింది.

బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి నీటి విడుదల

బాల్కొండ/రెంజల్(బోధన్): మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి శుక్రవారం ఉదయం నీటి విడుదలను ప్రారంభించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఏటా మార్చి 1న బాబ్లీ ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీకి 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. ఈ నేపథ్యంలో తీర్పు ప్రకారం త్రిసభ్య కమిటీ సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం తరపున ఎస్సారెస్పీ డిప్యూటీ ఈఈ గణేశ్, మహారాష్ట్ర తరపున నాందేడ్ ఈఈ బన్సోడ్, సీడబ్ల్యూసీ తరపున ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 24 గంటల తర్వాత ఈ నీరు వచ్చి చేరే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ తరపున కూడా అధికారి పాల్గొనాల్సి ఉన్నా అనివార్య కారణాల వల్ల పాల్గొన లేదని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఏఈఈ రవి, సీడబ్ల్యూసీ ఏఈఈ ప్రణీత్, కడెం ప్రాజెక్ట్ డిప్యూటీ ఈఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బాబ్లీ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు వదిలిన క్రమంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో, నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద పుణ్యస్నానాలకు వచ్చిన బాలమణి అనే మహిళ గల్లంతైంది.

రూ.15,718 కోట్ల అభివృద్ధి పనులు!

- 4, 5 తేదీల్లో రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటన
- ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో బహిరంగ సభలు: కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పర్యటనలో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో ప్రధాని మోదీ మొత్తం రూ.15,718 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్‌లో రూ.6,697 కోట్లు, సంగారెడ్డిలో రూ.9,021 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయి. సీఎం ఎ.రేవంత్ కూడా ఈ పర్యటనలో పాల్గొంటారు. జాతీయ రహదారుల విస్తరణ, నిర్మాణం, రూ.6,000 కోట్లతో ఎన్టీపీసీ నిర్మించిన రెండవ థర్మల్ పవర్ యూనిట్, అంబారి – ఆదిలాబాద్ – పింపాలకుట్టి రైల్వే లైన్ విద్యుదీకరణ లాంటి పనులు వీటిల్లో ఉన్నాయి. కాగా బేగంపేట విమానాశ్రయంలో నిర్మించిన పౌర విమానయాన పరిశోధనా సంస్థను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఘట్‌కేసర్ – లింగంపల్లి మధ్యన కొత్త ఎంఎంటీఎస్ రైలును ప్రారంభించనున్నారు. ఈ రెండుచోట్లా ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభల్లో ప్రధాని మోదీ పాల్గొంటారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు.

పాత పద్ధతిలోనే పంటల బీమా



- కొన్నేళ్లు ఫసల్ బీమాను అమలు చేసి ఆపేసిన గత సర్కారు
- రాష్ట్ర సర్కారు తరఫునే బీమా పథకం తెస్తామని ప్రకటన... సుమారు నాలుగేళ్లుగా ఎలాంటి పంటల బీమా లేని పరిస్థితి
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందలేని దుస్థితి
- ఈ క్రమంలో తిరిగి ఫసల్ బీమా యోజన అమలుకు కొత్త సర్కారు నిర్ణయం
- వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమలు..
- బీమా ప్రీమియం రేట్లను కట్టడి చేస్తేనే రైతులకు ప్రయోజనమనే అభిప్రాయాలు

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ బెంగాల్ తరహాలో రాష్ట్రంలో సొంతంగా పంటల బీమా తీసుకురావాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం దీనిపై వెనక్కి తగ్గింది. కొన్నేళ్ల కింద రాష్ట్రంలో అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)నే తిరిగి అమలు చేసేందుకు సిద్ధమైంది. దీనితో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందనుంది. నిజానికి 2020 వరకు రాష్ట్రంలో పీఎంఎఫ్‌బీవై అమలైంది. కానీ అప్పటి సర్కారు రైతులకు అనుకూలంగా లేదన్న భావనతో ఈ పథకం నుంచి బయటికి వచ్చింది. అప్పటి నుంచి రాష్ట్రంలో ఎలాంటి పంటల బీమా అమల్లో లేదు. పంట దెబ్బతిన్నప్పుడు రైతులు నష్టపోతున్నారు. ఏదో ఒక పంటల బీమా పథకం ఉంటే మేలన్న భావన చాలా మంది రైతుల్లో నెలకొని ఉంది.

పంటల బీమాతో ప్రయోజనం

రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులు ఉన్నారు. గతంలో పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నప్పుడు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది బీమా చేయించేవారు. నేరుగా పంటల బీమా తీసుకోవడానికి రైతులు ముందుకు రావడంలేదని భావించిన సర్కారు.. బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకునే రైతులకు తప్పనిసరిగా పంటల బీమా చేయించే నిబంధన పెట్టింది. పంట రుణం ఇచ్చేప్పుడే బీమా ప్రీమియాన్ని మినహాయించుకొని మిగతా డబ్బులు రైతులకు ఇచ్చేవారు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే రైతులకు ఎంతో కొంత నష్టపరిహారం వచ్చేది. 2012–13లో 10 లక్షల మంది పంటల బీమా చేయగా.. పంట నష్టపోయిన 1.80 లక్షల మందికి రూ.78.86 కోట్ల పరిహారం అందింది. 2013–14లో 8.52 లక్షల మంది బీమా చేయించగా.. 1.18 లక్షల మందికి రూ.56.39 కోట్ల పరిహారం వచ్చింది. 2015–16లో 7.73 లక్షల మంది బీమా చేస్తే.. ఆ ఏడాది పంట నష్టం ఎక్కువ జరగటంతో ఏకంగా రూ.441.79 కోట్ల నష్ట పరిహారం రైతులకు అందింది.

- 2016 వానాకాలం సీజన్ నుంచి దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం అమల్లోకి వచ్చింది. దీనికి చెల్లించే ప్రీమియంలో రైతులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొంతమేర సొమ్మును తమ వాటాగా భరిస్తాయి. 2016–17లో 8.87 లక్షల మంది మంది రైతులు ఫసల్ బీమా చేయించగా.. 1.34 లక్షల మందికి రూ.111.33 కోట్ల పరిహారం వచ్చింది.
- 2018–19, 2019–20 సంవత్సరాల్లో రూ.960 కోట్ల పరిహారం రాష్ట్రానికి మంజూరైనా.. అందులో కొంతమేర మాత్రమే రైతులకు దక్కింది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా ప్రీమియం చెల్లించకపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది.

బీమా ప్రీమియంపై కట్టడి తప్పనిసరి

పంటల బీమా వల్ల లాభం ఉన్నా.. చాలా మంది రైతులు బీమా ప్రీమియం విషయంలో అసంతృప్తితో ఉన్నారు. బీమా కంపెనీలు భారీగా లాభాలు గడిస్తున్నా.. ప్రీమియం ధరలను పెంచుకుంటూ పోయాయని వాపోతున్నారు. తెలంగాణలో అప్పట్లో రబీలో చెల్లించే ప్రీమియం మొత్తం దాదాపు బీమా కంపెనీలను బాగు చేయడానికే అన్నట్టుగా అమలైందని.. ప్రైవేటు బీమా సంస్థలకు పంటల బీమా పథకంలో అవకాశం కల్పించడంతో పరిస్థితి మరింత దిగజారిందని విమర్శలు ఉన్నాయి. పీఎంఎఫ్‌బీవై కింద వరి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుములకు రెండు శాతం చొప్పున, పసుపు రైతులు ఐదు శాతం చొప్పున ప్రీమియం చెల్లించారు. ఇక పునరుద్ధరించిన వాతావరణ ఆధారిత బీమా కింద పత్తి, మిరప, ఆయిల్‌పాం, బత్తాయి పంటలకు పంట రుణంలో 5 శాతాన్ని రైతులు ప్రీమియంగా చెల్లించారు. పైగా జిల్లా జిల్లాకు ప్రీమియం ధరలు మారుతుండేవి. ఉదాహరణకు 2018లో పెసరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో హెక్టార్‌కు రూ.24,165 చొప్పున, మిరపకు ఏకంగా రూ.38,715 చొప్పున ప్రీమియంగా ఖరారు చేయడం గమనార్హం. అంత దారుణంగా ప్రీమియం రేట్లు ఉండటంతో రైతులు కూడా పంటల బీమాపై తీవ్ర అసంతృప్తి చెందారు. తమకు పంటల బీమా వద్దని మొత్తుకున్నారు. ఈ క్రమంలోనే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమాను నిలిపివేసింది. ఇప్పుడు మళ్లీ అమల్లోకి తెస్తున్న నేపథ్యంలో.. బీమా ప్రీమియంపై కట్టడి అవసరమని, ఆ దిశగా వ్యవసాయశాఖ చర్యలు తీసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు.

119 నియోజకవర్గాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ముదిగొండలో 'గృహజ్యోతి' ప్రారంభం.. జీరో బిల్లు జారీ



జారీ చేసిన జీరో బిల్లు

ముదిగొండ: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పదిహేను రోజుల్లోగా అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ కేంద్రాల్లో నిపుణులైన అధ్యాపకులతో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఉద్యోగ నియామకాల పరీక్షలను లీకేజీలు లేకుండా పారదర్శకంగా చేపడతామని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలకు బకాయిలు లేకుండా ప్రతినెలా వేతనాలు చెల్లిస్తామని వెల్లడించారు. గత పాలకులు రెసిడెన్షియల్ పాఠశాలలను ఇరుకు భవనాల్లో నడిపించగా, తాము తాజా బడ్జెట్‌లో సొంత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి, ఖజానా ఖాళీ చేయగా.. తాము ప్రతీపైసా పోగు చేసి ముందుకు సాగుతున్నామని, ఈ క్రమంలో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తామని భట్టి వెల్లడించారు.



మహిళకు జీరో బిల్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. పక్కన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్

గృహజ్యోతి ప్రారంభం

ముదిగొండలోని ఓ ఇంట్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి గృహజ్యోతి పథకం ద్వారా జీరో బిల్లు అందజేశారు. ఈనెల నుంచి 200 యూనిట్లు వరకు విద్యుత్‌ను వినియోగించే వారు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిపుణుల కమిటీ సూచనలు అమలు చేయాల్సిందే

దుర్గం చెరువు పరిరక్షణపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: దుర్గం చెరువు పరిరక్షణకు నిపుణుల కమిటీ సూచించిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక చర్యలను తప్పకుండా అమలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలోని 78 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన 146 నిర్మాణాల తొలగింపునకు ఏం చర్యలు తీసుకున్నారని సర్కార్‌ను ప్రశ్నించింది. 160.6 ఎకరాల విస్తీర్ణంలో ఎఫ్‌టీఎల్ సరిహద్దును ప్రకటిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసినా.. ఇంకా తుది నోటిఫికేషన్ ఎందుకు వెలువడలేదని అడిగింది. ప్రభుత్వం దాఖలు చేసిన స్టేటస్ రిపోర్టుపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. సరైన చర్యలు తీసుకోకుంటే.. మరోసారి నిపుణుల కమిటీ చెరువును పరిశీలించేలా ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. దుర్గం చెరువులో కాలుష్యం చేరి ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారి వందలాది చేపలు మృతి చెందాయంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. ముగ్గురు సభ్యులతో సీజే ధర్మాసనం ఏర్పాటు చేసిన కమిటీ చెరువును పరిశీలించి గత నెలలో సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నివేదికపై కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈ క్రమంలో అధికారులు స్టేటస్ రిపోర్టును అందజేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం అందజేసిన స్టేటస్ రిపోర్టును పరిశీలించింది.

గడువు పేర్కొనకుండా స్టేటస్ రిపోర్టా?

'నిపుణుల కమిటీ సూచించిన స్వల్పకాలిక రక్షణ చర్యలను ఎప్పటిలోగా చేపడతామనే గడువును స్టేటస్ రిపోర్టులో పేర్కొనలేదు. చర్యలు చేపడుతున్నామంటూ పలు శాఖలు కాపీలను జత చేయడం తప్ప రిపోర్టులో ఏమీ లేదు' అని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వల్పకాలిక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే కాలుష్య నియంత్రణ మండలి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, మత్స్య శాఖల నివేదిక కోసం వేచిచూస్తున్నామని ఏజీ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఏం చేసినా చెరువు పరిరక్షణ చర్యలు మాత్రం చేపట్టాల్సిందేనని ధర్మాసనం తేల్చిచెప్పింది.

నకిలీ మందుల తయారీదారులపై దాడులు

- 'ఆపరేషన్ జై' పేరిట ఉత్తరాఖండ్‌లో సోదాలు... రూ. 44.33 లక్షల విలువైన నకిలీ మందులు స్వాధీనం
- డీసీఏ, టాస్క్‌ఫోర్స్ అధికారుల అంతర్రాష్ట్ర ఆపరేషన్



డీసీఏ, టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో నిందితులు

సాక్షి, హైదరాబాద్: నకిలీ మందుల తయారీ కేంద్రం గుట్టురట్టు చేసేందుకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ), హైదరాబాద్ సీపీ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు కలిసి 'ఆపరేషన్ జై'పేరిట అంతర్రాష్ట్ర ఆపరేషన్ చేపట్టారు. ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వార్‌లో నెక్టార్ హెర్బ్స్ అండ్ డ్రగ్స్ పేరిట ఈ నకిలీ మందుల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు నకిలీ మందులను సరఫరా చేస్తున్నట్టు పక్కా ఆధారాలు సేకరించారు. దాడిలో మొత్తం రూ.44.33 లక్షల విలువైన నకిలీ మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ జైకు సంబంధించిన వివరాలను డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు.

మలక్‌పేట్‌లో లింకులు ఉత్తరాఖండ్ వరకు..

నకిలీ మందుల విక్రయానికి సంబంధించి విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు డీసీఏ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మలక్‌పేట్‌లోని ఓ మెడికల్ దుకాణంలో ఫిబ్రవరి 27న సోదాలు చేపట్టగా రూ.7.34 లక్షల విలువైన ఎంపీఓడీ–200 ట్యాబ్లెట్లు పట్టుబడ్డాయి. ఈ నకిలీ మందులను విక్రయిస్తున్న అర్వపల్లి సత్యనారాయణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మీర్‌పేట్‌కు చెందిన గాండ్ల రాములు నుంచి తాను ఈ నకిలీ ట్యాబ్లెట్లు కొనుగోలు చేసినట్టు అతను అంగీకరించాడు. ఈ సమాచారంతో డీసీఏ అధికారులు గాండ్ల రాములును అదుపులోకి తీసుకుని విచారించగా.. తాను ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వార్‌కు చెందిన విషాద్ కుమార్, సచిన్ కుమార్‌ల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపాడు. సచిన్ కుమార్, విషాద్ కుమార్‌లు వాట్సప్ కాల్స్ ద్వారా తన నుంచి ఆర్డర్లు తీసుకుని ఉత్తరాఖండ్ నుంచి మందులను పంపుతున్నట్టు పేర్కొన్నాడు. ఈ సమాచారం మేరకు డీసీఏ, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఉత్తరాఖండ్‌లో ఆపరేషన్ చేపట్టారు. ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వార్‌లో నెక్టార్ హెర్బ్స్ అండ్ డ్రగ్స్ సంస్థలో ఫిబ్రవరి 29న డీసీఏ అధికారులు సోదాలు నిర్వహించారు. సచిన్ కుమార్ నకిలీ ట్యాబ్లెట్లను తయారు చేసి, వివిధ కంపెనీల లేబుల్స్ అతికించి లక్ష నకిలీ ట్యాబ్లెట్లను రూ.35 వేలకు విక్రయిస్తున్నట్టు ఆధారాలు సేకరించారు. ఆ సంస్థనుంచి మొత్తం రూ.44.33 లక్షల విలువైన నకిలీ ట్యాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ అరెస్టు చేశారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు కిరణ్‌పై కేసు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పాలనను విమర్శిస్తూ.. గత ఏడాది నవంబర్ 4న గాంధీభవన్‌లో ఆయన నిరసన తెలియజేసినందుకు గతంలోనే ఈ కేసు నమోదైంది. కేసు విచారణకు హాజరు కావాలని కిరణ్‌ను కోరుతూ.. శుక్రవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో శంకర్ 41 (ఎ) కింద నోటీసులు జారీ చేశారు.

కొత్త ట్రిబ్యునల్‌పై నిర్ణయాధికారం కేంద్రానిదే

- గోదావరి బోర్డు భేటీలో తెలంగాణ స్పష్టీకరణ
- ఆ అంశాన్ని ఎజెండాలో పెట్టడంపై అభ్యంతరం
- అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోనే టెలిమెట్రీలు పెట్టాలని విజ్ఞప్తి
- తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు అడ్డుకోవాలన్న ఏపీ



శుక్రవారం గోదావరి బోర్డు సమావేశంలో పాల్గొన్న చైర్మన్ ముకేష్ కుమార్ సిన్హా తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య గోదావరి నదీ జలాల పంపిణీకి కొత్త ట్రిబ్యునల్ వేయాలనే ఏపీ విజ్ఞప్తిని గోదావరి బోర్డు సమావేశం ఎజెండాలో పెట్టడంపై తెలంగాణ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టం ప్రకారం ఈ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కేంద్రానికే ఉందని స్పష్టం చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్–85 కింద అప్పగించిన అధికారాలకే గోదావరి బోర్డు పరిమితం కావాలని చెప్పింది. బోర్డు పరిధిలోకి రాని అంశాలను ఎజెండాలో ఎలా చేర్చుతారని ప్రశ్నించింది. దీంతో ఈ అంశంపై గోదావరి బోర్డు సమావేశంలో చర్చించబోమని బోర్డు చైర్మన్ ముకేశ్ కుమార్ సిన్హా ప్రకటించారు. శుక్రవారం జలసౌధలో గోదావరి బోర్డు సమావేశం వాడీవేడిగా జరిగింది. తెలంగాణ నుంచి ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి భీంప్రసాద్, అంతర్రాష్ట్ర ఎస్ఈలు కోటేశ్వరరావు, శ్రీధర్‌రావు దేశ్‌పాండే, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, ఏపీ నుంచి నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శితో పాటు సీఈ (హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర) కుమార్, ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల వద్దే టెలిమెట్రీలు పెట్టాలి

గోదావరి బోర్డు సమావేశం ఎజెండాలో కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం జారీ చేసిన టీవోఆర్ (టర్మ్ అండ్ రిఫరెన్స్)ను చేర్చగా... ట్రిబ్యునల్ పరిధిలో ఉన్న అంశాన్ని చర్చించడంపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో భారీగా టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాలనే ప్రతిపాదనలను తెలంగాణ వ్యతిరేకించింది. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోనే టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాలని, జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కిందఏర్పాటు చేయాలని కోరింది. కాగా తెలంగాణ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్, ఎస్సారెస్పీ–2 విస్తరణ, శ్రీపాద ఎల్లంపల్లి, కాళేశ్వరం అదనపు టీఎంసీ, కుప్తీ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ఏపీ డిమాండ్ చేసింది. పై 4 ప్రాజెక్టుల్లో మూడింటికి టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ఆమోదం లభించిందని, కుప్తీ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే అందిస్తామని తెలంగాణ తెలిపింది. గోదావరిలో న్యాయమైన వాటా ప్రకారమే ప్రాజెక్టులు కడుతున్నామని స్పష్టం చేసింది.

అదనపు సిబ్బంది అవసరం లేదు

గోదావరి బోర్డుకు అదనంగా సిబ్బందిని సమకూర్చాలని చేసిన ప్రతిపాదనలను రెండు రాష్ట్రాలు వ్యతిరేకించాయి. ప్రాజెక్టులు అప్పగించనప్పుడు అదనంగా సిబ్బంది అవసరమే లేదని స్పష్టం చేశాయి. 2024–25లో బోర్డుకు రూ.16 కోట్ల బడ్జెట్ కేటాయింపునకు ఆమోదం తెలపాలని ప్రతిపాదించగా.. 2023–24లో వ్యయం రూ.8 కోట్లకు మించదని, రూ.10 కోట్లు కేటాయిస్తే సరిపోతుందని పేర్కొన్నాయి. గోదావరి జలాల వినియోగంతో పాటు పంటల సాగు వివరాలను ఉపగ్రహ చిత్రాల సహకారంతో సేకరించాలని బోర్డు చేసిన ప్రతిపాదనలను తెలుగు రాష్ట్రాలు తోసిపుచ్చాయి. సమావేశంలో బోర్డు సభ్య కార్యదర్శి అజగేషన్, సభ్యులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి బంగారు కిరీటాలు



బంగారు కిరీటం, అభయ హస్తం ఆభరణాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని కల్యాణమూర్తులకు రెండు బంగారు కిరీటాలు, ఒక అభయ హస్తం ఆభరణాలను హైదరాబాద్‌కు చెందిన తడకమల్ల కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు శుక్రవారం అందజేశారు. వీటి బరువు 250 గ్రాములు ఉంటుందని వారు పేర్కొన్నారు. వారు ముందుగా శ్రీస్వామిని దర్శించుకుని.. అనంతరం ముఖ మండపంలో ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తికి ఆభరణాలను అందజేశారు.

సాగర్ కుడికాలువ నీరు విడుదల



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడికాలువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈ రఘునాథరావు, డీఈ గాయత్రి పర్యవేక్షణలో శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఆరువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, 9 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ముగ్గుర్ని మింగిన మ్యాన్ హోల్

- కుల్సుంపురలో విషాదం... పైపులైన్ మరమ్మతులు చేస్తుండగా దుర్ఘటన
- సంఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి... చికిత్స పొందుతూ మరొకరు..
- డీఆర్ఎఫ్, రెస్క్యూటీమ్ సహాయంతో మృతదేహాల వెలికితీత
- సుమారు 12 ఫీట్ల లోతులో మ్యాన్‌హోల్... భద్రతా ప్రమాణాలు పాటించకుండా మ్యాన్‌హోల్‌లో దిగిన కార్మికులు



మ్యాన్‌హోల్ నుండి మృతదేహాలను బయటకు తీస్తున్న రెస్క్యూ టీమ్

హైదరాబాద్: డ్రైనేజీ పైపులైన్ మరమ్మతులు చేస్తుండగా...మ్యాన్‌హోల్‌లో ఒక్కసారిగా మురుగు నీరు చుట్టుముట్టి..విషవాయువులు వెలువడడంతో ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర సంఘటన కుల్సుంపుర పరిధిలో జరిగింది. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని 100 ఫీట్ల జాతీయ రహదారిలో గత కొన్ని నెలలుగా పైప్‌లైన్ నిర్మాణం, మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్(40),వెంకట్రాములు(48), నారాయణఖేడ్‌కు చెందిన హన్మంతు (40)లు పురానాపూల్ వందఫీట్ల జాతీయ రహదారిలో కొనసాగుతున్న సివరేజీ పనుల్లో భాగంగా సుమారు 12 ఫీట్ల లోతులో ఉన్న మ్యాన్‌హోల్‌ను తెరిచి..నిచ్చెన సహాయంతో లోపలికి దిగారు. మరమ్మతుల నిమిత్తం మురుగునీరు వచ్చే ప్రాంతంలో అడ్డుగా ఉంచిన ఇసుక సంచులను వీరు తొలగిస్తున్న క్రమంలో పైప్‌లైన్ నుండి ఒక్కసారిగా విషవాయువు బయటకు వచ్చింది. దీంతో ఊపిరాడక ఇద్దరు కార్మికులు లోపలే చనిపోగా... వెంకట్రాములు అనే కార్మికుడిని పైకి లాగి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఆర్ఎఫ్ రెస్క్యూ టీమ్ తాళ్ల సహాయంతో మృతదేహాలను పైకి లాగి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పెద్ద ఎత్తున స్థానికులు, వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ, ప్రాజెక్ట్ వింగ్ అధికారులు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి భద్రత లేకుండా కార్మికులు మ్యాన్‌హోల్‌లోకి దిగడం వల్లనే మృతి చెందారని స్థానికులు తెలిపారు.

ఆ మైనర్లను ఇబ్బంది పెట్టకండి

ర్యాష్ డ్రైవింగ్ కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రగతి భవన్ ఎదురుగా డిసెంబర్‌లో జరిగిన ర్యాష్ డ్రైవింగ్ కేసులో బీఎండబ్ల్యూ కారులో వెనుక కూర్చున్న ఇద్దరు మైనర్లను ఇబ్బంది పెట్టవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. గత డిసెంబర్‌లో ప్రగతిభవన్ ఎదురుగా ఉన్న బ్యారికేడ్లను ఢీకొన్న కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సాహిల్‌తో పాటు కారులో ఉన్న అతని స్నేహితులను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. అయితే ఈ కేసులో తమ పిల్లలను సాక్షుల జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు హైకోర్టులో శుక్రవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాస నం విచారణ జరిపింది. వాంగ్మూలాలు నమోదు చేసేందుకు తరుచూ పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరుతున్నారని.. ఇద్దరు పిల్లల్లో ఒకరు పదో తరగతి పరీక్షలకు హాజరుకావాల్సి ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాది చెప్పారు. మార్చి 22 వరకు పరీక్షలు ఉండటంతో.. మార్చి 23 వరకు ఆ మైనర్లను ఇబ్బంది పెట్టవద్దని పంజాగుట్ట స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ధర్మాస నం ఆదేశించింది. ఆ తర్వాత చట్టప్రకారం ముందుకు వెళ్లాలని స్పష్టం చేసింది.



మంచి అలవాట్లు మెరుగైన ఆరోగ్యం

మంచి అలవాట్లు మన జీవితాలను మెరుగుపరుస్తాయి అని స్టీఫెన్ కోవీ తన '7 హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్'లో చెప్పాడు. అదే సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు జీవనశైలి మన ఆరోగ్యాన్ని, శక్తి స్థాయిలని, పని చేసే సామర్థ్యాన్ని, మెరుగుపరచడంతోపాటు జీవన శైలి వ్యాధులను నివారించడంలో కూడా తోడ్పడతాయి. ఇంతకీ ఆ అలవాట్లేమిటో తెలుసుకుందామా... ఎవరికైనా సరే, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కొన్ని అలవాట్లు...

రోజును ముందుగానే ప్రారంభించటం...

తొందరగా నిద్ర లేవాలి, తొందరగా నిద్రపోవాలి అనే సూత్రాన్ని చాలామంది పాటిస్తుంటారు. అయితే ఈ సూత్రాన్ని పని చేసే రోజుల్లోనే అంటే వర్కింగ్ డేస్‌లో మాత్రమే పాటిస్తూ, సెలవ రోజుల్లో పక్కన పెట్టేస్తారు. అలా కాకుండా వారాంతాల్లోనూ, సెలవు రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకు త్వరగా నిద్రలేచి త్వరగా మన దినచర్యను ప్రారంభించే అలవాటు స్వీయ క్రమశిక్షణకు చిహ్నం. అంతేకాదు, తొందరగా నిద్రలేవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారని అనేక పరిశోధనల్లో రుజువైంది కూడా.

శుద్ధి చేసిన చక్కెరకు నో చెప్పండి

చక్కెరలో ఎటువంటి పోషకాలు లేవు. ఎందుకంటే ఇది ప్రాసెసింగ్ ద్వారా వెళుతుంది. ప్రాసెస్ చేసిన చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల మీ శరీరంలోని ముఖ్యమైన పోషకాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. బదులుగా మినరల్ షుగర్, పామ్ షుగర్, బెల్లం లేదా తేనెకు మారడం మంచిది.

సముద్రపు ఉప్పుకు మారండి

చిప్స్, బర్గర్‌ల నుండి వేపుళ్ల వరకు ప్రతిదీ ఉప్పుతో నిండి ఉంటుంది. వాటిని చాలా రుచికరమైనదిగా చేస్తుంది. మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, డీహైడ్రేషన్, హైపర్‌టెన్షన్, కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అయోడైజ్డ్ సాల్ట్‌కు బదులు సముద్రపు ఉప్పు, రాక్ సాల్ట్ లేదా హిమాలయన్ పింక్ సాల్ట్‌కి మారండి. ఇవి ఆరోగ్యకరమైనవి.

ఆరోగ్యకరమైన అల్పాహారం

అల్పాహారం తీసుకోవడం అనేది రోజులో అత్యంత ముఖ్యమైన విషయం.. మీకు ఉదయం సమయం లేకపోతే, ఏవైనా పండ్లు లేదా కొన్ని గింజలను అయినా తీసుకోవచ్చు. ఆ తర్వాత పనిలో తినగలిగే అల్పాహారాన్ని ప్యాక్ చేసుకుని తీసుకెళ్లి తినాలి. అంతేకానీ, మొత్తంగా బ్రేక్ ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు.

కనీస వ్యాయామం

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయలేరు. కానీ ఫిట్‌గా ఉండటానికి ట్రిక్ యాక్టివ్‌గా ఉండటమే. ఫిట్‌గా ఉండేందుకు రోజుకు పదివేల అడుగులు వేయడం సరైనదని పరిశోధనలు చెబుతున్నాయి. మన కదలికలు తగినంతగా లేకపోతే, మనలో చురుకుదనం లోపిస్తుంది. కొవ్వు పేరుకునిపోతుంది. అందువల్ల భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడిచేందుకు ప్రయత్నించండి. అదేవిధంగా తక్కువ దూరాలను చేరుకునేందుకు వాహనాలను ఉపయోగించడానికి బదులు నడిచి వెళ్లే అలవాటు చేసుకోవడం మంచిది.

మంచి నిద్ర

శరీర సాధారణ పనితీరును, నాడీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సహాయపడేవాటిలో నిద్ర కీలకమైనది.. నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలిని నేరుగా ప్రభావితం చేసే మగత, అలసట, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర లేమి మెదడుపై నియంత్రణను కోల్పోయేలా చేస్తుంది. అందువల్ల రోజూ కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర పోవడం అవసరం. ఒకవేళ మీకు నిద్ర పట్టని సమస్య ఉంటే, ఏదైనా పుస్తకాన్ని చదవడం, చక్కటి సంగీతాన్ని వినడం, ధ్యానం చేయడం ద్వారా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫలితం లేకపోతే వైద్య సహాయం తీసుకోవాలి.

నవ్వుతూ ఉండటం

మిమ్మల్ని మీరు పాజిటివ్ వైబ్స్‌తో నింపుకోవడానికి ఇదే సులభమైన పద్ధతి. నవ్వు లేని జీవితం శూన్యం. నవ్వు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది మానసిక స్థితిని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది. అందుకే నవ్వండి, ఆరోగ్యంగా ఉండండి!

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం

రోజువారీ ఆహారంలో వివిధ రకాలైన పండ్లు, ఆకు కూరలు, మొలకలు, పప్పులు, మాంసం, పౌల్ట్రీ ఫుడ్, సీ ఫుడ్ ఉండాలి. మీ ఆహారంలో ప్రొటీన్లు, ఫైబర్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగానూ, కార్బోహైడ్రేట్లు, క్యాలరీలు తక్కువగానూ ఉండేలా చూసుకోవాలి.అలాగే, మీరు మీ ఆహారాన్ని ఎలా తింటారు లేదా నమలాలి అనేది కూడా ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం కావాలంటే 20–30 సార్లు నమలాలి.

బాగా నీరు తాగడం

మన శరీరంలోని ప్రతి కణం, కణజాలం, ప్రతి అవయవానికి అవసరమైన మొత్తంలో నీరు తాగటం అవసరం. ఇతర పానీయాల కంటే తాగునీరు ఎల్లప్పుడూ మంచి ఎంపిక. హైడ్రేటెడ్‌గా ఉండటానికి మీతో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉంచుకోవడం అవసరం. ప్రతి అరగంటకు ఒకసారి కొన్ని గుక్కల నీరు తాగడం మంచిది.

టీ/కాఫీ తీసుకోవడం తగ్గించండి

పనిలో అనేక కప్పుల ప్రాసెస్ చేయబడిన కెఫిన్ తీసుకోవడం అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. మిల్క్ పౌడర్, పంచదార, పైగా ఉడికించిన టీ, రెడీ మిక్స్ కాఫీ, అన్నీ క్యాలరీలతో నిండి ఉన్నాయి. అందువల్ల పూర్తిగా మానేయనక్కర లేదు కానీ పరిమితంగా తీసుకోవడం మంచిది.

పరిశుభ్రత పాటించడం

నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఇంటిని, వంటిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్న అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ సామాజిక జీవితాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

హెల్త్ టిప్స్



గుడ్డులోని తెల్లసొనను తినడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించుకోవచ్చు. దీన్ని తినడం వల్ల అన్ని రకాల గుండె సమస్యలను దూరం చేస్తుంది. ఈ క్రమంలో మీరు రోజూ తినే ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చు.



బాదం నూనెలో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు పోతుంది. ఒక గిన్నెలో కొద్దిగా బాదం నూనెను తీసుకొని.. అందులో కొద్దిగా నిమ్మ రసాన్ని మిక్స్ చేసి.. ఆ తర్వాత జుట్టుకు అప్లై చేయాలి. అలా కొద్దిసేపు చేతులతో తలపై మసాజ్ చేయాలి. మసాజ్ చేసిన తర్వాత అవసరమైతే.. గంట తర్వాత లేదా మరుసటి రోజు షాంపూతో మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.



నిద్ర లేచిన తర్వాత మీకు మెడ నొప్పిగా అనిపిస్తే.. నొప్పి ప్రభావిత ప్రాంతాల్లో ఐస్ ప్యాక్ లేదే చల్లని నీటిలో నింపిన క్లాత్ ను వేసి అద్దాలి. అలా చేయడం వల్ల మెడ కండరాల వాపు తగ్గుతుంది. దీంతో పాటు హీట్ ప్యాక్ ను ఉపయోగించవచ్చు. ఇది కూడా మెడ కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

మెడ నొప్పిగా ఉన్న వాళ్లు చేతులతో మెడను నెమ్మదిగా మసాజ్ చేయాలి. అలా చేయడం వల్ల కండరాలు సర్దుకొని నొప్పి తగ్గే అవకాశం ఉంది. మసాజ్ చేసే సమయంలో కొబ్బరి లేదా నువ్వుల నూనె ఉపయోగిస్తే మేలు జరుగుతోంది. మెడ నొప్పిని నివారించేందుకు మీరు రాత్రిళ్లు బోర్లా పడుకోకుండా ఉంటే చాలు.

బార్లీతో బోలెడన్ని సమస్యలు దూరం

వేసవి వచ్చేసింది... వేడితో అనేక సమస్యలు ఎదురవుతాయి. అన్నం తినాలనిపించదు. తినకపోతే ఆకలి. డీహైడ్రేషన్ సమస్యలు తప్పవు. అయితే వేసవిలో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీనీళ్లతో చెక్ పెట్టొచ్చు. కేవలం వేసవి సమస్యలకే కాదు... అనేక ఆరోగ్య సమస్యలకు బార్లీ బాగా పని చేస్తుంది. అదెలాగో చూద్దాం...

పూర్వం ఎవరికైనా జ్వరం వచ్చిందంటే నీరసం నుంచి కోలుకోవడానికి బార్లీ నీళ్లు, సగ్గుజావ తాగించేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కూడా బార్లీ కనిపిస్తోంది కానీ, అక్కడక్కడా... అప్పుడప్పుడూ మాత్రమే. కేవలం జ్వరంలోనే కాదు, వేసవిలో బార్లీ వాడకం చాలా మంచిది. అదెలాగో చూద్దాం...



➡ వేసవిలో తిన్నది అరగక పోవడం సాధారణ సమస్య. అలాంటప్పుడు బార్లీ నీళ్లు తాగితే చాలా మంచిది. జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది ➡ పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్న, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే ➡ మధుమేహులకు కూడా బార్లీ చాలా మేలు చేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయులను అదుపులో ఉంచుతుంది. ఇన్సులిన్ కూడా అదుపులోనే ఉంటుంది ➡ ఇక గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు ➡ బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి ➡ మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఉదయాన రోజూ గ్లాసుడు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. సూక్ష్మమైన రాళ్లు కూడా కరిగిపోతాయి.

సినిమా

ధ్రువ్‌కు జోడీగా..?



● అనుపమా పరమేశ్వరన్

తమిళ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనుంది. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారట. అనుపమాకి ఇటీవల మారి సెల్వరాజ్ ఈ కథను వినిపించగా, ఈ బ్యూటీ ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ టాక్. మరి.. ధ్రువ్ విక్రమ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15న తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రారంభం కానుందని సమాచారం.

జస్ట్ సూపర్ మేన్.. అంతే!

"కథ రాయడం మొదలుపెట్టి, తొలి డ్రాఫ్ట్ పూర్తి చేసేవరకూ నా సినిమాకు 'సూపర్‌మేన్: లెగసీ' అనే టైటిల్‌నే అనుకున్నాను. కానీ ఫైనల్ డ్రాఫ్ట్ పూర్తి చేశాక 'లెగసీ'ని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా సినిమా టైటిల్ జస్ట్ 'సూపర్‌మేన్'... అంతే. మా ఈ సూపర్‌మేన్ వచ్చే ఏడాది జూలై 11న మీ ముందుకు వస్తాడు'' అని సామాజిక మాధ్యమాల ద్వారా దర్శకుడు జేమ్స్ గన్ పేర్కొన్నారు. సూపర్‌మేన్ క్యారెక్టర్‌తో ఇప్పటివరకూ 'సూపర్‌మేన్' ఫ్రాంచైజీలను నిర్మించిన డీసీ స్టూడియోస్ తాజా సూపర్‌మేన్ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే సూపర్‌మేన్‌ని కొత్త రకంగా చూపించనున్నారు జేమ్స్ గన్. ఇప్పటివరకూ వచ్చిన చిత్రాల్లో సూపర్‌మేన్ ధరించిన సూట్‌కి భిన్నంగా తాజా చిత్రంలోని సూపర్‌మేన్ సూట్ ఉంటుందట. కాగా ఈ మధ్యకాలంలో సూపర్‌మేన్ అంటే నటుడు హెన్రీ కవిల్ గుర్తొస్తారు. 2013 నుంచి 2021 వరకూ డీసీ స్టూడియోస్ నిర్మించిన సూపర్‌మేన్ చిత్రాల్లో టైటిల్ రోల్‌లో అద్భుతంగా ఒదిగిపోయారు హెన్రీ. కానీ, తాజా చిత్రంలో ఈ పాత్రను డేవిడ్ కోరెన్స్‌వెట్ చేయనున్నారు. "సూపర్‌మేన్ జీవితంలోని పూర్వ భాగంపై ఈ చిత్రం ఉంటుంది. ఈ పాత్రను హెన్రీ కవిల్ చేయలేడు. అందుకే డేవిడ్ కోరెన్స్‌వెట్‌ని తీసుకున్నాం'' అని జేమ్స్ గన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటి వరకూ మూడు నాలుగు చిత్రాల్లో మాత్రమే నటించిన 30 ఏళ్ల డేవిడ్ కోరెన్స్‌వెట్‌కి 'సూపర్‌మేన్' చాన్స్ రావడం అనేది గొప్ప విషయం అని హాలీవుడ్ అంటోంది.



● డేవిడ్ కోరెన్స్‌వెట్

కాశీలో క్లాప్



● తమన్నా, సంపత్ నంది

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల 2'. 2022లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్. సింహా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ పై డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. రెగ్యులర్ షూటింగ్‌ని కూడా కాశీలోనే ఆరంభించారు. తొలి సీన్‌కి సంపత్ నంది క్లాప్ కొట్టారు. ''ఓదెల 2' గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ చిత్రకథ ఉంటుంది. క్యాస్టింగ్, కథ, వీఎఫ్ఎక్స్.. టోటల్‌గా మేకింగ్ పరంగా ఈ చిత్రం పెద్దగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

కొత్త పాయింట్‌తో తీశారనిపిస్తోంది

- రాజేంద్ర ప్రసాద్



● ఆయూషీ పటేల్, రాజేంద్ర ప్రసాద్, విశ్వ కార్తికేయ

విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో...'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''కలియుగం పట్టణంలో..' టైటిల్ కొత్తగా ఉంది. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. నా 'ఆ నలుగురు' సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడు. ఇప్పుడు హీరోగా నటించాడు. ప్రేక్షకులు ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఓ రోల్ చేస్తున్నాను'' అన్నారు. ''మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి ఈ సినిమా తీశారు. చిత్రా శుక్లా ఓ స్పెషల్ రోల్ చేశారు'' అన్నారు విశ్వ కార్తికేయ. ''మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు రమాకాంత్ రెడ్డి. ''మా టీజర్, ట్రైలర్‌ను చూసి కథను అంచనా వేయలేరు. సినిమా అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను కడపలోనే చేశాం'' అన్నారు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి. ''సినిమా అంతా కడపలోనే తీయడం ఇదే తొలిసారి. కడప నుంచి ఓ మంచి నిర్మాత రాబోతున్నాడు'' అన్నారు దర్శకుడు నీలకంఠ.

ఎనిమిది భాషల్లో రికార్డు బ్రేక్

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్యకృష్ణ, కాశీ విశ్వనాథ్ ముఖ్య తారలుగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పై చదలవాడ పద్మావతి నిర్మించిన చిత్రం 'రికార్డు బ్రేక్'. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 8 భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మళ్లీ పుట్టి వచ్చినవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో వరికుప్పల యాదగిరి ఈ పాటకు లిరిక్స్ అందించి, పాడారు. ''అందరికీ నచ్చేలా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు చదలవాడ శ్రీనివాసరావు.



● కాశీ విశ్వనాథ్, చదలవాడ శ్రీనివాసరావు

సాక్షి బిజినెస్
శనివారం
2-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,245	73,745
నిఫ్టీ ▲	355	22,339

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	16,236	▲ 144
డోజోన్స్	39,063	▲ 66
ఎఫ్‌టీఎస్ఈ 100	7,683	▲ 52
డాక్స్	17,735	▲ 57
షాంఘై	3,027	▲ 12
నికాయ్	39,911	▲ 745

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	61,720
బంగారం (22 క్యారెట్)	58,780
వెండి (కేజీ)	76,200

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.47	83.49
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	103.55	106.11
€	యూరో	ఒకటికి	88.60	90.95
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	54.58	55.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	53.07	54.99
S$	సింగపూర్ డాలర్	ఖాయమైనవి	59.27	63.94
SAR	సౌదీ రియాల్	ఖాయమైనవి	21.20	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమైనవి	21.67	23.47
¥	చైనా యువాన్	ఖాయమైనవి	10.40	12.47

తయారీ చక్రం స్పీడ్



ఫిబ్రవరిలో 56.9కి సూచీ

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం ఫిబ్రవరిలో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.9కి ఎగసింది. ఇది ఐదు నెలలు గరిష్ట స్థాయి. జనవరిలో సూచీ 56.5గా నమోదయ్యింది. సమీక్షా నెల్లో సూచీకి దేశీయ, అంతర్జాతీయ డిమాండ్ సహకారం లభించినట్లు ఈ మేరకు వెలువడిన ఒక నెలవారీ సర్వే పేర్కొంది. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ద్రవ్యోల్బణం 2023 జూలై కనిష్ట స్థాయికి తగ్గడంతో తయారీ సంస్థల మార్జిన్లు మెరుగుపడినట్లు సర్వే పేర్కొనడం గమనార్హం. దాదాపు 400 మంది తయారీదారుల ప్యానెల్‌లో కొనుగోలు చేసే మేనేజర్‌లకు పంపిన ప్రశ్నలు, ప్రతిస్పందనలను ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మదింపుచేసే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పీఎంఐని ఆవిష్కరిస్తుంది.

ఎల్ఐసీ రూ. 2,441 కోట్ల డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) కేంద్ర ప్రభుత్వానికి రూ. 2,441 కోట్ల డివిడెండ్ చెల్లించింది. ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి నుంచి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు చెక్ అందుకున్నారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ వివేక్ జోషి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
2-3-2024	
విశాఖ	500-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460-00
విజయవాడ	460-00
రిటైల్ ధర (డజను)	72.00
1-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	426-00
వరంగల్	428-00
రిటైల్ ధర	4.85

జీఎస్‌టీ వసూళ్లు @ రూ.1.68 లక్షల కోట్లు

- ఫిబ్రవరిలో 12.5 శాతం అప్
- కొత్త పరోక్ష పన్ను వ్యవస్థలో నాల్గవ అతి భారీ వసూళ్లు
- ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య 12 శాతం పురోగతి
- రూ. 18.40 లక్షల కోట్ల వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఫిబ్రవరిలో రూ.1,68,337 కోట్లుగా నమోదయ్యాయి. 2023 ఇదే నెలతో పోల్చితే ఈ వసూళ్ల వృద్ధి 12.5 శాతం. ఇక 2017 జూలైలో కొత్త పరోక్ష పన్ను వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఇవి నాల్గవ అతి భారీ వసూళ్లు. దేశీయ అమ్మకాలు, దిగుమతులు, పన్ను ఎగవేతల నిరోధానికి చర్యలు తాజా ఫలితానికి కారణం. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్య వసూళ్లు అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే 11.7% పెరిగి రూ.18.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నెలవారీ సగటు వసూళ్లు వార్షికంగా రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.1.67 లక్షల కోట్లకు పెరిగింది.

విభాగాల వారీగా...

- సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.31,785
- స్టేట్ జీఎస్‌టీ రూ.39,615 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.84,098 కోట్లు (దిగుమతి వస్తువులపై వచ్చిన రూ.38,593 కోట్ల సెస్ సహా)
- సెస్ రూ.12,839 కోట్లు (దిగుమతి వస్తువులపై వసూలయిన రూ.984 కోట్ల సెస్ సహా)

ఆర్థిక సంవత్సరంలో (అంకెలు రూ. లక్షల కోట్లలో)	
ఏప్రిల్ 2023	1.87
మే	1.57
జూన్	1.61
జూలై	1.60
ఆగస్టు	1.59
సెప్టెంబర్	1.63
అక్టోబర్	1.72
నవంబర్	1.67
డిసెంబర్	1.64
జనవరి 2024	1.74
ఫిబ్రవరి	1.68

2023 ఏప్రిల్, 2024 జనవరి, 2023 అక్టోబర్, 2024 ఏప్రిల్ ఇప్పటి వరకూ భారీ వసూళ్లలో తొలి 4 నెలలుగా నిలిచాయి.



సరికొత్త శిఖరాలపై సూచీలు

గణాంకాల జోష్ ● అమెరికాలో దిగివచ్చిన ద్రవ్యోల్బణం ● ర్యాలీకి లార్జ్ క్యాప్ షేర్ల దన్ను



ముంబై: దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో శుక్రవారం దలాల్ స్ట్రీట్ బుల్ దుమ్మురేపింది. అమెరికా ద్రవ్యోల్బణం దిగిరావడం, విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్లు కలిసొచ్చాయి. లార్జ్ క్యాప్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(2%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (2%), ఐసీఐసీఐ బ్యాంక్ (3%), ఎల్‌అండ్‌టీ (4%)లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా శుక్రవారం స్టాక్ సూచీలు 2023 డిసెంబర్ 5 తర్వాత అతిపెద్ద ఒకరోజు లాభాల్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,245 పాయింట్లు పెరిగి 73,745 ముగిసింది. నిఫ్టీ 355 పాయింట్లు బలపడి 22,339 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలకు ఇది జీవితకాల గరిష్ట ముగింపు కావడం విశేషం. ఒక దశలో సెన్సెక్స్ 1,319 పాయింట్లు దూసుకెళ్లి 73,819 వద్ద, నిఫ్టీ 370 పాయింట్లు బలపడి 22,353 వద్ద జీవితకాల గరిష్ట స్థాయిని చూశాయి.

నేడు.. ట్రేడింగ్

సెలవు దినం అయినప్పటికీ శనివారం (నేడు) స్టాక్ మార్కెట్ పని చేస్తుంది. "డిజాస్టర్ రికవరీ సైట్ ట్రయల్స్‌లో భాగంగా శనివారం ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నాము" ఎక్స్ఛేంజీలు తెలిపాయి. ఉదయం 9:15 నుంచి 10 గంటల మధ్య ప్రధాన సైట్ ద్వారా తొలి ట్రేడింగ్ సెషన్, ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 మధ్య రెండో ట్రేడింగ్ జరగనుంది.

ఇన్వెస్టర్ల సంపద భారీ జంప్

సెన్సెక్స్ భారీ ర్యాలీతో బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4.29 లక్షల కోట్లు పెరిగి రూ. 392.25 లక్షల కోట్లకు చేరింది.

పేమెంట్స్ బ్యాంకుతో పేటీఎం ఒప్పందాల ఉపసంహరణ


యథావిధిగా యాప్, క్యూఆర్ కోడ్, సౌండ్ బాక్స్



న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై (పీపీబీఎల్) ఆర్‌బీఐ చర్యల నేపథ్యంలో దానితో అంతర్గత ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం నిర్ణయించుకుంది. దీనికి బోర్డు ఆమోదముద్ర వేసినట్లు కంపెనీ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్.. స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఒకదానిపై మరొకటి ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు తమ మధ్య అంతర్గత ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని పేటీఎం, పీపీబీఎల్ పరస్పరం ఒక అంగీకారానికి వచ్చినట్లు వివరించింది. గతంలో ప్రకటించినట్లుగానే తమ పేటీఎం యాప్, క్యూఆర్, సౌండ్‌బాక్స్, కార్డ్ మెషీన్లు యథావిధిగా నిరాటంకంగా పని చేస్తాయని కంపెనీ తెలిపింది. పదే పదే నిబంధనల ఉల్లంఘన కారణంగా మార్చి 15 నుంచి దాదాపు కార్యకలాపాలన్నింటినీ నిలిపివేయాలంటూ పీపీబీఎల్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఫిబ్రవరిలోనూ 'రయ్ రయ్'

- ఎస్‌యూవీలకు డిమాండ్ ప్రభావం
- కార్లు, టూ వీలర్స్ అమ్మకాలు అప్
- తిరోగమనంలో ట్రాక్టర్ల విక్రయాలు



ముంబై: స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)కు ఆదరణ పెరగడంతో ఫిబ్రవరిలోనూ రికార్డు స్థాయిలో వాహనాలు అమ్ముడయ్యాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రాఅండ్‌మహీంద్రా, టయోటా కిర్లోస్కర్ మోటార్, హోండా కార్స్ కంపెనీల అమ్మకాల్లో వృద్ధి నమోదైంది. మొత్తం 3.73 లక్షల ప్యాసింజర్ వాహన(పీవీ) విక్రయాలు జరిగాయి. తద్వారా పరిశ్రమ చరిత్రలో అత్యధిక పీవీలు అమ్ముడైన మూడో నెలగా ఫిబ్రవరి ఆవిర్భవించింది. ద్విచక్ర వాహనాలకూ డిమాండ్ కొనసాగింది. కాగా ట్రాక్టర్స్ అమ్మకాల వృద్ధిలో క్షీణత జరిగింది.

వాహన విక్రయాలు			
కంపెనీ	ఫిబ్రవరి 2024	ఫిబ్రవరి 2023	(%ల్లో)
మారుతీ సుజుకీ	1,97,471	1,72,321	(+)15
హ్యుందాయ్ మోటార్స్	60,501	57,851	(+)4.5
టాటా మోటార్స్	86,406	79,705	(+)8
ఎంఅండ్‌ఎం	72,923	58,801	(+)24
హోండా కార్స్	7,142	6,086	(+)17
ఎంజీ మోటార్స్	4,532	4,193	(+)8
టయోటా కిర్లోస్కర్	25,220	15,685	(+)61
బజాజ్ ఆటో	3,46,662	2,80,226	(+)35
టీవీఎస్ మోటార్స్	3,68,424	2,76,150	(+)33
రాయల్ ఎన్‌ఫీల్డ్	75,935	71,544	(+)6
హోండా మోటార్స్	4,58,711	2,47,195	(+)86
హీరో మోటోకార్ప్	4,68,410	3,94,460	(+)19
సుజుకీ మోటార్	97,435	70,621	(+)38
వోల్వో ఐషర్	7,424	7,289	(+)2
అశోక్ లేలాండ్	16,451	17,568	(-)6
ఎస్కార్ట్స్	6,481	7,811	(-)17
మహీంద్రా ట్రాక్టర్స్	21,672	25,791	(-)16

10 యాప్ సంస్థలపై గూగుల్ చర్యలు

సర్వీస్ ఫీజు చెల్లించనందుకు ప్లేస్టోర్ నుంచి తొలగింపు షురూ ● లిస్టులో మ్యాట్రిమోనీడాట్‌కామ్, ఆల్ట్, కుకు ఎఫ్‌ఎం మొదలైనవి!

న్యూఢిల్లీ: సర్వీస్ ఫీజు చెల్లింపుల వివాదం కారణంగా టెక్ దిగ్గజం గూగుల్ పలు యాప్ సంస్థలపై చర్యలకు ఉపక్రమించింది. వాటిని తమ ప్లేస్టోర్ నుంచి తొలగించే ప్రక్రియ ప్రారంభించింది. అనేక అవకాశాలు ఇచ్చినప్పటికీ, తమ ప్లాట్‌ఫామ్‌తో ప్రయోజనం పొందుతున్న 'పేరొందిన' పది సంస్థలు ఫీజులు చెల్లించడం లేదని సంస్థ పేర్కొంది. అయితే, గూగుల్ సదరు సంస్థల పేర్లను నిర్దిష్టంగా వెల్లడించలేదు. కానీ, షాదీ, మ్యాట్రిమోనీడాట్‌కామ్, భారత్ మ్యాట్రిమోనీ వంటి యాప్స్‌ కోసం ఆండ్రాయిడ్ ఫోన్లపై సెర్చి చేస్తే వాటి పేర్లు కనిపించకపోవడంతో జాబితాలో అవి ఉన్నట్లుగా పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే బాలాజీ టెలిఫిల్మ్స్‌కి చెందిన ఆల్ట్ (గతంలో ఆల్ట్‌బాలాజీ), ఆడియో ప్లాట్‌ఫాం కుకు ఎఫ్‌ఎం, డేటింగ్ సర్వీస్ యాప్ క్వాక్‌క్వాక్, ట్రూలీ మ్యాడ్లీ కూడా ప్లేస్టోర్ నుంచి మాయమయ్యాయి. ఇన్-యాప్ పేమెంట్స్‌పై గూగుల్ 11 నుంచి 26 శాతం ఫీజులను విధిస్తుండటంపై నెలకొన్న వివాదం ఈ పరిణామానికి దారి తీసింది. ప్లాట్‌ఫాం ఫీజుపై పోరాడుతున్న కంపెనీలకు అనుకూలంగా సుప్రీం కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతో నిబంధనలను పాటించని యాప్‌లను గూగుల్ తొలగించడం ప్రారంభించింది. ఉచిత డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌ను ఆఫర్ చేస్తూ ఇండస్ యాప్ స్టోర్‌ను ఫోన్‌పే ప్రవేశపెట్టిన తరుణంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఇది గుత్తాధిపత్య ధోరణి..: కుకు ఎఫ్‌ఎం

కాగా, గూగుల్ గుత్తాధిపత్య ధోరణితో వ్యవహరిస్తోందని కుకు ఎఫ్‌ఎం సహ-వ్యవస్థాపకుడు వినోద్ కుమార్ వ్యాఖ్యానించగా, ఇది భారత్‌లో ఇంటర్నెట్‌కు దుర్దినంగా భారత్ మ్యాట్రిమోనీ వ్యవస్థాపకుడు మురుగవేల్ జానకిరామన్ అభివర్ణించారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ పెండింగ్‌లో ఉన్నందున ఎటువంటి చర్యలు తీసుకోవద్దని, ఏ యాప్‌ను డీలిస్ట్ చేయొద్దని గూగుల్‌కి ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ (ఐఏఎంఏఐ) సూచించింది.

సాక్షి స్పోర్ట్స్



పోరాడి ఓడిన సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి, భారత రెండో ర్యాంకర్ సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. గురుగ్రామ్‌లో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 5-7, 6-3, 0-6తో టాప్ సీడ్ దలీలా జకుపోవిచ్ (స్లొవేనియా) చేతిలో ఓడిపోయింది. మరోవైపు భారత నంబర్‌వన్ అంకిత రైనా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో అంకిత 4-6, 6-2, 6-4తో జాక్వెలిన్ (స్వీడన్)పై గెలిచింది.

గాయత్రి-ట్రెసా జోడీ పరాజయం

జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారిణుల కథ ముగిసింది. మహిళల డబుల్స్ బరిలో మిగిలిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి క్వార్టర్ ఫైనల్లో ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 16-21, 14-21తో లి యి జింగ్-లు జు మిన్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది.



రయ్..రయ్...రయ్...

నేటి నుంచి ఫార్ములావన్ సీజన్

సాఖిర్: గత ఏడాది పూర్తి ఆధిపత్యం చలాయించిన రెడ్‌బుల్ జట్టు అదే జోరును ఈ ఏడాదీ కొనసాగించాలనే లక్ష్యంతో ఫార్ములావన్ (ఎఫ్1) 2024 సీజన్‌లో బరిలోకి దిగనుంది. మొత్తం 24 రేసులతో కూడిన ఈ సీజన్‌కు నేడు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి రేసుతో తెర లేవనుంది. శనివారం క్వాలిఫయింగ్ సెషన్... ఆదివారం ప్రధాన రేసు జరుగుతాయి. భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి గం. 9:30 నుంచి క్వాలిఫయింగ్ సెషన్‌ను... ఆదివారం రాత్రి 8:30 నుంచి ప్రధాన రేసును నిర్వహిస్తారు. ఫ్యాన్ కోడ్ యాప్‌లో ఎఫ్1 రేసుల ప్రత్యక్ష ప్రసారం ఉంది. గత సీజన్‌లో మొత్తం 22 రేసులు జరగ్గా... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లు వెర్‌స్టాపెన్ 19 రేసుల్లో, సెర్జియో పెరెజ్ 2 రేసుల్లో గెలిచారు. మరో రేసులో ఫెరారీ జట్టుకు చెందిన కార్లోస్ సెయింజ్ నెగ్గాడు. కొత్త సీజన్‌లో రెడ్‌బుల్ జట్టుతోపాటు వెర్‌స్టాపెన్ ప్రదర్శన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

యూకీ జోడీ ఓటమి



న్యూఢిల్లీ: దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) ద్వయం 3-6, 6-7 (2/7)తో ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా)-డోడిగ్ (క్రొయేషియా) జంట చేతిలో పరాజయం పాలైంది. యూకీ-హాస్‌లకు 48,760 డాలర్ల (రూ. 40 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

టెస్టుల్లో ఐర్లాండ్‌కు తొలి గెలుపు

అబుదాబి: టెస్టు హోదా లభించిన ఆరేళ్లకు ఐర్లాండ్ జట్టు ఎనిమిదో ప్రయత్నంలో తొలి విజయం నమోదు చేసింది. అఫ్గానిస్తాన్‌తో తటస్థ వేదిక అబుదాబిలో జరిగిన ఏకైక టెస్టులో ఐర్లాండ్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. గతంలో ఐర్లాండ్ ఏడు టెస్టులు ఆడి ఏడింటిలోనూ ఓడిపోయింది. అఫ్గానిస్తాన్ నిర్దేశించిన 111 పరుగుల విజయలక్ష్యాన్ని ఐర్లాండ్ 31.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. కెప్టెన్ ఆండీ బాల్‌బిర్నీ (58 నాటౌట్; 5 ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో ఐర్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అఫ్గానిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 155 పరుగులు... ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు సాధించాయి. 108 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన అఫ్గానిస్తాన్ 218 పరుగులకు ఆలౌటైంది.

పుణేరీ... విజయభేరి

ప్రొ కబడ్డీ లీగ్ విజేత పుణేరీ పల్టన్ | తొలిసారి చాంపియన్‌గా నిలిచిన జట్టు | ఫైనల్లో హరియాణా స్టీలర్స్‌పై గెలుపు



సాక్షి, హైదరాబాద్: కబడ్డీ అభిమానులను 91 రోజుల పాటు అలరించిన ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ అట్టహాసంగా ముగిసింది. అన్ని విధాలా ఆధిపత్యం ప్రదర్శించిన పుణేరీ పల్టన్ మొదటిసారి లీగ్ చాంపియన్‌గా అవతరించింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఆసక్తికరంగా జరిగిన ఫైనల్లో పల్టన్ 28-25 పాయింట్ల తేడాతో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 13-10తో ఆధిక్యంలో నిలిచిన పల్టన్ బలమైన డిఫెన్స్‌తో చివరి వరకు దానిని నిలబెట్టుకోవడంలో సఫలమైంది. గత సీజన్ ఫైనల్లో ఓడిన పుణేరీ వరుసగా రెండోసారి తుది పోరుకు అర్హత సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది.

మ్యాచ్‌లో ఇరు జట్లు ఆరంభం నుంచి జాగ్రత్తగా ఆడుతూ డిఫెన్స్‌కే ప్రాధాన్యతనిచ్చాయి. ఫలితంగా తొలి 10 నిమిషాల్లోనే 13 ఎంప్టీ రైడ్‌లు వచ్చాయి. ప్రతీ పాయింట్ కోసం ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా... ఒకదశలో పుణేరీ 9-7తో స్వల్ప ఆధిక్యంలోనే ఉంది. అయితే ఈ దశలో 19వ నిమిషంలో పంకజ్ మోహితే డు ఆర్ డై రెయిడ్ మ్యాచ్ దిశను మార్చింది. ఒకేసారి 4 పాయింట్లు సాధించి అతను పుణేను ముందంజలో నిలిపాడు. ఆ తర్వాత ఈ అంతరాన్ని తగ్గించడంలో స్టీలర్స్ విఫలమైంది. 23వ నిమిషంలో స్టీలర్స్‌ను పల్టన్ జట్టు ఆలౌట్ కూడా చేయడంతో ఆట పూర్తిగా వారివైపు మొగ్గింది. చివరి పది నిమిషాల్లో హరియాణా పుంజుకున్నా అది విజయానికి సరిపోలేదు. రెండో అర్ధ భాగంలో ఇరు జట్లూ 15 పాయింట్లు చొప్పున సమానంగా స్కోరు చేసినా... తొలి అర్ధ భాగంలో వెనుకబడిన 3 పాయింట్లే చివరకు స్టీలర్స్ ఓటమికి కారణమయ్యాయి. పల్టన్ తరఫున పంకజ్ మోహితే 9 పాయింట్లు సాధించగా... మోహిత్ 5, కెప్టెన్ అస్లమ్ 4 పాయింట్లు సాధించారు. స్టీలర్స్ ఆటగాళ్లలో అత్యధికంగా శివమ్ 6, సిద్ధార్థ్ దేశాయ్ 4 పాయింట్లు స్కోరు చేశారు. విజేతగా నిలిచిన పుణేరీ జట్టుకు రూ. 3 కోట్లు, రన్నరప్ హరియాణా జట్టుకు రూ. 1 కోటీ 80 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ విజేత జట్టుకు ట్రోఫీని అందజేశాడు.

> అద్భుతమైన ఆటతో లీగ్ దశలో అగ్రస్థానం... 22 మ్యాచ్‌లలో 17 విజయాలు... స్కోరు తేడాలో ఎవరికీ అందనంత ఎత్తులో ముందంజ... ఈ సీజన్‌లో ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన పుణేరీ పల్టన్ తమ జోరును తగ్గించకుండా అసలు పోరులోనూ సత్తా చాటి తమ స్థాయిని ప్రదర్శించింది... గత సీజన్‌లో త్రుటిలో చేజారిన ట్రోఫీని ఈసారి ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా ఒడిసి పట్టుకుంది... ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తొలిసారి చాంపియన్‌గా సగర్వంగా నిలిచింది. మొదటిసారి ఫైనల్ చేరిన హరియాణా స్టీలర్స్ ఆరంభంలో ఆకట్టుకున్నా... ఒత్తిడిలో తలవంచి రన్నరప్‌కే పరిమితమైంది.

మళ్లీ ఓడిన గుజరాత్

- యూపీ వారియర్స్‌కు రెండో విజయం
- రాణించిన సోఫీ, గ్రేస్ హారిస్



గ్రేస్ హారిస్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో గుజరాత్ జెయింట్స్ జట్టుకు 'హ్యాట్రిక్' ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ ఆరు వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచి తమ ఖాతాలో రెండో విజయం నమోదు చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 142 పరుగులు సాధించింది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (26 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్), యాష్లే గార్డ్‌నర్ (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో గుజరాత్ స్కోరు 100 దాటింది. అంతకుముందు లారా వొల్వార్ట్ (26 బంతుల్లో 28; 4 ఫోర్లు), కెప్టెన్ బెత్ మూనీ (16 బంతుల్లో 16; 2 ఫోర్లు), హర్లీన్ డియోల్ (24 బంతుల్లో 18; 1 ఫోర్) వేగంగా ఆడటంలో విఫలమయ్యారు. యూపీ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. అనంతరం యూపీ వారియర్స్ 15.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి విజయతీరాలకు చేరింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్ (33 బంతుల్లో 60 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించి యూపీ విజయంలో కీలకపాత్ర పోషించింది. నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.

ఆరేళ్ల తర్వాత...

మహిళా క్రికెటర్లకు దేశవాళీ రెడ్ బాల్ టోర్నీ



ముంబై: భారత దేశవాళీ క్యాలెండర్‌లో మహిళా క్రికెటర్ల కోసం ఆరేళ్ల తర్వాత రెడ్ బాల్ టోర్నీని నిర్వహించనున్నారు. ఈనెల 28 నుంచి ఏప్రిల్ 11 వరకు పుణేలో ఈ టోర్నీ జరుగుతుందని బీసీసీఐ తెలిపింది. మొత్తం ఆరు జోనల్ జట్లు (ఈస్ట్, నార్త్ ఈస్ట్, సెంట్రల్, వెస్ట్, నార్త్, సౌత్‌జోన్) ఈ టోర్నీలో పోటీపడతాయి. ప్రతి మ్యాచ్ మూడు రోజులపాటు జరుగుతుంది. నార్త్, సౌత్ జోన్ జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభించగా... ఈస్ట్-నార్త్ ఈస్ట్; వెస్ట్-సెంట్రల్ జోన్ జట్ల మధ్య నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో గెలిచిన జట్లు సెమీఫైనల్స్‌లో నార్త్, సౌత్ జోన్ జట్లతో ఆడతాయి. చివరిసారి 2018లో మహిళా క్రికెటర్లకు రెడ్ బాల్ టోర్నీని ఏర్పాటు చేయగా... ఆ సమయంలో రెండు రోజుల మ్యాచ్‌లు నిర్వహించారు.

ఆసీస్‌కు ఆధిక్యం

న్యూజిలాండ్ 179 ఆలౌట్



లయన్

వెలింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ఓవరాల్ ఆధిక్యం 217 పరుగులకు చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 279/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 115.1 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌటైంది. కామెరాన్ గ్రీన్ (174 నాటౌట్; 23 ఫోర్లు, 5 సిక్స్‌లు), హాజల్‌వుడ్ (22; 4 ఫోర్లు) పదో వికెట్‌కు 116 పరుగులు జోడించడం విశేషం. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ 43.1 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలింది. గ్లెన్ ఫిలిప్స్ (71; 13 ఫోర్లు), హెన్రీ (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. ఆసీస్ స్పిన్నర్ నాథన్ లయన్ 43 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో లయన్ టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో 521 వికెట్లతో 7వ స్థానానికి చేరుకున్నాడు. 204 పరుగుల భారీ ఆధిక్యం పొందిన ఆస్ట్రేలియా ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 13 పరుగులు సాధించింది.

హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్!



హెచ్ఎండీఏ పరిధిలోని

7 కార్పొరేషన్లు **30** మున్సిపాలిటీల విలీనం

ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసే యోచన..

లేకుంటే నాలుగు కొత్త కార్పొరేషన్లుగా విభజన

తూర్పు-పశ్చిమ-ఉత్తర-దక్షిణ హైదరాబాద్ సిటీలుగా పేర్లు.. సమాన జనాభా ఉండేలా డివిజన్ల పునర్విభజన

గ్రేటర్ సిటీలో అన్ని ప్రాంతాల ఏకరీతి అభివృద్ధే లక్ష్యం

అధ్యయనం చేయాలని మునిసిపల్ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను విలీనం చేసి ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను విలీనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో 30 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా, అన్నింటినీ కలిపి గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఒకే మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలా లేదా తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ హైదరాబాద్ సిటీల పేరుతో నాలుగు ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజించాలా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిని అన్ని వైపులా ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని సీఎం ఇటీవలే అధికారులను ఆదేశించారు.

ఇప్పుడున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం పూర్తయిన వెంటనే వాటికి స్పెషలాఫీసర్లను నియమించాలని, అన్నింటి పదవీకాలం ముగిసిన తర్వాత ఈ విలీన ప్రక్రియను ప్రారంభించాలని మున్సిపల్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఇటీవల సమాలోచనలు చేశారు. పదవీకాలం ముగిసిన తర్వాత విలీనం చేస్తే న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని యోచిస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిని యూనిట్‌గా తీసుకొని ఒకే గ్రేటర్ సిటీ కార్పొ రేషన్‌గా చేయటం, లేదా సిటీ మొత్తాన్ని 4 కార్పొరేషన్లుగా విభజించడం అనే అంశాన్ని పరిశీలించాలని మున్సిపల్ శాఖ అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

పాలకవర్గాల పదవీకాలం ముగిశాకే..

జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా ఏర్పడ్డ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని డివిజన్లకు నిధుల పంపిణీలో అసమానతలున్నాయని విమర్శలున్నాయి. కొన్ని డివిజన్ల పరిధిలో లక్ష మందికిపైగా జనాభా ఉండగా.. కొన్ని కార్పొరేషన్లలోని డివిజన్లలో కేవలం 30 వేల మంది మాత్రమే ఉన్నారు. మౌలిక వసతుల కల్పనకు కేటాయించే నిధులు, గ్రాంట్లను ఒకే తీరుగా కేటాయిస్తే కొన్ని ప్రాంతాలకు లాభం జరిగి, కొన్ని ప్రాంతాలు నష్టపోతున్నాయి. సిటీ విస్తరణకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వసతుల కల్పనకు ఎక్కువ నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే సిటీలో అభివృద్ధి చెందిన డివిజన్లకు తక్కువ నిధులు సరిపోతాయి. వీటన్నింటి దృష్ట్యా గ్రేటర్ హైదరాబాద్ సిటీని ఏకరీతిగా అభివృద్ధి చేసేందుకు ఈ విలీనం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లను జనాభా ప్రాతిపదికన పునర్విభజించాలని సూచించారు. ఇంచుమించుగా సమాన జనాభా ఉండేలా డివిజన్లను ఏర్పాటు చేయాలని, నియోజకవర్గాల సరిహద్దులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. అందుకు అవసరమైన పునర్విభజన ప్రక్రియపై ముందుగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

జనాభా ప్రాతిపదికన డివిజన్ల పునర్విభజన..

ఢిల్లీ కార్పొరేషన్ తరహాలో...

దేశ రాజధాని ఢిల్లీలో రెండేళ్ల కిందటే అక్కడున్న మూడు మునిసిపల్ కార్పొరేషన్లను ప్రభుత్వం ఒకే కార్పొరేషన్‌గా విలీనం చేసింది. అక్కడ జరిగిన విలీనం తీరు, అందుకు అనుసరించిన విధానాలను సీఎం మున్సిపల్ శాఖను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)తో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, బండ్లగూడ జాగీర్, నిజాంపేట, బడంగ పేట్, మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్లు, మరో 30 మున్సిపాలిటీలు ఉన్నాయి.

30 మున్సిపాలిటీలివే..

- రంగారెడ్డి జిల్లా: పెద్దఅంబర్‌పేట, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, శంకరపల్లి, తుక్కుగూడ
- మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా: మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్
- యాదాద్రి భువనగిరి జిల్లా: భువనగిరి, చౌటుప్పల్, పోచంపల్లి
- సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, చేర్యాల
- మెదక్ జిల్లా: తూప్రాన్, నర్సాపూర్

వారికి మూడు.. వీరికి రెండు



అక్కాచెల్లెళ్లకు మూడు.. దంపతులకు రెండేసి ప్రభుత్వోద్యోగాలు

బచ్చన్నపేట/కురవి: ఒక్కొక్కరు నాలుగేసి.. మూడేసి ప్రభుత్వోద్యోగాలు పొందుతున్న క్రమంలో.. ఆ జాబితాలో అక్కాచెల్లెళ్లు, దంపతులు చేరారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉమ్మెంతల దివ్య ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. దివ్య ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తోంది. గురుకుల ఫలితాల్లో జేఎల్, పీజీటీ, టీజీటీ 3 ప్రభుత్వ ఉద్యోగాలకు ఒకేసారి ఎంపికైంది. ఈమె సోదరి వకుళ కూడా 3 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన గంధసిరి వెంకటేశ్వర్లు-గీత దంపతులు. వీరిలో వెంకటేశ్వర్లు డిగ్రీ, జూనియర్ లెక్చరర్‌గా, గీత పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో దంపతులను గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.